అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సోమవారం 10-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 68 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

భారత్ తీన్‌మార్

మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ వశం
ఫైనల్లో న్యూజిలాండ్‌పై 4 వికెట్లతో గెలుపు
ఛేదనలో రోహిత్ శర్మ, శ్రేయస్ మెరుపులు 14లో..




జీ హుజూర్..!!

అగ్రరాజ్యానికి దాసోహమంటున్న మోడీ ప్రభుత్వం



గత వైఖరులు, విధానాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు



ప్రభుత్వాధినేతలు తమ ప్రసంగాలలో తరచూ 'స్వర్ణయుగం' అనే పదాన్ని ఉపయోగిస్తుంటారు. తమ పరిపాలన స్వర్ణయుగాన్ని గుర్తుకు తెస్తోందని వారు జబ్బలు చరుచుకుంటారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల కాంగ్రెస్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తూ 'స్వర్ణయుగం' గురించి ప్రస్తావించారు. భారత్ ప్రధాని నరేంద్ర మోడీ 2021లోనే 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అమృత్‌కాల్ (స్వర్ణయుగం) అనే పదాన్ని వినిపించారు. మరి ట్రంప్, మోడీ చెబుతున్న స్వర్ణయుగాలు ఎలాంటివి?

న్యూఢిల్లీ : ట్రంప్ చెబుతున్న స్వర్ణయుగం అమెరికా ఆధిపత్యానికి ప్రతీక. తన మార్కెట్, సైనిక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడమే సామ్రాజ్యవాద అమెరికా లక్ష్యం. అమెరికా పారిశ్రామికీకరణను పునరుద్ధరించడం, ఏకపక్షంగా సుంకాలు విధించడం, ఏదేమైనా అమెరికా ప్రయోజనాకే ప్రాధాన్యత ఇస్తూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడమే ట్రంప్ అజెండా. అదే ఆయన చెబుతున్న స్వర్ణయుగం. మరి మోడీ ప్రవచిస్తున్న అమృత్‌కాల్ మాటేమిటి? ఇటీవల దేశం ఆర్థిక మాంద్యంతో కలవరపడుతోంది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇతర సామాజిక, ఆర్థిక కొలమానాలు కూడా దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే వాతావరణం చాలా భయానకమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తోంది. ట్రంప్ ఆలోచనలు ఎలా ఉంటాయి? ప్రపంచ వాణిజ్యంపై పెత్తనం చెలాయించాలని ఆయన చూస్తుంటారు. కృత్రిమ మేధ, అత్యాధునిక సైనిక సాంకేతికతకు అవసరమైన వనరులను పొందేందుకు ప్రయత్నిస్తారు. మరి మోడీ చెబుతున్న స్వర్ణయుగమో ? అది ప్రపంచ వేదికపై తడబడుతూ నడుస్తోంది. అమెరికా, రష్యా, చైనా మధ్య జరుగుతున్న భౌగోళిక రాజకీయ చర్చల నుండి భారత్ తనకు తానుగానే పక్కకు తప్పుకున్నట్లు కన్పిస్తోంది. ఈ పరిణామాలు దాని వ్యూహాత్మక స్వతంత్ర ప్రతిపత్తిని గురించి అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

గతానికి భిన్నంగా...

ప్రస్తుతం మన పరిస్థితి ఆ గట్టునుంటావా, ఈ గట్టుకొస్తావా అన్న విధంగా ఉంది. స్వర్ణయుగాన్ని సాధించాలన్న ఆకాంక్ష చివరికి ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థతో రాజీ పడేలా చేస్తోంది. గతంలో భారత్ వైఖరి చాలా దృఢంగా ఉండేది. చివరి మొఘల్ చక్రవర్తి సైతం ఆనాడు తూర్పు ఇండియా కంపెనీతో రాజీ పడేందుకు నిరాకరించాడు. చారిత్రకంగా చూస్తే ద్వైపాక్షిక, బహుళ ప్రయోజనకరమైన వాణిజ్య చర్చల సందర్భంగా మనం లోగడ దృఢ వైఖరులనే ప్రదర్శించాము. అయితే ...13లో

వ్యూహాత్మక తప్పిదం

ఒక వైపు చైనా, కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రతీకార చర్యలతో అమెరికా దూకుడుకు కళ్లెం వేసేందుకు సిద్ధపడుతుంటే భారత్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. అమెరికా డిమాండ్లకు తలొగ్గి జీ హుజూర్ అంటోంది. ఫలితంగా అగ్రరాజ్యంతో చర్చించే విషయంలో మన బలహీనతలు బయటపడుతున్నాయి.
అంతేకాదు...ప్రపంచ వాణిజ్య కీలక సూత్రాలను మన వైఖరి ఉల్లంఘిస్తోంది. అదే సమయంలో చైనా ఏం చేసింది? ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా చర్యలను సవాలు చేస్తూనే ఆ దేశంపై ప్రతీకార సుంకాలను విధిస్తోంది. మోడీ ప్రభుత్వ వైఖరి కారణంగా గ్లోబల్ సౌత్ ఛాంపియన్‌గా భారత్‌కు ఉన్న ఇమేజ్ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. అమెరికా ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఇతర వర్ధమాన దేశాలను కూడగట్టుకోవడానికి బదులు చారిత్రక విధానం, వైఖరి నుంచి భారత్ వైదొలుగుతోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.



42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా

తుంచేసే కుట్ర

దీన్ని బీసీ సమాజం తిప్పికొట్టాలి

- కులగణనతో మోడీ మెడపై కత్తి వేలాడుతుందనే బీజేపీ, బీఆర్ఎస్ గగ్గోలు
- అందుకే లెక్కలు తప్పంటున్నారు
- ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు
- ఆలె నరేంద్రను కాంగ్రెస్ కేంద్రమంత్రిని చేసింది
- కేసీఆర్ ధృతరాష్ట్ర కౌగిలితో ఆయన్ని ఖతం చేశారు : పద్మశాలీల ఆత్మీయ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలు జరుగుతున్నాయనీ, వీటిని బీసీ సమాజం తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ పిలుపు మేరకు రాష్ట్రంలో కులగణన నిర్వహించి, అసెంబ్లీలో తీర్మానం చేశామనీ, దీనితో ప్రధాని నరేంద్రమోడీ మెడపై కత్తి వేలాడుతున్నదని గమనించి, బీజేపీ, బీఆర్ఎస్ గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు. అందుకు ఆ రెండు పార్టీలు కులగణన లెక్కలు తప్పు అని ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు లెక్కల్లో రాష్ట్రంలో ఉన్నత కులాలు 21 శాతం ఉన్నాయని పేర్కొన్నారనీ, తమ సర్వేలో అగ్రవర్ణాలు కేవలం 15.28 శాతం మంది మాత్రమే ఉన్నారని నిర్ధారణ అయ్యిందని ...13లో

రూ.లక్షవరకు చేనేత రుణాలు మాఫీ 13లో..

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కుటుంబం నుంచే లింగ వివక్ష

చట్టాలెన్ని ఉన్నా మహిళలపై ఆగని అఘాయిత్యాలు

మాటలకే పరిమితమైన సాధికారత
మహిళా న్యాయవాదుల సెమినార్‌లో
హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"భారతీయ సమాజంలో లింగవివక్షత కుటుంబం నుంచే అనాదిగా వస్తోంది. తాతాల తండ్రుల కాలం నుంచి సాంప్రదాయాలు, ఆచారాలంటూ చిన్న పిల్లల మెదళ్లలో రంగరించి పోస్తున్నారు. పెంపకం మొదలు చదువు, ఆర్థిక సేచ్ఛ వరకు అన్నింటా తల్లిదండ్రులు మగ పిల్లలను, ఆడపిల్లలను ...13లో

16వ రోజు బయటపడిన మృతదేహం

ఇంజినీర్ గురుప్రీత్ సింగ్‌గా గుర్తింపు

మిగిలినవారి కోసం అన్వేషణ
విలవిలలాడుతున్న కుటుంబాలు
టీబీఎం తొలగిస్తే పైకప్పు కూలే అవకాశం
సాంకేతికంగా ముందుకెళుతున్న రెస్క్యూ టీమ్



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రాత్రి పగలు తేడా లేకుండా వేలాదిమంది రెస్క్యూ టీమ్ సభ్యుల సమిష్టి కృషి ఫలితంగా ఒకరి మృతదేహం లభ్యమయింది. కేరళ నుంచి రప్పించిన కడావర్ డాగ్స్, ఎన్‌డీఆర్ఎఫ్ ఆర్మీ నేవీ బృందాల సమిష్టి కృషితో ఆదివారం సాయంత్రానికి ఒక మృతదేహం లభించగా.. ఇంజనీర్ గురుప్రీత్ సింగ్‌గా కార్మికులు గుర్తించారు. ఈ మృతదేహం పక్కనే మరికొంతమంది కార్మికుల మృతదేహాలు ఉండొచ్చనే అభిప్రాయంతో తవ్వకాలను ముమ్మరం చేశారు. 16 రోజుల క్రితం ప్రమాదానికి గురైె ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న 8మంది కార్మికుల ఆచూకీ కోసం 12 సంస్థలకు చెందిన రెస్క్యూ బృందాలు అధికారుల పర్యవేక్షణలో షిఫ్టులుగా టన్నెల్‌లోకి వెళ్లి సహాయక చర్యలు చేపడుతున్నారు. కాగా, సొరంగంలో కార్మికులు శవాలుగా బయటకు వస్తుండటంతో కార్మికుల కుటుంబాలు గొల్లుమంటున్నాయి. సొరంగంలో చిక్కుకున్న కార్మికులంతా ఎల్లప్పుడూ కలిసి ఉండే వారిని, చనిపోయే ముందు సైతం కలిసి చనిపోయారని కార్మికులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఒక మృతదేహాన్ని వెలికితీయడంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ -1లో జరిగిన ప్రమాదకర సంఘటన సహాయక చర్యలను రాష్ట్రప్రభుత్వం ముమ్మరం చేసింది. రాష్ట్ర విపత్తు నిర్వాణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ నేతృత్వంలో రక్షణ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఆదివారంతో ఎస్ఎల్‌బీసీ సంఘటన జరిగి 15 రోజులు దాటి 16వ రోజుకు చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్, జిల్లా ఎస్పీలు వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణ సంస్థ జయప్రకాష్ ప్రతినిధి ప్రవీణ్ సింగ్.. టన్నెల్ వద్ద పరిస్థితులపై మరోసారి సమీక్షించారు. ఆదివారం కేరళ నుంచి వచ్చిన బెల్జియం నెలోనాయిస్ జాతికి చెందిన రెండ కుక్కలు మాయ, మర్ఫిని పంపించారు. వాటితో పాటు ఉదయం 157 మంది కార్మికులు, సాంకేతిక నిపుణులు రెస్క్యూ ఆపరేషన్‌కు ...13లో



కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటాలో ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఏఐసీసీ ప్రకటించింది. ఈమేరకు శనివారం ఏఐసీసీ ప్రధాన ...13లో

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. ఆపార్టీ సీనియర్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ పేరును బీఆర్ఎస్ ...13లో

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిని సీపీఐ ప్రకటించింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ...13లో

యంగ్ ఇండియాకు రూ.11వేల కోట్లు మంజూరు



తొలివిడతలో 55 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం
ఒక్కో పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయింపు
ఉత్తర్వులు జారీ : వెల్లడించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి, పొంగులేటి 5లో..

ప్రజానాయకునిగా

ఎదిగిన ఐలయ్య

బీజేపీ రూపంలో మతోన్మాద ప్రమాదం :

కాసాని ఐలయ్య సంస్మరణ సభలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ 3లో..

మహిళాశక్తి వేడుకల్లో పచ్చి అబద్ధాలు

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న సీఎం రేవంత్ : మాజీమంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు మాట్లాడారని మాజీమంత్రి ...13లో

పనిగంటల పెంపు

సబబు కాదు

సమర్థత, నాణ్యత దెబ్బతింటాయి
శరీరం చెప్పినట్టు వినాల్సిందే
దేహానికి విశ్రాంతి తప్పనిసరి : డబ్ల్యూహెచ్ఓ మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్



వివరాలు 3లో

జో..లాలి...

విద్య, ఉద్యోగం వంటి అంశాలలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ పురుషులతో పోటీ పడి రాణిస్తున్నారు భారతీయ మహిళలు. వీటితో పాటు కుటుంబ సంరక్షణ బాధ్యతలనూ చూసుకుంటున్నారు. ముఖ్యంగా, ఒక రోజులో పిల్లల సంరక్షణకు వారు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారు. భారతీయ పురుషులు కేటాయిస్తున్న సమయం కంటే ఇది దాదాపు ఐదు రెట్లు అధికం. అలాగే, ప్రపంచ సగటుతో పోలిస్తే దాదాపు రెండింతలు ఎక్కువ. దీంతో పిల్లలు కలిగి ఉన్న వివాహితల పని తీరుపై ఇది ప్రభావాన్ని చూపుతున్నది. లింగ వేతన అంతరాలకూ దారి తీస్తున్నది. తాజా అధ్యయనం ఒకటి ఈ విషయాన్ని వెల్లడించింది.



- పిల్లల సంరక్షణకే ప్రాధాన్యం
- అధిక సమయం కేటాయిస్తున్న భారతీయ మహిళలు
- ఇది ప్రపంచ సగటు కంటే ఎక్కువ
- ఎఫ్ఎల్‌పీఆర్‌పై ప్రభావం చూపే అవకాశం
- తాజా అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లోని మహిళలు పిల్లల సంరక్షణ కోసం అధిక సమయాన్ని కేటాయిస్తున్నారు. ఇది భారతీయ పురుషులు కేటాయిస్తున్న సమయం, ప్రపంచ సగటు కంటే ఎక్కువ కావటం గమనార్హం. పిల్లల సంరక్షణ కోసం భారతీయ పురుషులు రోజుకు దాదాపు 15 నిమిషాలు కేటాయిస్తున్నారు. ఇది ప్రపంచ సగటు 15 నిమిషాలకు అనుగుణంగానే ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా పిల్లల సంరక్షణకు మహిళలు కేటాయిస్తున్న సమయం ఒక రోజులో సగటున 38 నిమిషాలుగా ఉన్నది. అయితే, భారతీయ మహిళల విషయంలో ఇది రోజుకు సగటున 70 నిమిషాలుగా ఉండటం గమనార్హం. 'భారతదేశంలో కార్మిక మార్కెట్లు : నిర్మాణాత్మక మార్పు కాలంలో కొలత' అనే శీర్షికతో ఇటీవల నిర్వహించిన అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది.అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన మార్కెట్ వ్యవస్థలలో భారతీయ మహిళలు పిల్లల సంరక్షణ కోసం అత్యధిక సమయం కేటాయిస్తున్నారని ఈ అధ్యయనంలో తేలింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ బెంగళూరు (ఐఐఎంబీ)కు చెందిన తీర్థతన్మోయ్ దాస్, అల్బానీలోని విశ్వవిద్యాలయానికి చెందిన కరణ్ భాసిన్, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్)లో భారత్‌కు చెందిన మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుర్జిత్ ఎస్. భల్లా ఈ అధ్యయనాన్ని రచించారు. ఇది గతేడాది డిసెంబర్‌లో ఎస్ఎస్ఆర్ఎన్ జర్నల్‌లో ప్రచురితమైంది.
జాతీయ నమూనా సర్వే(ఎన్ఎస్ఎస్), పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(పీఎల్ఎఫ్ఎస్) ల నుంచి ఉపాధి, నిరుద్యోగ సర్వేలను ఈ అధ్యయనం విశ్లేషించింది. "ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ మహిళలపై పిల్లల సంరక్షణ భారం ఎక్కువగా ఉన్నదని స్పష్టంగా తెలుస్తున్నది. ఇది.. పిల్లలతో ఉన్న వివాహిత మహిళల కార్మిక మార్కెట్ భాగస్వామ్య రేటు(ఎఫ్ఎల్‌పీఆర్)పై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. కాబట్టి, ఎఫ్ఎల్ఆర్‌పీలో ఈ కొత్త గోల్డెన్ అంతరాన్ని (లింగ వేతన అసమానతలు) గుర్తించాల్సిన అవసరం ఉన్నది" అని అధ్యయన రచయితలు అన్నారు.భారతీయ మహిళలు పిల్లల సంరక్షణ కోసం ఎక్కువ సమయం గడపటం వల్ల ఉద్యోగ, ఉపాధికి దూరంగా ...13లో

స్టార్‌లింక్

సేవల్ని ఆపేస్తే..



కీవ్ సేనలు కుప్పకూలుతాయ్
ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్

వివరాలు 13లో



టూత్‌పేస్టు వాడుతున్నారా..?

హానికారక బ్యాక్టీరియాను నిర్మూలించలేదు : తాజా పరిశోధనలో వెల్లడి

న్యూఢిల్లీ : నోటి దుర్వాసనను అరికట్టి, తాజా శ్వాసను అందించేందుకు ఫలానా టూత్‌పోస్టునే వాడండంటూ.. మీరు వాడే టూత్‌పేస్టులో ఉప్పు ఉందా..? అంటూ ప్రసార మాధ్యమాలలో వస్తున్న ప్రకటనలు చూస్తూనే ఉంటాం. అయితే మన దంతాల్లో సంక్లిష్టమైన బ్యాక్టీరియాకి సంబంధించిన పర్యావరణ వ్యవస్థపై (ఓరల్ మైక్రోబయోమ్...నోటిలో నివసించే బాక్టీరియా, ఫంగీ, వైరస్‌లు, (ప్రొటోజోవాల సమూహం) అది చూపే ప్రభావాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. మన దేహ ఆరోగ్యానికి నోటికి సంబంధించిన మైక్రోబయోమ్ ఎంతో కీలకమని ఇటీవలి పరిశోధన తెలిపింది. సమతూకంగా ఉండే మైక్రోబయోమ్ హానికారక బ్యాక్టీరియాను నియంత్రిస్తుంది. జీర్ణక్రియకు దోహదపడుతుంది. చిగుళ్ల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. అయితే టూత్‌పేస్ట్ వాడకంతో ఈ సమతుల్యత దెబ్బతింటుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.టూత్‌పేస్ట్ ప్రధాన లక్షణం ఏమిటంటే అది బ్యాక్టీరియాను పూర్తి స్థాయిలో నిర్మూలించదు. హానికారక బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి వీలు కల్పించే బయోఫిల్మ్‌ను విచ్ఛిన్నం చేస్తుంది. అంతే. మనం బ్రష్ చేసినప్పుడు దంతాలు, చిగుళ్ల నుండి ఈ బయోఫిల్మ్ తొలగిపోతుంది. టూత్‌పేస్ట్‌లో ఉండే అబ్రాసివ్‌లు దానిని మరింత విచ్ఛిన్నం చేస్తాయి. చాలా టూత్‌పేస్టుల్లో ఫ్లోరైడ్ కూడా ఉంటుంది. ఇది దంతాల ఎనామిల్‌ను గట్టి పరుస్తుంది. పళ్ళ పుచ్చిపోకుండా చూస్తుంది. అయితే ఇది కూడా బ్యాక్టీరియాను చంపలేదు.

కొన్ని టూత్‌పేస్టుల్లో ట్రైక్లోసన్ వంటి యాంటీ బ్యాక్టీరియా ఏజెంట్లు, జింక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి హానికారక బ్యాక్టీరియాను లక్ష్యంగా చేసుకొని దాడి చేస్తాయి. కానీ ఆ ప్రయత్నంలో ప్రయోజనకరమైన సూక్ష్మజీవులకు కూడా హాని కలిగిస్తాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పుడు శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగిస్తున్నారు. ఇప్పుడు టూత్‌పేస్ట్ వినియోగం అనేది మానవ జీవితంలో అంతర్భాగమై పోయింది. దాని ప్రభావాలపై మాత్రం నిరంతరం పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. టూత్‌పేస్ట్ హానికరమైన బ్యాక్టీరియానే కాకుండా ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను కూడా అడ్డుకుంటుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. బ్రష్ చేసిన తర్వాత మైక్రోబయోమ్ చాలా త్వరగా పుంజుకుంటుందని అవి తేల్చాయి. టూత్‌పేస్టుల వాడకం ద్వారా హానికారక బ్యాక్టీరియాను నిర్మూలించి, అదే సమయంలో ప్రయోజకరమైన బ్యాక్టీరియాను కాపాడుకోవచ్చా అనే విషయంపై శాస్త్రవేత్తలు ప్రస్తుతం పరిశోధనలు జరుపుతున్నారు. మైక్రోబయోమ్‌ను సమతుల్యంగా ఉంచడం అంటే దంత క్షయాన్ని నివారించడం మాత్రమే కాదు. చిగుళ్ల వ్యాధి అంటే కేవలం దంతాలకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. దానికి గుండె జబ్బులు, మధుమేహం, గర్భధారణ సమయంలో వచ్చే సమస్యలతో సంబంధం ఉంటుంది. హానికరమైన నోటి బ్యాక్టీరియా కారణంగా వచ్చే వాపు శరీరానికి వ్యాప్తి చెంది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది.

టూత్‌పేస్ట్ హానికారక బ్యాక్టీరియాను పూర్తిగా నిర్మూలించలేదన్నది వాస్తవం. అయితే అది బ్యాక్టీరియా బయోఫిల్మ్‌ను విచ్ఛిన్నం చేసి నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దంత క్షయం, చిగుళ్ల వ్యాధి ప్రభావాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్ పరిశోధనల సంగతి ఎలా ఉన్నప్పటికీ ప్రస్తుతానికి మనం చేయగలిగింది ఫ్లోరైడ్ కలిగిన టూత్‌పేస్టుతో రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవడం, దంతాల మధ్య శుభ్రం చేసుకోవడం....అంతే.

గుజరాత్‌లో మెడికో ర్యాగింగ్



- జూనియర్లను కిడ్నాప్ చేసి బాదిన సీనియర్లు..

అహ్మదాబాద్: జూనియర్ మెడికల్ స్టూడెంట్స్‌ను సీనియర్లు కిడ్నాప్ చేశారు. వారిని తిట్టడంతోపాటు కొట్టారు. జూనియర్ల ఫిర్యాదుపై మెడికాల్ కాలేజీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. నలుగురు సీనియర్ మెడికల్ స్టూడెంట్స్‌ను సస్పెండ్ చేసింది. గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. మార్చి 7న ప్రభుత్వ వైద్య కాలేజీలో 2019 బ్యాచ్ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. కాగా, పీజీ డాక్టర్లైన మిలన్, పియూష్, మాన్, నరేన్‌ను శనివారం సస్పెండ్ చేసినట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ సుశీల్ కుమార్ ఝా తెలిపారు. వారి సర్టిఫికెట్లను నిలిపివేయాలని కమిటీ నిర్ణయించినట్టు వెల్లడించారు.

న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రమే



న్యూఢిల్లీ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు భారతావని సిద్ధమవుతోంది. మహిళా శక్తిని గురించి ఉపన్యాసాలు దంచేసేందుకు నాయకులు స్క్రిప్టులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే అనేక రంగాల్లో మహిళలకు సముచిత ప్రాతినిధ్యం, ప్రాధాన్యత లభించడం లేదన్నది మాత్రం వాస్తవం. లింగ సమానత్వం అనేది మాటలకే పరిమితం అవుతోంది తప్ప చేతల్లో కన్పించడం లేదు. ముఖ్యంగా మన న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యానికి సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తే సిగ్గుతో తల దించుకోవాల్సిన పరిస్థితి కన్పిస్తుంది. మన ఉన్నత న్యాయ వ్యవస్థ కొలీజియం కింద పనిచేస్తోంది. అయితే ఇందులో పారదర్శకత లోపించింది. ప్రాతినిధ్యం పేరిట మరింత పక్షపాతం చూపేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినవస్తున్నాయి. నేడు మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారు. న్యాయ వ్యవస్థలోనూ మహిళలు ప్రవేశిస్తున్నారు. అయినప్పటికీ అందులో మహిళలకు తగినంత ప్రాతినిధ్యం లేదు. ఉన్నత న్యాయ వ్యవస్థలో అయితే మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంటోంది. ఎంట్రీ లెవల్‌లో మహిళా న్యాయవాదులు పురుష న్యాయవాదుల కంటే మెరుగైన పనితీరును ప్రదర్శిస్తున్నారు. లైంగిక వేధింపుల కేసులను సమర్థవంతంగా వాదిస్తూ బాధితులకు న్యాయ సహాయం అందిస్తున్నారు. సామాజిక బాధ్యతలు నిర్వర్తించడంలో కూడా వారు ముందంజలోనే ఉన్నారు. అయినా మొత్తంగా చూస్తే న్యాయ వ్యవస్థలో మహిళల పాత్ర తక్కువేనని గణాంకాలు నిరూపిస్తున్నాయి. హైకోర్టు న్యాయమూర్తుల్లో 11.5 శాతం మంది మాత్రమే మహిళలు ఉన్నారు. 2023 నాటికి సబార్డినేట్ కోర్టుల్లో మహిళల సంఖ్య 36.3 శాతం. 2018లో 27.6 శాతంగా ఉన్న మహిళల ప్రాతినిధ్యం కొంతమేర పెరగడం ఆహ్వానించదగిన పరిణామమే. హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 2018లో 10 శాతం ఉండగా 2023 నాటికి స్వల్పంగా పెరిగి 13.4 శాతానికి చేరింది. అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు విషయానికి వచ్చే సరికి మహిళల ప్రాతినిధ్యం బాగా తక్కువగా ఉంటోంది. 2023 డిసెంబర్ నాటికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో మహిళలు కేవలం 9.4 శాతం మాత్రమే ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే సుప్రీంకోర్టులో 32 మంది న్యాయమూర్తులు ఉంటే వారిలో ముగ్గురు మాత్రమే మహిళలు.

2018లో సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తుల ప్రాతినిధ్యం కేవలం నాలుగు శాతంగానే ఉండేది. దేశంలోని వివిధ హైకోర్టుల్లో 367 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. పంజాబ్ హర్యానా, ఢిల్లీ, బాంబే హైకోర్టుల్లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య అధికంగానే ఉంది. ఒరిస్సా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మాత్రం దీనికి భిన్నంగా ఒక్కో న్యాయమూర్తి మాత్రమే ఉన్నారు. పాట్నా, ఇతర హైకోర్టుల్లో అయితే అదీ లేదు. వాస్తవానికి ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ప్రతిభావంతులైన మహిళా న్యాయమూర్తుల సంఖ్య పరిమితంగానే ఉంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 233 ప్రకారం జిల్లా జడ్జిగా నియమితులవ్వాలంటే న్యాయవాదిగా ఏడు సంవత్సరాల అనుభవం ఉండాలి. సుప్రీంకోర్టు దీనిని 'నిరంతర సాధన' అని చెబుతోంది. అయితే మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులకు సంబంధించిన సామాజిక అంచనాలను అది విస్మరించింది. సాధారణంగా మహిళలకు కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. పిల్లలు, తల్లిదండ్రులు, అత్తమామల సంరక్షణతోనే వారికి కాలం గడిచిపోతుంది. అలంటప్పుడు నిరంతర సాధన ఎలా సాధ్యం? అందుకే మహిళలు న్యాయవాది స్థానం నుండి న్యాయమూర్తి స్థానానికి ఎదగలేకపోతున్నారు.

పోర్టు ఆస్తుల ప్రయివేటీకరణ చర్యలు వేగవంతం



ఏపీలో గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌కు రీ టెండర్

160 రోజులుగా పీపీపీపై పోరాడుతున్న ఉద్యోగులు, కార్మికులు పట్టించుకోని వీపీటీ యాజమాన్యం

విశాఖ : విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీటీ) యాజమాన్యం పోర్టు ఆస్తులను ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే చర్యలను వేగవంతం చేసింది. ఇప్పటికే విశాఖ నగరంలోని శాలిగ్రాంపురంలోగల రూ.450 కోట్ల విలువైన 17 ఎకరాల పోర్టు భూములను 30 ఏండ్ల పాటు రహేజా ఇనార్బిట్ మాల్‌కు కేవలం రూ.125 కోట్లకే కట్టబెట్టింది. పోర్టు కల్యాణ మండపం, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలను ప్రయివేటు వ్యక్తులకు లీజుకిచ్చేసింది. తాజాగా ఈ నెల మూడున పోర్టుకు చెందిన నగరం నడిబడ్డునగల ఎకరన్నర స్థలంలో ఉన్న గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌కు రీ టెండర్లను పిలిచింది. దీంతో, ఉద్యోగులు, కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వాస్తవానికి కొద్ది నెలల క్రితమే ఈ ఆస్పత్రిని పీపీపీకి కట్టబెట్టాలని పోర్టు యాజమాన్యం చూసింది. దీన్ని వ్యతిరేకిస్తూ 160 రోజులుగా పోర్టు ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, అధికారులు, కార్మికులు పోరాడుతున్నారు. రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ టెండర్ కొనసాగింపును తాత్కాలికంగా నిలుపుదల చేసినట్టు రెండు నెలల క్రితం పోర్టు అధికారుల బోర్డు సమావేశంలో ప్రకటించారు. పీపీపీ టెండర్‌ను పూర్తిగా రద్దు చేయాలని పోరాటం కొనసాగుతున్న క్రమంలో కొద్ది రోజులు నిశ్శబ్దంగా ఉన్న పోర్టు ఉన్నతాధికారులు తాజాగా రీ టెండరు పిలవడంతో కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1933లో ప్రభుత్వ రంగంలో ఈ ఓడ రేవు ఏర్పడింది. 5,700 ఎకరాలు భూములు ఉండేవి. తాజాగా భూములన్నిటినీ ప్రయివేట్‌వారి చేతుల్లో పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని పోర్టు ఉన్నతాధికారులు అమలు చేస్తూ వస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే

పీపీపీకి ఆస్పత్రిని ఇచ్చినా నియంత్రణ పోర్టుదే ఉంటుందని వీపీటీ మెటీరియల్స్ మేనేజర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. 300 పడకలకు విస్తరించేందుకు డిజైన్ బిల్ట్ ఫైనాన్స్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌ఓటీ) విధానంలో ఈ ఆస్పత్రిని ఇస్తున్నామని చెప్పారు. ఈ పీపీపీ ప్రాజెక్టు మానటరింగ్ కోసం ఇద్దరు కార్మిక సంఘాల నాయకులు ఉంటారని తెలిపారు. ఏటా రూ.18 కోట్లు రిఫరల్ ఖర్చులను బయట కార్పొరేట్ ఆస్పత్రులకు చెల్లిస్తున్నామని చెప్పారు. పీపీపీ లో ఈ ఆస్పత్రి పూర్తయితే ఇవే సౌకర్యాలు పోర్టు ఆస్పత్రిలో ఉద్యోగులు పొందవచ్చని తెలిపారు.

ఎంతో విశిష్టం

ప్రస్తుతం ఎకరన్నర స్థలంలో పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 80 పడకలతో ఉంది. దీని చుట్టూ మరో నాలుగు ఎకరాల వరకూ పోర్టు భూములు ఉన్నాయి. 150 పడకలకు విస్తరించాలనేది లక్ష్యం. తాజాగా రూ.261 కోట్లకు పిపిపిలో ఇచ్చేందుకు రీ టెండర్‌ను పోర్టు అథారిటీ అధికారులు పిలిచారు. ఆస్పత్రిని పోర్టు స్వయంగా నిర్వహించాలని, లేనిపక్షంలో 40 వేల మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నష్టం జరుగుతుందని పోర్టు కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. ప్రస్తుతం 80 పడకలతో సమర్థవంతంగానే పోర్టు అండ్ డాక్ అధికారులకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, పూల్ కళాసీలకు, కార్గో హ్యాండ్లింగ్ డివిజన్ కార్మికులకు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బందికి ఈ ఆస్పత్రిలో సేవలందుతున్నాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తామంటూ పోర్టు యాజమాన్యం దీన్ని ప్రయివేట్ చేతుల్లోకి పెట్టే విధానంతో కదులుతోంది.

పోర్టు ఆస్పత్రి స్థలం విలువ బహిరంగ మార్కెట్లో వెయ్యి కోట్ల రూపాయల పైమాటే. పోర్టు ఏటా సరుకు రవాణా ద్వారా రూ.500 కోట్ల ఆదాయం ఆర్జిస్తోంది. ఈ ఆస్పత్రిని నిర్వహించే ఆర్థిక సామర్థ్యం పోర్టుకు ఉన్నా పీపీపీకి కట్టబెట్టాలని చూడడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు సజీవ దహనం

బెంగళూరు : కర్నాటకలో చింతామణి దగ్గర ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. కారును ఢీకొని భారతి ట్రావెల్ బస్సు బోల్తాపడింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ఉన్న ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాజాకు కరెంటు సరఫరా ఆపేస్తున్నాం : ఇజ్రాయిల్

టెలీఅవీవ్: గాజాలోకి ప్రవేశించే సరకును, ఇతర సరఫరాలను ఇటీవల అడ్డుకున్న ఇజ్రాయిల్. తాజాగా కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. అయితే, దీని ప్రభావం ఏవిధంగా ఉందనే విషయం తెలియనప్పటికీ.. తాగునీటిని అందించే డీశాలిటేషన్ ప్లాంట్లకు మాత్రం ప్రస్తుతానికి కొనసాగుతున్నట్లు సమాచారం.ఇటీవల ముగిసిన తొలి దశ కాల్పుల విరమణను ఏప్రిల్ 20 వరకు కొనసాగించాలని డిమాండ్ చేస్తున్న ఇజ్రాయిల్.. హమాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు పలు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గాజాలోకి ప్రవేశించే సరకును, సరఫరాలను ఇటీవల అడ్డుకోవడంతో వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు పంపిస్తున్న మానవతాసాయం ఆగిపోయింది.మరోవైపు, హమాస్ మాత్రం రెండోదశ కాల్పుల విరమణ చర్చలు మొదలుపెట్టాలని కోరుతోంది. జనవరిలో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని చెబుతోంది. మానవతా సాయాన్ని అడ్డుకోవడం వంటి చర్యలతో



ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తే.. తమ చెరలో ఉన్న బందీలు ఇబ్బందులు పడతారని హెచ్చరించింది. అయినప్పటికీ ఇజ్రాయిల్ మాత్రం తాజాగా కరెంటు సరఫరా కూడా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.



సీపీఐ(ఎం)పై ఎందుకీ అక్కసు?

"విశ్వసనీయత" వెనుక మతలబు ఏమిటి?

పిన్ పాయింట్

ఆదివారం (ఈ నెల 9న) ఆంధ్రజ్యోతిలో ఆర్‌కె గారి కొత్త పలుకులో "కూటమికి పట్టం... ఐక్యత "భద్రం" అనే పేరుతో రాసిన సంపాదక వ్యాసం సీపీఐ(ఎం)పై ద్వేషాన్ని మరోసారి వెళ్లగక్కింది. గత మూడు మాసాల్లో సీపీఐ(ఎం)పై ఇలా దుర్మార్గంగా దాడి చేయడం, నిరాధార ఆరోపణలు చేసి ఆంధ్రజ్యోతి పాఠకుల్ని నమ్మించాలని ప్రయత్నించడం వెనుక మతలబు ఏమిటో సులభంగానే అర్థం చేసుకోవచ్చు. 'కామ్రేడ్స్ కష్టాలు' పేరుతో రాసిన ఈ దాడికి 'కామ్రేడ్స్‌తో కష్టాలు' అని పేరు పెట్టివుంటే బాగుండేది. తెలుగుదేశం తొమ్మిది నెలల పాలనా వైఫల్యం ప్రజల్లో వస్తున్న అసంతృప్తిని తగ్గించాలంటే ప్రజల తరపున గట్టిగా నిలబడి పోరాడుతున్న సీపీఐ(ఎం) "విశ్వసనీయత"ను దెబ్బతీయకుండా సాధ్యం కాదని రాధాకృష్ణ (ఆర్‌కె) గారు గ్రహించారని స్పష్టంగా అర్థమవుతున్నది. తెలుగుదేశాన్ని కాపాడే క్రమంలో సీపీఐ(ఎం)పై ఉద్దేశపూర్వకంగానే దాడి చేస్తున్నారు. మంచి కుక్కను కొట్టాలంటే పిచ్చికుక్కగా ముద్ర వేయాలన్న చాణక్య నీతిని ఆయనిక్కడ ప్రదర్శించారు. అందుకే ఉన్నవీ లేనివీ కల్పించి సీపీఐ(ఎం)పై ఆరోపణలు చేసి దాని విశ్వసనీయతపై దెబ్బకొడితే ప్రజా ఉద్యమాలను అరికట్టవచ్చని, అసంతృప్తిని అదుపు చేయొచ్చని ఆయన భావిస్తున్నారు. రానున్న రోజుల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతమవుతాయని వారి కన్నా ముందే ఈయన పసిగట్టినట్లున్నారు. అందుకే ఈ ముందస్తు దాడి. వైసీపీ కోసమే, వారి తరపున రహస్యంగా సీపీఐ(ఎం) ఈ పని చేస్తున్నదని నమ్మించడానికి నానా తంటాలు పడుతున్నారు.

రహస్య ఒప్పందం ఎవరిది?

సీపీఐ(ఎం)పై నిరాధార ఆరోపణలు చేస్తున్న ఆర్‌కె గారు అదే జగన్‌తో తెలుగుదేశం రహస్య ఒడంబడికల్ని మాత్రం కావాలని విస్మరిస్తున్నారు. అదానీ దగ్గర రూ.1750 కోట్లు లంచం తీసుకొని విద్యుత్ చార్జీలు పెంచి ఒప్పందం చేసుకున్న జగన్‌పై టీడీపీ కూటమి ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదు? ఎందుకు కేసు బుక్ చేయలేదు? ఇది రహస్య ఒప్పందం కాక మరేమిటి? జగన్ చేసుకున్న తప్పుడు విద్యుత్ ఒప్పందాల వల్ల లక్ష 80 వేల కోట్ల రూపాయల భారం పెరిగిందని శ్వేతపత్రంలో ఘనంగా పేర్కొన్న టీడీపీ ప్రభుత్వం వాటిని ఎందుకు రద్దు చేయలేదు? స్మార్ట్ మీటర్లు ఉరితాళ్ళని, ధ్వంసం చేయమన్న లోకేష్ తమ పాలనలో అవే స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారు? ఇది రహస్య ఒప్పందం కాదా? జగన్‌తో చేతులు కలపడం కాదా? ప్రజలపై దాడి చేయడానికి, భారాలు మోపడానికి జగన్ - చంద్రబాబుకు విబేధాల్లేవు. తగాదా అల్లా కుర్చీల కోసమే. అది కూడా నిజమైన పోరాటం కాదు. నిన్నటిదాకా వైసీపీలో పదవులు వెలగబెట్టిన పెద్ద మనుషులు ఇప్పుడు గోడదూకి టీడీపీలోకి రాగానే పవిత్రమైపోతారు. జగన్‌కు చంద్రబాబుకు వీరే వారధులనుకోవాలి కదా ! ఇందులో రాధాకృష్ణ గారికి ఏ విశ్వసనీయత కనిపించింది? తొమ్మిది మాసాల పాలన అనంతరం టీడీపీకి వైసీపీకి తేడా ఏమిటని టీడీపీ శ్రేణులే అడుగుతున్నాయి. అది ఆర్‌కె రచనల్లోనూ వెల్లడవుతుంది.

రాష్ట్రానికి ద్రోహం చేసిన వారు పుణ్యాత్ములా?

ప్రత్యేక హోదా ఇవ్వకుండా విభజన హామీలు అమలు జరపకుండా ద్రోహం చేసిన బీజేపీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వంలో ఆర్‌కె గారికి రవ్వంత తప్పు కనిపించలేదు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న టీడీపీ విశాఖ ఉక్కును గాలికొదిలేసి కడప ఉక్కును పట్టించుకోకపోయినా, వాటికి బదులుగా మిట్టల్ ఫ్యాక్టరీకోసం నానా అగచాట్లు పడడం సరైందిగా కనిపిస్తుంది. బీజేపీకి వైసీపీ - టీడీపీ ఇద్దరూ మద్దతుదారులే. ఢిల్లీలో మోడీ కుడి ఎడమల మద్దతునిస్తున్న ఈ రెండు పార్టీల వెనకున్న రహస్య ఎజెండా ఏమిటి? ఈ పార్టీల కూటమి టీడీపీ - జనసేన - బీజేపీ తెలంగాణాలో సైతం రావాలని కోరుకుంటున్న ఆర్‌కె గారికి ఇందులో విశ్వసనీయత చాలా కనిపిస్తున్నది.

సొంత ఫైళ్ళు తిరగేయండి సార్!

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఇసుక, మద్యం విధానాలను వ్యతిరేకించి పోరాడింది సీపీఐ(ఎం). ఒక్కసారి ఆంధ్రజ్యోతి పాత ఫైళ్ళు తిరగేయాలని రాధాకృష్ణ గారిని కోరుతున్నాను. పోలవరం నిర్వాసితులు, విశాఖ ఉక్కు, కడప ఉక్కు, దళితులపై లైంగికదాడులు, ప్రత్యేక హోదా, ఇలా ప్రతి సమస్యమీదా పోరాడింది సీపీఐ(ఎం). విద్యార్థి, యువజన, కార్మిక, రైతాంగ పోరాటాల్లోనూ సీపీఐ(ఎం)) చురుగ్గా ఉన్న విషయం ఆంధ్రజ్యోతి పాత ఫైళ్ళు (జిల్లా ఎడిషన్లు సహా. ఎందుకంటే వైసీపీకి వ్యతిరేకంగా సీపీఐ(ఎం) పోరాటాలకు నాడు కూడా ఈ పత్రిక ప్రాచుర్యం కల్పించలేదు. అదీ వైసీపీపై వీరి ప్రేమ.

నాడు పోరాటాలు చేసి టీచర్స్, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల టిడిపి తీసుకున్న వైఖరి ఏమిటి? గిట్టుబాటు ధరలూ, పెన్షన్ల కోసం ఒక్క ఆందోళనైనా చేసిందా టీడీపీ? దాన్ని గురించి ఆర్‌కె ఎందుకు ప్రస్తావించరు? జీ.వో.నెం.3కి వ్యతిరేకంగా పోరాడింది ఎవరు? విద్యుత్ చార్జీల పెంపుదలను వ్యతిరేకించింది ఎవరు? పౌర హక్కుల్ని హరిస్తున్న జీ.వో.కు వ్యతిరేకంగా పోరాడింది ఎవరు? భూటైటిలింగ్ యాక్టుకు నాడు గట్టిగా వ్యతిరేకించింది సీపీఐ(ఎం).. టీడీపీ కాదు. నాడు హైకోర్టులో కేసులకు, ప్రెస్‌కాన్ఫరెన్సు, టివి డిబేట్లకే పరిమితమైన టీడీపీ చేసిందా? వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలను బెదిరించి, నిర్బంధిస్తే, టీచర్లపై జులుం ప్రదర్శిస్తే ఆనాడు టీడీపీ ఎక్కడుంది? కనీసం ఖండించిందా? నాడు సీపీఐ(ఎం)పై వైసీపీ దాడి చేయగా ఆ పని నేడు టీడీపీ చేస్తున్నది. అదే తేడా! నాడు విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పయ్యావుల కేశవ్, చంద్రమోహన్‌రెడ్డి కేసులు వేశారా? వారు వేసిన కేసులకు వ్యతిరేకంగానే వారు నేడు నిర్ణయాలు చేసి అమలు చేస్తున్నారు. ఇది జగన్‌తో కుమ్మక్కు అవడం కాదా? దాన్ని ఆర్‌కె గారు ఎందుకు ప్రశ్నించడం లేదు? దిగజారుడు విమర్శలతో, ఆర్‌కె గారి విశ్వసనీయత ప్రశ్నార్థకం కాకుండా చూసుకోవాలని కోరుకుంటున్నాము.ఇక సీపీఐ(ఎం) గతకాలపు నిజాయితీ, నిక్కచ్చి, విశ్వసనీయత గురించి, రాధాకృష్ణ గారు రాస్తూ అవి ఇప్పుడు లేవని, నాయకత్వం జగన్‌తో "రహస్య ఒప్పందాలు" చేసుకుందని నిరాధార ఆరోపణ చేశారు. ఆయన వద్ద ఏమైనా సాక్ష్యాధారాలు ఉంటే బయటపెడితే ప్రజలు కూడా సంతోషిస్తారు. తాను ఒక జర్నలిస్టునన్న విషయం మరిచిపోయి అనైతికంగా, రాజకీయ నాయకుడిలా సీపీఐ(ఎం)పై ద్వేషంతో నిరాధార ఆరోపణలు చేయడంలో "విశ్వసనీయత" ఎంతో ఆలోచించుకుంటే మంచిది. ఇలాగే సీపీఐ(ఎం)పై దిగజారి ఆరోపణలు చేసుకుంటూ పోతే వారి విశ్వసనీయతకే ముప్పు వస్తుందని గ్రహించాలి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలుపుతో వెయ్యి ఏనుగుల బలం వచ్చిందని ఉబ్బితబ్బిబై పోతున్నారు. పీడీఎఫ్‌పై గెలవడానికి టీడీపీ అనేక అక్రమ పద్ధతులు అనుసరించింది. రాధాకృష్ణగారికి ఈ విషయం తెలుసుకొని విస్మరించినట్టు నటిస్తున్నారు. పీడీఎఫ్‌పై గెలిచి టీడీపీ చేసుకుంటున్న సంబరాలు చూస్తుంటే ఎంత భయపడ్డారో ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. టీడీపీ శ్రేణులే ఆశ్చర్యపోతున్నాయి. ఏమిటీ అల్ప సంతోషమని ముక్కున వేలేసుకుంటున్నారు. రాధాకృష్ణగారికి మాత్రం ఇది వెయ్యేనుగుల బలం ఇచ్చింది. టీచర్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) ఏనాడూ పోటీ చేయలేదు. అభ్యుదయ విద్యావంతులు, ఉద్యమాల నాయకులు పీడీఎఫ్‌గా ఏర్పడి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల నుంచి వైసీపీ, టీడీపీలు రంగంలో దిగి వాటిని రాజకీయ రణంగా మార్చాయి. దానివల్ల నష్టపోతున్నది టీచర్లు, విద్యావంతులైన నిరుద్యోగులు, ఉద్యోగవర్గాలే. వారిలో పాలకపార్టీపై - అది వైసీపీ అయినా, టీడీపీ అయినా - విశ్వసనీయత తగ్గిపోతున్నది. ఈ ఆగ్రహాన్ని దారి తప్పించడానికే రాధాకృష్ణగారు కలం బాణాన్ని వదిలారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, 2023లో జరిగిన రాయలసీమ తూర్పు, పశ్చిమ ఎన్నికల్లో వైసీపీ దెబ్బకు తట్టుకోలేక టీడీపీ చేతులెత్తేస్తే ఎదుర్కొని గట్టిగా నిలబడింది సీపీఐ(ఎం) అన్న విషయం టీడీపీ నాయకులకు కూడా తెలుసు. నాడు పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ దుర్మార్గాలను ఎదుర్కొని నిలబడింది సీపీఐ(ఎం) పార్టీయేనన్నది జగమెరిగిన వాస్తవం. అప్పుడు సీపీఐ(ఎం) విశ్వసనీయత రాధాకృష్ణ గారికి గుర్తురాలేదు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో టీడీపీ ప్రజలకోసం చేసిన ఉద్యమాలేమిటి? వారిపై పెట్టిన కేసులెన్ని? రాధాకృష్ణగారు లెక్కలు సేకరించాలి.

ఈ కాలంలో సీపీఐ(ఎం) నిర్వహించిన ఉద్యమాలు, కేసుల గురించి వారు చెప్తారు. గురివింద గింజ సామెతలాగా జగన్ దెబ్బకు భయపడి, కేసులొస్తాయని లొంగిపోయిన వాళ్ళు ఇప్పుడు అధికారం రాగానే వీరత్వం ప్రదర్శిస్తున్నారు. రాధాకృష్ణగారి బాధ నాడు సీపీఐ(ఎం) పోరాటాలు చేయనందుకు కాదు. ఇప్పుడు చేస్తున్నందుకు. అసలు విషయం దాచిపెట్టి నిందారోపణలకు దిగుతున్నారు. ఇదేనా మీ నిజాయితీ? సీపీఐ(ఎం) ఏనాడూ వైసీపీతో సీట్లు సర్దుబాటుకోసం తహతహలాడలేదు. కనీసం ఆలోచించనూ కూడా లేదు. వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీతో కలవనందుకే ఆర్‌కె గారికి బాధగా ఉంది. సీపీఐ(ఎం) ఇద్దరితోనూ కలవలేదు. కారణం బీజేపీతో టీడీపీకున్న స్నేహం. అది రాజకీయ విధానంపై ఆధారపడిన నిర్ణయం. టీడీపీ బీజేపీతో సర్దుబాటు చేసుకున్నందున సీపీఐ, కాంగ్రెస్ సీపీఐ(ఎం)తో సర్దుబాటుకు ముందుకొచ్చింది. ఇండియా బ్లాకు పార్టీలతో సర్దుబాటు చేసుకోవాలని సీపీఐ(ఎం) మొదటి నుండి ప్రయత్నించింది. సీపీఐ, సీపీఐ(ఎం) ఉమ్మడి అవగాహనతో పోవడం ఆర్‌కె గారికి ఇష్టం లేదని అర్థమవుతున్నది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి సీపీఐ(ఎం) ను నిందించడం తగునా రాధాకృష్ణగారు?

ప్రజా నాయకునిగా ఎదిగిన ఐలయ్య

బీజేపీ రూపంలో మతోన్మాద ప్రమాదం | లౌకిక శక్తుల ఐక్యత కీలకం

కాసాని ఐలయ్య సంస్మరణ సభలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం

మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలంటే ఐలయ్యలా ఉండాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బీజేపీ రూపంలో దేశ, రాష్ట్రానికి మతోన్మాద ప్రమాదం ముంచుకొచ్చిందన్నారు. లౌకిక శక్తులను ఐక్యం చేసి కమ్యూనిస్టులు విస్తృత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లోని కాసాని నగర్‌లో ఆదివారం సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు వీర్ల రమేశ్ అధ్యక్షతన జరిగిన ఐలయ్య సంస్మరణ సభలో తమ్మినేని మాట్లాడారు. వరంగల్ జిల్లా నుంచి వచ్చిన ఐలయ్య సుజాతనగర్, కొత్తగూడెం ప్రాంతాల్లో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నాననే నమ్మకాన్ని కలిగించారన్నారు. మార్క్సిజం మీద పట్టు, ఆ సిద్ధాంతాన్ని చివరికంటా తీసుకెళ్లే అంకితభావం, క్రమశిక్షణ ఉంటే కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఎదగొచ్చని ఐలయ్య నిరూపించారని తెలిపారు. కాసాని ఐలయ్య ఒక్క కమ్యూనిస్టు పార్టీకే కాదు.. ప్రజా నాయకునిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పేదలకు అండగా ఉండే ఓ ఆదర్శ సిద్ధాంతమైన కమ్యూనిజానికి ఆదరణ తగ్గుతోందన్నారు. పెట్టుబడిదారీ విధానంలోనే అంతర్గత సంక్షోభం ఉందన్నారు. అమెరికాలో ట్రంప్, మనదేశంలో మోడీ మూడోసారి గెలిచాక సంక్షోభాలు మరింతగా పెరిగాయన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు తిరగబడే సమయం ఆసన్నమైందని తెలిపారు.

రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన బాగోలేదని కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు కానీ.. ఈ రెండు పార్టీలూ బీజేపీ రూపంలో ముంచుకొస్తున్న మతోన్మాద ప్రమాదాన్ని గుర్తించటం లేదన్నారు. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలవటం ప్రమాదానికి సంకేతమని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట గడ్డ మీద మతోన్మాద పార్టీలు బలోపేతం అవుతుండటం దేశానికి, రాష్ట్రానికి ప్రమాదకరమన్నారు. రాబోయే కాలంలో లౌకిక శక్తుల ఐక్యత కీలకమని తెలిపారు. ఇలాంటి సమయంలో మతోన్మాదాన్ని ఎదుర్కొనే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని గుర్తించాలన్నారు. ఎర్రజెండాను ముందుకు తీసుకెళ్తే తప్ప భవిష్యత్తు ఉండదని స్పష్టంచేశారు. కమ్యూనిస్టులు బలహీనపడ్డారని, వారి పనయిపోయిందని ఎవరైనా అనుకుంటే పొరపాటని.. 'అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతి'ని ఆపలేరన్నట్టుగా ఈ పెట్టుబడిదారీ సమాజంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఆపటం ఎవరితరం కాదన్నారు. ఐలయ్య లాంటి నాయకులు మరింత మంది ఉద్భవించాలని ఆకాంక్షించారు. ఆ విశ్వాసంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

పోరాటమంటే ఐలయ్య: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇండ్ల స్థలాలు, పోడు భూములు, దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన ఏ పోరాటమైనా కాసాని ఐలయ్య ముఖ్య భూమిక పోషించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. దాడులు, హత్యాయత్నాలకు వెరవకుండా ఐలయ్య పోరాట స్ఫూర్తి కనబరిచారని కొనియాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం, లౌకికతత్వంపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. మతోన్మాదం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాల్సిన తరుణంలో ఐలయ్య లాంటి ఉద్యమకారుడు లేకపోవడం బాధాకరమన్నారు. దేశంలో మతసామరస్యం లోపిస్తోందని, కులతత్వ ధోరణులు, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని తెలిపారు. కమ్యూనిస్టుల బలం ఓట్లు, సీట్లలో కాదని, ప్రజాపోరాటాల్లో చూడాలని అన్నారు. శ్రామికవర్గాల రాజ్యస్థాపనకు ఎర్రజెండా పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లటమే ఐలయ్యకు మనమిచ్చే నివాళి అని తెలిపారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐలయ్య కుటుంబ సభ్యులు కుమారుడు కాసాని లెనిన్, కోడలు పావని, కుమార్తె, అల్లుడు జ్యోతి, కృష్ణ హాజరయ్యారు. సభలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు, పార్టీ సీనియర్ నాయకులు రాజారావు, పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేశ్, అన్నవరపు కనకయ్య, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎ.మధు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోనేరు చిన్ని, మండె వీరహనుమంతరావు, టీజేఏసీ రాష్ట్ర నాయకులు రామనాథం, ఐలూ రాష్ట్ర నాయకులు శివరాంప్రసాద్, సీపీఐ జిల్లా నాయకులు దసూరు, బీఆర్ఎస్ నాయకులు తులసీరెడ్డి, జీఎంపీఎస్ రాష్ట్ర నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, టి.లింగయ్య, యలమంచి రవికుమార్, సీపీఐ(ఎం) ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి పద్మ, కొక్కెరపాటి పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, కారం పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, ఎం.జ్యోతి, కున్సోత్ ధర్మ కొమరారెడ్డి, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ అంటేనే కార్మికులకు భరోసా

శ్రామికుల పక్షాన ఎర్రజెండా.. : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ ప్రెసిడెంట్ చుక్క రాములు

యూనియన్‌లో భారీగా కార్మికులు చేరిక

నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల కష్టసుఖాల్లో ఎర్రజెండా అండగా ఉంటుందని.. సీఐటీయూ అంటేనే వారికి ఒక భరోసా అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ ప్రెసిడెంట్ చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని శ్రామికభవన్‌లో ఆదివారం వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు పెద్దఎత్తున చుక్క రాములు సమక్షంలో సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. యూనియన్ ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకోవచ్చని, చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు సాధ్యమవుతాయని తెలిపారు. కిర్బీ పరిశ్రమలోనూ సీఐటీయూ ద్వారా అనేక చట్టపరమైన సౌకర్యాలు సాధించామని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు సాధిస్తామని కార్మికులకు భరోసా ఇచ్చారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజయ్య, నాయకులు వీఎస్ రాజు, తలారి శ్రీనివాస్, మల్లేష్, లక్ష్మన్, మహేశ్వర్ రెడ్డి, రాములు, ప్రవీణ్, మధు, రాజేష్, వెంకట్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



అరుణసంద్రంగా కొల్లాం

వేలాది మంది రెడ్ షర్ట్ వలంటీర్ల కవాతు, లక్షలాది మంది కార్యకర్తలు, ప్రజానీకం భారీ ర్యాలీలతో కేరళలోని కొల్లాం అరుణ సంద్రంగా మారింది. నాలుగు రోజులపాటు కొల్లాంలో జరిగిన సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర 24వ మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిసింది. పేద ప్రజల అణచివేతపై పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన కడక్కల్ నుంచి వచ్చిన ఆరేళ్ల కామ్రేడ్ అభి మార్చ్‌కి ముందు నిలిచాడు. పిల్లలు, యువకులు, మహిళలు, కార్మికులు దాదాపు 25 వేల మంది రెడ్ ఆర్మీ వలంటీర్లు కవాతు నిర్వహించారు.

పోరాటాలు మరింత బలోపేతం

సీపీఐ(ఎం) కేరళ బహిరంగ సభలో ప్రకాశ్‌కరత్



హిందూత్వ, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని సీపీఐ(ఎం) సమన్వయ కర్త ప్రకాశ్ కరత్ స్పష్టం చేశారు. కేరళ సీపీఐ(ఎం) 24వ రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా కొల్లాంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కేరళలో పార్టీ సంస్థాగతంగా, రాజకీయంగా అత్యున్నత ఐక్యతను సాధించిందని చెప్పారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీ మరింత బలాన్ని పొందిందని చెప్పారు. పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర మాజీ కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్‌ల నాయకత్వంలో కన్నూర్‌లో పార్టీ 23వ రాష్ట్ర మహాసభ నిర్వహించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. హిందూత్వ, కార్పొరేట్ ఆధిపత్య శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కాలంలో పార్టీ విస్తృతంగా పోరాడిందని తెలిపారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలపై ఉద్యమించిందని చెప్పారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వ్యవసాయ సంక్షోభం, నయా ఉదారవాద విధానాల వల్ల కలిగే సామాజిక సమస్యలకు, ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లకు వ్యతిరేకంగా అచంచల నిబద్ధతతో పార్టీ పోరాడిందని తెలిపారు. నయా ఉదారవాద విధానాలు, కార్పొరేట్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలకు పార్టీ సిద్ధమైందని చెప్పారు. హిందూత్వ శక్తులు రాష్ట్రంలోని ప్రతి విభాగంలోకి చొరబడి విభజించడానికి, రాజకీయ ఆధిపత్యం పొందడానికి ప్రయత్నిస్తున్నాయని, ఈ ప్రయత్నాలను సీపీఐ(ఎం) నిరంతరం ప్రతిఘటించిందని, స్థిరంగా రాజకీయ ప్రచారం చేసిందని తెలిపారు.

ఎల్‌డీఎఫ్‌కు అండగా నిలవాలి

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు



కేరళలో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం విజయవంతంగా కొనసాగాలని దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులు, వామపక్ష శ్రేణులు విప్లవాభినందనలు తెలియజేస్తున్నారని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర మహాసభలకు హాజరైన ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. 'కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం దేశంలో కమ్యూనిస్టుల కోటగా ఇప్పటికీ నిలిచివుంది. నిలదొక్కుకోవడానికి, బలోపేతం కావడానికి ఇది పరీక్షా సమయం. కమ్యూనిస్టులు ఇతర ప్రాంతాలకు విస్తరించడానికి, అభివృద్ధి చెందడానికి స్ఫూర్తి ప్రదాతగా కేరళ ఉంది. ఇది మంచి పరిణామం. కేరళ ప్రజలు దేశానికి ఈ సందేశాన్ని ఇవ్వాలి. ఆర్ఎస్ఎస్, మతతత్వ శక్తులతోపాటు మైనారిటీ మతతత్వ శక్తులు కేరళ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. కేరళ ప్రజలు సెక్యులర్ వ్యవస్థను, ప్రజాస్వామ్య విలువలను ఆదరించి, కాపాడుకోవాలి. జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న మతతత్వ శక్తులు వామపక్ష శక్తులను ఓడించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. వామపక్షాలు, కమ్యూనిస్టులు, ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న సీపీఐ(ఎం) శ్రేణులు ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కేరళ ప్రజల పక్షాన నిలవాలి. రక్షణగా ఉండాలి. వామపక్ష ప్రభుత్వ పాలనను కొనసాగించేందుకు అండగా నిలవాలి' అని అన్నారు.

సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్వీ గోవిందన్

16 మందితో కార్యదర్శి వర్గం, 89 మందితో కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్వీ గోవిందన్ తిరిగి ఎన్నికయ్యారు. 16 మందితో కార్యదర్శి వర్గం, 89 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. కొల్లాంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర 24వ మహాసభ రెడ్ షర్ట్ వాలంటీర్ల మార్చ్‌తో ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు 530 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సభలో పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, బృందా కరత్, సుభాషిణి అలీ, బి.వి. రాఘవులు, అశోక్ ధావలే, ఎం.ఎ. బేబి, ఎ. విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర రాజకీయ, నిర్మాణ నివేదికను రాష్ట్ర కార్యదర్శి ఎమ్వీ గోవిందన్ ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై 47 మంది ప్రతినిధులు చర్చలో పాల్గొని, ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్వీ గోవిందన్ తిరిగి ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పినరయి విజయన్, ఈపీ జయరాజన్, కె.కె. శైలజ, థామస్ ఐజాక్, టి.పి. రామకృష్ణన్, కె.ఎన్. బాలగోపాల్, పి.రాజీవ్, కె.కె. జయచంద్రన్, వి.ఎన్. వాసన్, సాజి చెరియన్, ఎం.స్వరాజ్, పి.ఎ. మహ్మద్ రియాజ్, పి.కె. బిజు, పుతలత్ దినేషన్, సి.ఎన్ మోహనన్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీకి 17 మంది కొత్తగా ఎన్నికయ్యారు.

అభివృద్ధి చెందిన దేశాల ప్రమాణాలకు దీటుగా కేరళ : ఎమ్వీ గోవిందన్



కేరళను అభివృద్ధి చెందిన దేశాల ప్రమాణాలకు పెంచుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎమ్వీ గోవిందన్ అన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యమని, కేరళలో అభివృద్ధి రంగంలో ఊహించని మార్పు వస్తుందని ఆయన తెలిపారు. అన్ని సంక్షోభాలను, సవాళ్లను అధిగమించి బలంగా ముందుకు సాగుతామ న్నారు. ఈ సారి రాష్ట్ర కమిటీలోకి 17మంది కొత్తగా వచ్చారని, మహాసభలో ఆరోగ్యకరమైన చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. విమర్శలు, ఆత్మవిమర్శ లేకుండా పార్టీలేదంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ కేరళ తన కాళ్ళ మీద తాను నిలబడుతుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ మహాసభ పార్టీ చరిత్రలో ఒక మైలురాయిగా మారిందన్నారు. కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి పార్టీని సిద్ధం చేయడమే లక్ష్యమని పార్టీ ప్రకటించిందన్నారు. అందరికీ ఉమ్మడి శత్రువు సీపీఐ(ఎం)అంటూ మెజారిటీ మతతత్వం, మైనారిటీ మతతత్వంతో కలిసిపోయి చేస్తోన్న ప్రచారాన్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల మద్దతుతో రెండోసారి అధికారంలోకి వచ్చినట్టే, 2026 ఎన్నికల్లోనూ, దానికిముందు జరిగే స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధించాలన్నారు. అన్ని ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటూ ముందుకు సాగగలగాలని, అది సాధ్యంకావాలంటే సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

13న ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో

రైతుల ధర్నా

అంబానీ, అదానీ కంపెనీలకు వ్యవసాయాన్ని కట్టబెట్టే యత్నం

- మోడీ సర్కారు రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి : ఎస్‌కేఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ నెల 13న వేలాది మంది రైతులతో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, జక్కుల వెంకటయ్య, నాయకులు మూఢ్ శోభన్ నాయక్, శ్రీనివాస్ ప్రకటించారు. ఈ నెల 12 వరకు జిల్లాల్లో ధర్నాలు చేయాలని కోరారు. ఈ ధర్నాలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆఫీసులో 13న జరిగే ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను మోడీ సర్కారు దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఫసల్ బీమా యోజన పథకం బీమా కంపెనీలకు ఉపయోగపడుతున్నదని తప్ప దాని ద్వారా రైతులకు ప్రయోజనం దక్కట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని రైతులకు ఉపయోగపడేలా మార్చాలని సూచించారు. దేశవ్యాప్తంగా రైతుల కోసం రుణ విమోచన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయకుండా మోడీ సర్కారు నాన్చుతున్నదని విమర్శించారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం రైతులకు నష్టదాయకంగా మారబోతున్నదని చెప్పారు. అదానీ, అంబానీ కంపెనీల ఏజెంట్లు ధాన్యాన్ని సేకరించేలా, కార్పొరేట్లకు వ్యవసాయాన్ని అప్పగించేలా కేంద్రం కుట్ర పన్నుతున్న తీరును ఎండగట్టారు.

వ్యవసాయ పరిశోధనా సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడాన్ని తప్పుబట్టారు. రైతులను సాగు నుంచి దూరం చేసేందుకే ఎరువుల సబ్సిడీల్లో కోత విధించిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. రుణమాఫీ, రైతుభరోసా, రైతు బీమా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం వరికే కాకుండా అన్ని పంటలకూ బోనస్ ఇవ్వాలని కోరారు. రైతులకు నష్టం చేకూర్చే జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకురావొద్దనీ, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలనీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తూ

నలుగురు కార్మికులు మృతి



ముంబయి : ముంబయిలో నిర్మాణంలో ఉన్న భవనంలో వాటర్ ట్యాంక్ శుభ్రం చేస్తుండగా ఊపిరాడక నలుగురు కార్మికులు మరణించారు. నాగ్పాడలోని మింట్ రోడ్‌లో ఆదివారం ఈఘటన జరిగినట్టు అధికారులు తెలిపారు. మృతులను హసిపాల్ షేక్ (19), రాజా షేక్ (20), జియావుల్లా షేక్ (36), ఇమాండు షేక్ (38)గా బృహన్ ముంబయి మునిసిపల్ కార్పోరేషన్ (బీఎంసీ) ఒక ప్రకటనలో తెలిపింది. మరో కార్మికుడు పుర్హాన్ షేక్ (31)చికిత్స పొందుతున్నట్టు పేర్కొంది.

పనిగంటల పెంపు సబబు కాదు

సమర్థత, నాణ్యత దెబ్బతింటాయి

- శరీరం చెప్పినట్లు వినాల్సిందే
- దేహానికి విశ్రాంతి తప్పనిసరి : డబ్ల్యూహెచ్ఓ మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్

న్యూఢిల్లీ : దీర్ఘకాల పనిగంటలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్యా స్వామినాథన్ తీవ్రంగా వ్యతిరేకించారు. దీనివల్ల పనిలో నాణ్యత దెబ్బతింటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఎక్కువ సేపు పనిచేయాలా వద్దా అనేది వ్యక్తిగత విషయమని చెప్పారు. ప్రజలు తమ శరీరం చెప్పేది వినిపించుకోవాలని, ఎప్పుడు విశ్రాంతి అవసరమో గుర్తించాలని సూచించారు. దీర్ఘకాల పనిగంటలు సమర్థతను తగ్గిస్తాయని అన్నారు. సౌమ్యా స్వామినాథన్ పీటీఐ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ స్వల్పకాలంలో ఎక్కువసేపు పనిచేయడం సాధ్యమేనని, కోవిడ్ సమయంలో దీనిని చూశామని చెప్పారు. అయితే దీర్ఘకాలంలో అది మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఎన్ని గంటలు పనిచేశామన్న దానిపై కాకుండా ఎంత నాణ్యతతో పనిచేశామన్న దాని పైనే ఉత్పాదకత ఆధారపడి ఉంటుందని ఆమె తెలిపారు.

మానవ ఆరోగ్యంపై దీర్ఘకాల పనిగంటల ప్రభావం గురించి అడిగిన ప్రశ్నకు సౌమ్యా స్వామినాథన్ సమాధానమిస్తూ 'చాలా కష్టపడి పనిచేసే అనేక మందిని నేను చూశాను. అది వ్యక్తిగత విషయమేనని అనుకుంటాను. మీరు ఎప్పుడు అలసిపోయారో మీ శరీరం చెబుతుంది. కాబట్టి అప్పుడు మీ శరీరం చెప్పినట్లు వినాలి. మీరు కొన్ని నెలల పాటు చాలా కష్టపడి పనిచేయగలరు. కోవిడ్ సమయంలో మనమంతా అదే చేశాం కదా. కానీ దానిని సంవత్సరాల తరబడి కొనసాగించగలమా? చెప్పలేను' అని అన్నారు. 'ఆ రెండు మూడు సంవత్సరాలు కష్టపడి పనిచేశాం. ఎక్కువ సేపు నిద్ర పోలేదు. చాలా సమయం ఒత్తిడితో గడిపాము. అనేక విషయాలపై కలత చెందాము. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ కల్పించే వారి గురించి ఆలోచించాం. వాళ్లు రాత్రింబవళ్లూ పనిచేశారు. కోవిడ్ తర్వాత చాలా మంది తమ వృత్తిని వదిలేశారు. మనం ఆ విధంగా స్వల్పకాలంలో మాత్రమే కష్టపడగలం. కానీ వాస్తవానికి అది సరికాదు' అని చెప్పారు.

సుస్థిరమైన పనితీరు కనబరచాలంటే మానసిక ఆరోగ్యం, విశ్రాంతి అవసరమని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ కూడా అయిన అంతర్జాతీయ ఆరోగ్య నిపుణురాలు సౌమ్యా స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. మానవ శరీరానికి నిద్ర, మానసిక ప్రశాంతత అవసరమని ఆమె తెలిపారు. 'మీరు మీ టేబుల్ ముందు 12 గంటలు కూర్చోగలరు. కానీ 8 గంటల తర్వాత నాణ్యమైన పని చేయలేరు. కాబట్టి ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి' అని అన్నారు.

గతంలో ఎవరేమన్నారు?

పనిగంటలపై గతంలో ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ చర్చకు తెర తీశారు. ఉద్యోగులు ఆదివారాలు సహా వారానికి 90 గంటలు పని చేయాలని ఆయన సూచించారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి కూడా సుబ్రమణ్యన్ అభిప్రాయాలతో ఏకీభవించారు. కాకపోతే ఆయన వారానికి 70 పనిగంటలను సూచించారు. 2047 నాటికి భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలంటే భారతీయులు మరింత కష్టపడి పనిచేయాలని నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ సలహా ఇచ్చారు. వారానికి 80 లేదా 90 గంటలు కానివ్వండి....లక్ష్య సాధనకు కష్టపడి పనిచేయాల్సిందే అని చెప్పారు. అయితే పని గంటలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లజే ఇటీవల పార్లమెంటుకు తెలిపారు.



కర్నాటకలో కూలిన బిల్డింగ్..

- ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

బెంగళూరు: కర్నాటకలో పాడుబడిన భవనం కూలి పోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించగా కొందరు గాయ పడ్డారు. ఇద్దరు వ్యక్తుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. క్షత గాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కర్నాటకలోని హసన్ జిల్లాలో ఆదివారం బేలూరు బస్టాండ్ వద్ద ఉన్న పాడుబడిన బిల్డింగ్ కూలిపోయింది. ఆ సమయంలో భవనం ముందు కొందరు కూర్చొన్నారు. ఈ ఘటనలో ఒకరు మరణించగా నలుగురు గాయపడ్డారు. మ ృతుడ్ని అమర్‌నాథ్‌గా గుర్తించారు. బిల్డింగ్ కూలడం చూసి స్థానికులు భయాందోళన చెందారు. కాగా, పురాతన బిల్డింగ్ కూలిన సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన నలుగురిని హసన్‌లోని హిమ్స్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీస్ అధికారి తెలిపారు. బిల్డింగ్ కూలిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

ఫరకేమీ లేదు




నగరం నసీబుల రాసుంటే
ఖుదా క్యా కారేగా
పల్లె దారులన్నీ పట్నం బాట పట్టాయి
పల్లె పాటలన్నీ ప్రదర్శనల్లో మిగిలిపోయాయి
అందమయిన అంగళ్లూ
అందమయిన అగ్గిపెట్టెల్లాంటి ఇండ్లూ
ఆయస్కాంతాల్లా ఆకర్షిస్తూ ఉంటే
భూమ్మీద నిలబడ్డం మట్టిల పోర్లాడ్డం
చెట్ల నీడన సేదదీరడం
అంత ఆసాన్ కాదు
నీ సంగతటుంచు
ఏ నది ఒడ్డునో చిన్నపిల్లాడిలా
మిలమిల లాడుతూ
ఏ చెరువు గట్టునో
చిగురుటాకులా రెపరెపలాడుతూ ఊరుండేది
మట్టిబాటలో నడుస్తూనో
గద్దెలమీద కూర్చునో ముచ్చట్లాడుతూ
పూర్లన్నీ ఒకేలా ఉండేవి
ఇప్పుడు పూర్లన్నీ నగరాలకు
నకల్లవుతున్నాయి
మునివేళ్లమీద పరుగుపెడుతూ
ఊసరవెళ్లుల్లా రంగులు మార్చుకుంటున్నాయి
కార్లతో బార్లతో పిజ్జాలూ బర్గర్లతో
నగరానికి నమూనాలవుతున్నాయి
నువ్వెక్కడున్నా ఏమి తిన్నా
ఫరకేమీ లేదు
మనిషిగా నిలబడ్డమే
పెద్ద సవాలు

- వారాల ఆనంద్


సమంత హార్వేకు బుకర్ ప్రైజ్ అందించిన 'ఆర్బిటల్'

"భూమి చుట్టూ తిరుగుతున్న అంతరిక్ష నౌకలో వాళ్లంతా ఒక్కచోటే కలిసివున్నారు. ఐనా వారి మనసు లోపల ఒంటరిగానే వున్న భావన. వారి ఆలోచనలు, అంతర్లోకాలు విడిపోతునట్లు, కొన్నిసార్లు ఏకమవుతున్నట్లు వారి స్వప్నాల్లో సారూప్యత, అంతలోనే వైరుధ్యాలు, అనంతమైన చీకటి, అంతలోనే శక్తివంతమైన వెలుగు, సున్నితత్వం లేని అంతరిక్షం, సరళమనుకున్న అనంతత్వలో విశ్వాన్ని ఆవిష్కరించాలనే లక్ష్యంతో వారి వారి స్లీపింగ్ బ్యాగ్స్ నుండి మరో ఉదయంలోకి మేల్కొంటున్న వ్యోమగాముల కార్యాచరణ ప్రారంభం - "భూమి మీద పాఠకుడి చేతిలో వున్న హార్వే 'ఆర్బిటల్' నవలా పఠనం ప్రారంభం.



సమంత హార్వే- తెలుగు సాహిత్య రంగానికి అంతగా పరిచయం లేని పేరు. ప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత్రి . ఈమె రాసిన 'ఆర్బిటల్' నవల 2024 సంవత్సరానికి బుకర్ ప్రైజ్ గెలుచుకోవడంతో సమంత హార్వే పేరు నవలా సాహిత్య రంగంలో మరోసారి వెలుగులోకి వచ్చింది. ఆర్బిటల్ నవల వైజ్ఞానిక కాల్పనిక సాహిత్య సమ్మేళనాల ప్రతిబింబం. తాత్విక యవనిక పై సాగే ఈ నవల ఆరుగురు వ్యోమగాముల అంతరిక్షయాన విశేషాలు, వారి భావోద్వేగాలు, మానసిక స్థితి, వైయక్తిక అనుభవాలను రంగరించి రచయిత్రి ఆసక్తికరంగా కథను నడిపిస్తుంది. 136 పేజీల ఈ నవలను 2023 నవంబర్‌లో యుకె లోని Jonathan Cape సంస్థ ప్రచురించగా, అదే సంవత్సరం 2023 డిసెంబర్‌లో యుఎస్‌లోని Groove Atlantic సంస్థ ప్రచురించింది.

నేపథ్యం: నవల రచన ప్రారంభంలో హార్వే భూమి అంతరిక్ష నౌక కేంద్రం, స్పేస్‌కు సంబంధించిన విషయాలపై ఆసక్తికరంగా అధ్యయనం చేసింది. ఈ నవలను 2010లో ప్రారంభించి కొంతవరకు రాసి సంబంధిత నవలా వస్తువుపై తనకు సరియైన అవగాహన, విషయ పరిజ్ఞానం లేదన్న భావం కలిగి రచనను అక్కడే ఆపేసింది. క్లిష్టమైన వస్తువు, అంతరిక్ష ప్రయాణానికి సంబంధించి పరిమితమైన జ్ఞానం అన్న ఆలోచన ఆమె నిర్ణయానికి కారణమైంది. 'ఎన్నడూ తను అంతరిక్ష నౌకలో ప్రయాణం చేయలేదు, అలాంటప్పుడు ఈ విషయం మీద నవల రాయడానికి తనకున్న అర్హత ఏమిటి' అనే భావన ఆమె రచనను నియంత్రించింది. తిరిగి హార్వే 2020, కోవిడ్ - 19 విస్తరించిన కాలంలో ఈ నవలను పూర్తి చేసింది.



నవల సారాంశం: ఈ నవల 24 గంటల కాలపరిధిలో అంతరిక్ష నౌకలో ప్రయాణించిన జపాన్, యుఎస్, బ్రిటన్, ఇటలీ, రష్యాకు చెందిన ఆరుగురు వ్యోమగాముల అనుభవాలు వ్యక్తీకరించబడ్డాయి. అందులో నలుగురు పురుషులు కాగా ఇద్దరు మహిళలు వుంటారు. జపాన్‌కు చెందిన 'ఛే (Chie) 'బ్రిటన్ వ్యోమగామి 'నెల్ (Nell)' (వీరిద్దరు మహిళలు), అమెరికా దేశస్తుడు షాహూన్, ఇటలీ కి చెందిన పిత్రో ఇంకా రష్యాకు చెందిన కాస్మోనాట్స్ అంటోన్, రోమన్ ఈ మిషన్‌లో పాల్గొన్న పాత్రధారులు. ఈ నవల ప్రధాన ఉద్దేశం అంతర్జాతీయ అంతరిక్ష నౌకలో భూ కక్ష్య చుట్టూ పరిభ్రమించి పరిశోధనలు చేయడం. వీటితో పాటు అధికారికంగా చేసే కార్యాచరణ విషయాలు, అంతరిక్ష నౌకలో వ్యోమగాములు చేసే పనులపై అవగాహన కలుగజేయడం. అలాగే తాత్విక సంబంధమైన విషయాలు, మానవీయ అంశాలపై, భగవంతుడి ఉనికిపై అనేక విషయాల చర్చ కూడా సాగుతుంది. జీవితం ముఖ్య ఉద్దేశమేమిటి? లక్ష్యం ఏమిటి? అన్న వాటిపై దృష్టి పెడుతుంది. ప్రతి అధ్యాయం 90 నిమిషాల వ్యవధితో సాగే భూమి చుట్టూ తిరిగే కక్ష్య పరిభ్రమణాన్ని 24 గంటల్లో 16 కక్ష్యలుగా (orbits) విడదీసి విషయాలను చర్చిస్తుంది. వ్యోమగాముల్లో ఒకరైన 'ఛే' తన తల్లి మరణ వార్త విన్న తర్వాత ఆమె అనుభవించిన భావోద్వేగాలను, విషాదాన్ని చాలా ఆర్ద్రంగా తన రచనలో వ్యక్తీకరిస్తుంది రచయిత్రి. ఇతర వ్యోమగాముల సంతాప వచనాలు కూడా హృదయాన్ని తాకుతాయి.

నవల చదువుతున్నంత సేపు నక్షత్ర మండలంలో తిరుగాడిన అనుభూతి పాఠకుడికి కలిగిస్తుంది. అనంతమైన విశ్వంలో జరుగుతున్న వైవిధ్యమైన సంఘటనలు, ఏకసూత్రంలో కట్టిపడేసిన ఉనికి, అంతరిక్ష నౌకలో వ్యోమగాముల స్నేహపూర్వకమైన పలకరింపులు, దైనందిన కార్యక్రమాలు, విచిత్రమైన అనుభవాలు, లింగ అసమానతలు, జాతి, మతం, వాతావరణ మార్పుల వర్ణన, జీవన్మరణాలపై తాత్విక చింతన, అంతరిక్షంలో తిరుగాడు సమయాన క్షణక్షణం మారుతున్న వాతావరణ ప్రభావాలు, భూమి మీద అనేక దేశాల వాతావరణం, అంతరిక్షంలోని వాతావరణ మార్పులలోని వైవిధ్యం, వ్యోమగాములు అనుభూతులు, శాస్త్రీయమైన విషయాలు పాఠకుడిని ఆశ్చర్యానికి పురిగొల్పుతాయి. అంతరిక్షం నుండి కింద వున్న భూమిని చూస్తున్నప్పుడు ఈ అనంతమైన విశ్వంలో వారి ఉనికి, అస్తిత్వం ఏమిటా? అని తలెత్తిన ప్రశ్న అనేక ఆలోచనలను ముందుకు తెస్తుంది. నవల రచన చేయడం ఒక ఎత్తయితే, తీసుకున్న వస్తువుకు శాస్త్రీయ సంబంధ విషయాలలోని సహజత్వాలు , వాస్తవాలను జత చేసి న్యాయం చేకూర్చడం రచయిత్రికి మేధోశ్రమను కలిగించే విషయం. ఒక ఇంటర్వ్యూలో సమంత హార్వే 'ఈ నవల మనిషి వ్యక్తిత్వం, ప్రతిష్ట కోసం, కుటుంబ వాతావరణాన్నీ, మానవ సంబంధాలను, విలువలను ప్రతిబింబించడానికి చేసిన ప్రయత్నం' అంటుంది . Edmund de Waal, Sarah Collins , Yiyun Li, Justine Jordan, Nitin Sawhney ఐదుగురు సభ్యులతో కూడుకున్న న్యాయనిర్ణేతల కమిటీ వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ఆ నవలను ఏకగ్రీవంగా ఎన్నుకుంది . "Set on the International Space Station over 24 hours, this short and lyrical novel charts the lives of the six people in the cramped spacecraft as they observe the world beneath them, in all its beauty and vulnerability" అని జ్యూరీ సభ్యులలో ఒకరైన Edmund de Waal, The Week పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు, 2019 తరువాత మహిళా రచయిత్రులలో సమంత హార్వే బుకర్ ప్రైజ్ తీసుకున్న తొలి మహిళగా కమిటీ అభివర్ణించింది. 2019 లో Bernardine Evaristo, Margaret Atwood కలిసి గెలుచుకున్నారు. 24 గంటల్లో భూమి చుట్టూ అంతరిక్ష నౌకలో తిరుగాడుతూ అంతరిక్షాన్ని, భూమి మీది జీవరాశిని ఆరుగురు వ్యోమగాముల తాత్విక దృష్టిలో మనకు రచయిత్రి అందిస్తుంది.

> నవల చదువుతున్నంత సేపు నక్షత్ర మండలంలో తిరుగాడిన అనుభూతి పాఠకుడికి కలిగిస్తుంది. అనంతమైన విశ్వంలో జరుగుతున్న వైవిధ్యమైన సంఘటనలు, ఏకసూత్రంలో కట్టిపడేసిన ఉనికి, అంతరిక్ష నౌకలో వ్యోమగాముల స్నేహపూర్వకమైన పలకరింపులు, దైనందిన కార్యక్రమాలు, విచిత్రమైన అనుభవాలు, లింగ అసమానతలు, జాతి, మతం, వాతావరణ మార్పుల వర్ణన, జీవన్మరణాలపై తాత్విక చింతన, అంతరిక్షంలో తిరుగాడు సమయాన క్షణక్షణం మారుతున్న వాతావరణ ప్రభావాలు, భూమి మీద అనేక దేశాల వాతావరణం, అంతరిక్షంలోని వాతావరణ మార్పులలోని వైవిధ్యం, వ్యోమగాములు అనుభూతులు, శాస్త్రీయమైన విషయాలు పాఠకుడిని ఆశ్చర్యానికి పురిగొల్పుతాయి.



- డా . రూప్ కుమార్ డబ్బీకార్
91778 57389



సంకెళ్ళ నుంచి విముక్తి వరకు

పుస్తకాలు చదవాలి అని నిర్ణయించుకున్న తరువాత చదివిన పుస్తకాల్లో ఇది ఒకటి. అప్పటికి దాని గురించి ముందూ వెనకా సమాచారం ఏమీ తెలియదు. కేవలం ఎర్రని అట్టపైనున్న బొమ్మను మాత్రమే చూసి కొనుక్కున్న పుస్తకం. ఏం అంచనాలు లేకుండానే మొదలుపెట్టాను.



పట్టపగలు మొదలు పెట్టిన పుస్తకం. ఆకలి దప్పులు మరిచేపోయా. రాత్రయింది. ఎవరో లైటు వేశారు. నన్ను పిలుస్తున్న చప్పుళ్ళు ఎక్కడో బ్యాగ్రౌండ్ సౌండ్స్ లాగే ఉండిపోయాయి. గుండెను పిండేస్తున్న బాధ. కడుపులో చేయిపెట్టి పేగులను మెలితిప్పే దుఃఖం. కట్టలు తెంచుకునేంతటి ఉక్రోషం. ఆపుకోలేని ఉత్కంఠ. గుక్క తిప్పుకోనివ్వని ఉద్వేగం. ధారాపాతంగా వర్షిస్తూనే ఉన్న కళ్ళు. అక్షరాల వెంట పరుగులుతీస్తూ ఆ చీకటి ప్రపంచంలోనే కొట్టుమిట్టాడుతున్న నేను ఆఖరు పేజీ దాకా వదలనివ్వకుండా అంటిపెట్టుకుందా పుస్తకం. ఆ తరువాత చూశాను వెనుక అట్టపైన రచయిత పేరు, ఫొటో

ఒక పుస్తకం మనిషిని ఇంతలా అతలాకుతలం చేస్తుందని పందొమ్మిదో సంవత్సరం దాకా తెలియలేదు. అంతదాకా పేదరాశి పెద్దమ్మ కథలో, సింద్ బాద్ సాహస యాత్రలు మాత్రమే తెలిసిన నాకు ఈ పుస్తకం ఒక కుదుపు. అలాంటిలాంటి కుదుపు కాదది. అంతదాకా సుపరిచితులైన వారి స్వభావాలపై ఎటువంటి అంచనాకు రావాలో తెలియని అయోమయపు కుదుపు. ఒక బాస్ వద్ద పనిచేసే సబార్డినేట్‌ను... ఇద్దరి దృష్టి కోణాలను గమనించదగిన కుదుపు. అదే విధంగా హైరార్కీలో ఏ విధంగా ఉంటుందో తరచి చూసే కుదుపు. నెలరోజులపాటు వెంటాడి నన్ను నన్నుగా నిలబెట్టడంలో ఘనమైన పాత్ర పోషించిన పుస్తకం అది. జీవితాంతం మరిచిపోలేని, వదలలేని పుస్తకమై కూర్చుంది. అదే 'ఏడు తరాలు'. ఇరవై ఏళ్ళు గడిచాయి ఈ పుస్తకం చదివి. మళ్లీ చదివే స్థైర్యాన్ని ఇంకా కూడగట్టుకుంటూనే ఉన్నాను. పుస్తకాన్ని ప్రేమగా హత్తుకుంటాను. తిరిగి పెట్టేస్తూ ఉంటాను. నా దృష్టిలో కుంటా కింటే గొప్ప యోధుడు. నల్లజాతి యోధుడు. నా మనో ఫలకంలో ఇలాగే నిక్షిప్తమై ఉన్నాడు.

మనుషుల్లో ఇంతటి క్రౌర్యం దాగి ఉంటుందా అనే ఆశ్చర్యం కలుగుతుంది. ఒక నీగ్రో జాతికి చెందిన రచయిత తరతరాలుగా కొనసాగుతున్న వర్ణ వివక్ష మూలాలకు బీజం ఎక్కడ పడిందో వెతుక్కుంటూ తన వంశ ఏడు తరాల చరిత్రను వెలికి తీశాడు. ఎంత అబ్బురమైన విషయమిది. ఇందుకోసం శతాబ్దాల చరిత్రను పరిశోధించి తన మూలాలను పట్టుకుని మనకో హీరోను పరిచయం చేస్తాడు. అతడే రచయిత వంశానికి చెందిన మూల పురుషుడు కుంటా కింటే. పదహారేళ్ళ దాకా తల్లిదండ్రుల చెంత స్వేచ్ఛగా విహరించే కుంటా కింటేను తెల్లదొరలు బంధించి తీసుకెళ్తారు. తెల్ల జాతీయులు, నల్లజాతీయులను బానిసలుగా మార్చుకోవడం అప్పుడే ప్రారంభమవుతుంది. అంటే 1619లో అన్నమాట. అక్కడి నుంచి కుంటా కింటే పేరు మార్చుతారు. తన నేల పశ్చిమ ఆఫ్రికా నుంచి తెల్ల తోలువారి బందీగా ఒక బోటులో ప్రయాణిస్తాడు. అది కూడా బోటులో గాలీ వెలుతురు ఆడని చీకటి భాగాన కుక్కి తీసుకు వెళ్తారు. అక్కడి నుంచి బానిసల మార్కెట్లో మరెవరో యజమాని చేతుల్లోకి మారతాడు. తన నేల పరిసరాలు తప్ప మరేమీ తెలియని కింటే ఆ వింతైన ప్రపంచం నుంచి పారిపోజూస్తాడు. నాలుగు సార్లు ప్రయత్నించి విఫలమవుతాడు. ఇతడి పెనుగులాటను భరించని ఒక తెల్ల యజమాని కింటే కాలును నరికేస్తాడు. అది సహించలేని ఆ యజమాని సోదరుడు ఇతడిని కొనుగోలు చేసి వైద్యం అందించి ప్రాణాలు కాపాడతాడు. చివరకు అదే ఇంటిలో ఉంటూ వాస్తవాలను జీర్ణం చేసుకుంటూ నెమ్మదిగా రాజీ పడతాడు. అక్కడే వంట చేస్తున్న బానిసను పెళ్ళి చేసుకుంటాడు. వారికో కుమార్తె కలుగుతుంది. ఆమెకు తన నాయనమ్మ పేరు పెట్టుకుని తన వంశాచారాల ప్రకారమే పెంచుతాడు. ఆమె కూడా ఎదిగిన తరువాత బానిసగా మరో ఇంటికి అమ్ముడవుతుంది. అక్కడ యజమాని చేతిలో అత్యాచారానికి గురై అతడి కొడుకుకు తల్లి అవుతుంది. అతడు బానిస కొడుకుగానే గుర్తింపు పొందుతాడు తప్ప తెల్ల యజమాని బిడ్డగా కాదు. అయితే కింటే తన బిడ్డకు తన కథ అంతా చెబుతాడు. అదే కథను బిడ్డకు పుట్టే బిడ్డలకు, ఆ తరువాత బిడ్డలకు అలా చెబుతూ పోవాలని కోరుకుంటాడు.

ఏడో తరం అయిన రచయిత తన నాయనమ్మ నోట ఈ కథ విన్న తరువాతే పరిశోధన మొదలుపెట్టి రాసిన వాస్తవిక గాథ ఇది. ఆ రచయిత అలెక్స్ హేలీ.

అగ్రరాజ్యంగా విర్రవీగుతూ ఇతర దేశాలపై పెత్తనం చెలాయిస్తూ, నీతి బోధలు చేసే ఈ దేశ చరిత్రా ఇంత హీనం అనిపించకమానదు. సాటి మనుషులను బానిసలుగా చేసుకుని వారి రక్తమాంసాల ప్రవాహాలపై, శవాల గుట్టలపై నడిచొచ్చిన నీచమైన చరిత్రకు ఒళ్ళు గగుర్పొడుస్తుంది. జాత్యహంకారం ఎంత దారుణంగా ఉండేదో చెప్పడానికో ఉదాహరణ ఈ పుస్తకం.

గొర్రెనో, బర్రెనో కొనుక్కున్నట్లు ఒక మనిషిని కొనడం, బానిసగా మార్చుకోడం. ఆ బానిసకో ఆలోచన, మనసు ఉంటుందనే స్పృహే వారికి ఉండకపోవడం విచిత్రం. ఒక బల్లనో, కుర్చీనో తమ గదిలో ఉన్నట్లుగా ఓ బానిసా పడి ఉంటుంది ఓ పక్కన. గుక్క తిప్పుకోకుండా మాట్లాడుకునే అనేక విషయాలు పుస్తకంలో ఉన్నాయి. పుస్తకం చదువుతూ ఆ పరిస్థితులను ఆవాహన చేసుకున్నప్పుడు అద్భుతంగా తోస్తుంది. ఈ పుస్తకాన్ని ప్రతి నల్ల జాతీయుడు బైబిల్ గా దాచుకున్నాడు.

పుస్తకం వెలువడిన తరువాత ప్రపంచవ్యాప్తంగా లక్షల కాపీలు అమ్ముడుపోయాయి. ఎన్నో దేశాలు పుస్తకాన్ని వారి వారి భాషల్లోకి అనువదించుకునే హక్కులు పొందారు. అమెరికా నిజ స్వరూపం ప్రపంచానికి వెల్లడించిన పుస్తకంగా నిలిచిందీ ఏడు తరాలు. అమెరికా అధ్యక్షుడిగా అబ్రహం లింకన్ ఉన్న సమయంలో ఈ నల్ల జాతీయులకు విముక్తి లభించింది. లింకన్ బానిసత్వాన్ని రద్దు చేసాడు. అందుకోసం దేశంలో అంతర్యుద్ధం జరిగింది. బానిసత్వం రద్దు చేసిన వారం రోజుల్లోనే లింకన్ హత్యకు గురయ్యాడు. తళుకు బెళుకుల రాజ్యంగా వెలుగొందుతున్న అమెరికాలో ఇప్పటికీ జాతి వివక్ష కొనసాగుతూనే ఉంది. మొన్నటికి మొన్న జార్జ్ ఫ్లాయిడ్ అనే వ్యక్తి 'ఐ కాంట్ బ్రీత్' అంటూ ఒక అమెరికన్ పోలీసాఫీసర్ మోకాలికింద నలిగి ప్రాణాలర్పించాడు.

ఈ పుస్తకం గురించి వికీపీడియాలో ఇలా రాసి ఉంది... "స్వేచ్ఛనుంచి సంకెళ్ళ దాకా, సంకెళ్ళనుంచి విముక్తికి సాగిన ఒక ప్రస్థానం 'ఏడు తరాలు". అక్షరసత్యం ఈ అక్షరాలు.

- నస్రీన్ ఖాన్

సాహితీ వార్తలు

సుధామ, చంద్రశేఖర ఆజాద్‌లకు మునిపల్లె రాజు పురస్కారాలు


కథాఋషి మునిపల్లె రాజు శతజయంతి సందర్భంగా 2023 సాహిత్య పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త, సప్తపది లఘుకవితా ప్రక్రియ సృజనకర్త సుధామ గారికి, 2024 సాహిత్య పురస్కారాన్ని సుప్రసిద్ధ కథా, నవలా, సినీ రచయిత చంద్రశేఖర ఆజాద్ గారికి ప్రదానం చేయడానికి మునిపల్లె రాజుగారి కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఈ పురస్కార ప్రదాన సభ మార్చి 17వ తేదీ సోమవారం సాయంకాలం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఎంవిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతుంది.

వృత్తులను ఏకం చేసే 'ఏకుదారం'

తనలో కలిగే ఆలోచనలను, అనుభూతులను, నలుగురితో పంచుకోవడానికి సాధనంగా ఈరోజు నవల బాగా ఉపకరిస్తున్నది. నవలా సాహిత్యంపట్ల ఎక్కువమంది ఆకర్షితులు కావటం స్వాగతించదగ్గ విషయం. ప్రత్యేక ప్రాపంచిక దృక్పథం ఉన్నవారికి, లేనివారికి ఒకే విధంగా నవల ఆలంబన అవుతున్నది. అయితే సమకాలీన నవల వస్తు సంవరణంలో, వైవిధ్యాన్ని, రూపనిర్మాణంలో, వస్తు నిర్మాణంలో, శిల్ప నిర్మాణంలో, పరిణితిని సాధించింది. భాషను ఉపయోగించడంలో మెలకువలు, అనుభవాన్ని, అనుభూతిని, వాస్తవాన్ని, సమాజంలో మార్పులు నవలలుగా మారుతున్నాయి. ఈ తరుణంలో సూటిగా, సరళంగా, వైవిధ్యంతో గజమాలగా గట్టిగా వృత్తులన్నీకలిపికట్టిన దారంలాగా ముందుకొచ్చిన నవల 'ఏకుదారం'. అనే నవల. ఇన్నేళ్ల తెలుగుసాహిత్య చరిత్రలో గొర్రెలకాపర్ల జీవిత లోతులను ఇంత క్షుణ్ణంగా అధ్యయనం చేసి రాసిన నవల రాలేదంటే అతిశయోక్తి కాదు. డా. బి. నాగశేషు ఉన్ని వృత్తుల జీవితాల్లోని అగాధాలను, ఆర్తిని ఒడిసిపట్టుకున్నలోతైన అవగాహనతో 'ఏకుదారం' నవల రాశారు.

పూలను దారంతో బంధిస్తే హారం, వృత్తులను ఏకం చేస్తే 'ఏకుదారం'. పుట్టుక నుంచి చావువరకు వ్యక్తిని సులభంగా చదవవచ్చు. కానీ సమాజాన్ని చదవాలంటే విభిన్న కోణాలు ఉంటాయి. వాటిని అర్థం చేసుకునే పరిణితి, ఆ కోణాల వెనుక ఉన్న కారణాలు ఇలా చాలా క్లిష్టతతో కూడుకుని ఉంటుంది. సమాజ భిన్నతకు కారణాలైన వృత్తి, కులం, లింగం, వర్ణం, మంచి, చెడు, లేనోడు, ఉన్నోడులాంటి స్థితిగతుల అంతరాల్లోని అతుకులబతుకులకు అక్షరరూపమే ఈ 'ఏకుదారం' నవల.

సమాజానికీ వృత్తులకీ చాలా అవినాభావ సంబంధం ఉంది. మన భారతదేశంలో కుల వృత్తులను ప్రపంచదేశాలు వ్యాపారశక్తులుగా మార్చుకున్నాయి. మనం ఈ అధునాతన కాలంలో సాంకేతికను ఉపయోగిస్తూ వృత్తులను విస్మరిస్తున్నాం. పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు' అన్నమాట మర్చిపోయారు. దానికి రాజకీయంగా, మతపరంగా అనేక కారణాలు ఉన్నాయి. వృత్తులు అనేవి చిన్నచూపు అనే ఆర్థిక దోపిడీ, శ్రమదోపిడీ చేస్తున్నంతకాలం వృత్తికారుల కష్టానికి విలువచిక్కదు. అందరూ అధికారాన్ని చలాయించేవాళ్లే వుంటే కష్టించి పనిచేసే వాళ్లెవరుంటారు. కష్టించే సమాజాన్ని గౌరవించుకోకపోతే ఆ శాతం తగ్గిపోయే ప్రమాదం వుంటుంది.



'ఏకుదారం' నవల రాయలసీమ యాసతో అందులోనూ ప్రత్యేకించి అనంతపురంజిల్లాలో సామాన్యప్రజానీకం మాట్లాడే వ్యావహారిక భాషలో సాగుతుంది. పొద్దునలేచినప్పటినుండీ గొర్లుకాయడం, బొచ్చుకత్తరించడం, ఏకి, వాడికి, సీడుపోసి, పేకేసి, వార్పుకట్టడం, సెర్రిరుబ్బడం, గొంగళ్లు తయారుచేయడం, లాంటిపనులన్నీ వొకే కులవృత్తివాళ్లు చేయడం మనకు ఈ నవలలో కనిపిస్తుంది. నేత అనగానే మనకు చీరలచేనేత రంగం గుర్తుకువస్తుంది. అయితేగొంగడి పరిశ్రమ వొకప్పుడు విరివిగా వుండేది. ఆతరువాతి రోజుల్లో ఆదరణ తగ్గి చాలా వరకు ఆ కళ అంతరించింది. ఇలాంటి విశేషమైన వృత్తిని తెలుగు సాహిత్యంలో రికార్డుచేసిన ఘనత నాగశేషుకే దక్కుతుంది. ఆవృత్తిలోఉన్న శ్రమదోపిడీ, పెద్దమనుషుల నిర్వాకాలు, సహకారసంఘాలమోసాలు, అమాయకత్వం, తాగుడు, అవిద్య, మొరటుతనం ఇవన్నీ ఆ వృత్తికారులను ఏవిధంగా వెనుకబాటుతనానికి గురిచేశాయో ఈనవలలో వివరంగాకనిపిస్తాయి. ఈ నవల ఉమ్మడి అనంతపురం జిల్లా, పక్క రాష్ట్రమైన బెంగళూరు ప్రాంతాల మనుషుల జీవనస్థితిగతులను పెనవేసుకొని సాగుతుంది. ఇందులోని పాత్రలన్నీ మన కళ్ళకు కట్టినట్టు కనబడతాయి.

ఎర్రిపూలమారెమ్మ ఊరేగింపుతో ఈ నవల ప్రారంభమవుతుంది. ఈ ఎర్రిపూల మారెమ్మ మేసినపల్లిలో ఉగాది తర్వాత జరిగే తమాషాపండుగ. మేసినపల్లి అంతా ఊరేగింపు ఉత్సవాల్లో ఉంటే గొర్రెలు కాసే వాళ్ల మద్దిలేటి, పాతన్న, ముత్యాలప్ప, చౌడప్ప మాత్రం బాయిలో గొర్రెలను ఈతకు తీసుకెళ్ళాల్సిన పరిస్థితి. మనిషికి క్షవరం చేసినట్టు గొర్రెలకుకూడా బొచ్చుకత్తిరించాల్సి ఉంటుంది. రామాంజి, సీమప్ప, సుబ్బారాయుడు గొర్రెలకాపరుల సాంప్రదాయం ప్రకారం పూజ మొదలుపెట్టి గొర్రెబొచ్చును కత్తరిస్తారు. సుబ్బరాయుడికి గొర్రె బొచ్చు కత్తిరించడంలో వెన్నతో పెట్టిన విద్య. కురుబల జీవనాధారం గొర్లు కాయడం. కురుబల అస్తిత్వ చిహ్నమైన 'కంబళి' ఇచ్చే ఒప్పందంతో గొర్రెలు బొచ్చు కత్తిరిస్తారు. గొర్రెలకాపరుల జీవితాల్లోని అమాయకత్వాన్ని, లోకంతెలియని పోకడను, వాళ్ల వింతఆచారాలు మనకు ఈనవలలో విరివిగా కనిపిస్తాయి.

నవలలో ముఖ్యమైన పాత్రలు పరాకాయం ప్రవేశం చేస్తాయి. ముత్యాలమ్మ భర్త సంజన్న, కొడుకులు పెద్దోడు, నడిపోడు, బీరప్ప వీళ్లే ఈ నవలలో ముఖ్యమైన పాత్రలు. భర్త పెట్టే కష్టాలు తట్టుకునేలోపు కొడుకులు పెద్దగయి వాళ్లకూడా కన్నతల్లి కన్నీళ్లే మిగులుస్తారు. తనజీవితంలో ఏ ఆభరణమూ ఆమెను అలంకరించలేదు అంటారు రచయిత. ఆమెకు దక్కింది బూడిదరవ్వల కిరీటం మాత్రమే. ఎంతైనా మాతృత్వ గొప్పతనానికి, స్త్రీ జాతికి ముత్యాలమ్మ ఆదర్శం.

చెడుతిరుగుళ్ల తిరిగి, సూడో నక్సలైట్లవెంటవెళ్లి బతుకును ఎక్కడో బలివ్వాల్సిన బీరప్పపాత్ర, ఆఖరికి విశ్వవిద్యాలయంలో ఆచార్యులస్థాయిదాకా ఎక్కిపోవడం నవలలో ఆదర్శవంతమైన జీవితంతో ముగుస్తుంది. చదువు ద్వారానే బడుగుల జీవితాల వృద్ధిచెందుతాయని తెలిపే ఆశాజనక పాత్ర బీరప్ప. బీరప్పకు అండగా నిలబడిన చైతన్యమూర్తి అర్చన. ఎన్నో కన్నీళ్లు పెట్టించే సన్నివేశాలు ఇందులో వున్నాయి.

మాల కులస్థుల ఆకలికష్టాలు, కంసాలి, కుమ్మరి,మంగళి, గొల్ల, రెడ్డి,కమ్మ, బాపన, కోమటి కులాల సమిష్టిగ్రామజీవన తత్వం నవలలో కనిపిస్తుంది. ఈ నవల కేవలం వొక వృత్తిని కేంద్రీకరించుకుని రాసిందే కాకుండా సమస్తవృత్తులతో పల్లెవాసులు సహజీవనం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

మనం మంచి చేస్తే మంచే జరుగుతుంది. చెడు చేస్తే జరిగే జరుగుతుంది. మోసం చేసి వెళ్ళిపోయిన సీమప్ప చావు ఎంత భయంకరంగా ఉంటుందో ఈ నవల చదివే ప్రతి పాఠకుడు కన్నీళ్లు కారుస్తాడు. ఈ నవలలో ప్రతి ఒక్క పాత్ర మానవ సంబంధాలు ఏ విధంగా ఉన్నాయో కుల,మత, లింగ వర్ణాలు ఏ విధంగా ఉన్నాయో, వృత్తులు, ప్రవృత్తులు ఏ విధంగా ఉన్నాయో, ఆధునిక కాలంలో అవి ఎలా అంతరించి పోతున్నాయో తెలియజేస్తారు.

వృత్తులు ఎప్పటికీ తెగిపోని బంధంలా మనిషి జీవితాన్ని అల్లుకొనే ఉంటాయి. కానీ నేటి ఆధునిక కాలంలో వాటి బంధాలు వీగిపోతున్నాయి. శ్రామిక శక్తుల వృత్తులను కాలం ఎలా తన ప్రభావం చూపి వాటిని అంతరించే విధంగా చేస్తుందో చెబుతూనే ఆ ప్రాంత జీవన విధానాన్ని, అక్కడి సంస్కృతిని, సంఘర్షణలని రికార్డు చేశారు రచయిత. బయటి ప్రపంచానికి అంతగా అలవాటు పడనీ రాయలసీమలోని ఒక ప్రాంతపు(పెనుకొండ-హించుపురం-మడకశిర) యాసకు జీవం పోసింది. సీరియస్ లిటరేచర్ చదవాలనుకునే సాహిత్యప్రియులు తప్పక రుచిచూడాల్సిన నవల ఈ 'ఏకుదారం' అనడడంలో ఏవిధమైన సందేహం లేదు.



ఎం. సోమశేఖర్,
9848529891

టీమిండియాకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా నిలిచిన టీమిండియాకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. దుబాయ్ వేదికగా ఉత్కంఠభరితంగా జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించటం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. తమ అద్భుత ఆటతీరుతో టీమిండియా మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా భారత్ సత్తాను చాటి చెప్పిందని తెలిపారు. భారత జట్టులోని ఆటగాళ్లందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

కదులుతున్నరైలు దిగబోయి..
పట్టుతప్పిన మహిళ

- కాపాడిన రైల్వే కానిస్టేబుల్..
- ముంబయి లోకల్ స్టేషన్‌లో ఘటన



బోరివలి : ఓ మహిళ కదులుతున్న రైలు నుంచి దిగే ప్రయత్నంలో పట్టుతప్పి ప్లాట్‌ఫామ్‌పై పడిపోయింది. మహిళ పడుతుండగా గమనించిన రైల్వే కానిస్టేబుల్ పరుగున వెళ్లి ఆమెను పక్కకు లాగేశాడు. దాంతో ఆ మహిళ ప్రాణాలతో బయటపడింది. ముంబయి లోని బోరివలి స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వీడియోను భారత రైల్వే మంత్రిత్వ శాఖ సోషల్ మీడియాలో షేర్ చేసింది. రైల్వే పోలీసు చేసిన సాయాన్ని 'మిషన్ జీవన్ రక్ష'గా రైల్వే శాఖ అభివర్ణించింది. 'మహారాష్ట్రలోని బోరివాలి స్టేషన్‌లో కదులుతున్న రైలు నుంచి దిగుతున్నప్పుడు ఒక మహిళ పట్టు కోల్పోయి రైలుకు-ప్లాట్‌ఫామ్‌కు మధ్యలోకి జారిపోయింది. అక్కడే ఉన్న రైల్వే కానిస్టేబుల్ వేగంగా స్పందించి ఆమెను పైకి లాగడంతో ప్రమాదం తప్పింది. ఆయన చర్య అభినందనీయం. ప్రజలు రైళ్లలో ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడానికి మా సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారు' అని రైల్వేశాఖ పేర్కొన్నది.కాగా, గత నెలలో ముంబయిలోని అంధేరి రైల్వే స్టేషన్‌లోనూ ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. అప్పుడు 40 ఏండ్ల వ్యక్తి రెండు బ్యాగులు మోసుకుంటూ కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించాడు. కానీ పట్టుదొరకపోవడంతో కిందపడ్డాడు. వెంటనే స్పందించిన రైల్వే పోలీసులు అతడిని రక్షించారు. కాగా, బొరివలీలో రైలు నుంచి జారిపడ్డ మహిళను రైల్వే పోలీస్ వేగంగా స్పందించి బయటకు లాగిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

న్యూయార్క్‌లో కార్చిచ్చు

- ఆకాశాన్నంటిన దట్టమైన పొగ..

న్యూయార్క్ : న్యూయార్క్‌లోని హాంప్టన్స్ సమీపంలో కార్చిచ్చు రాజుకుంది. తీవ్రమైన గాలుల కారణంగా ఆ ప్రాంతమంతా ఆకాశాన్నంటే దట్టమైన పొగ కమ్ముకుంది. మాన్‌హట్టన్‌కు తూర్పున 80 మైళ్ల దూరంలో ఉన్న లాంగ్ ఐలాండ్‌లోని పైన్ బారెన్స్‌లో పెద్దఎత్తున ఈ కార్చిచ్చు చెలరేగింది. పైన్ బారెన్స్ అనేది సఫోల్క్ కౌంటీలోని 1,05,000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ, రక్షిత ప్రాంతం. ఈ ప్రాంతంలో రేగిన కార్చిచ్చును అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన వీడియోలు వైరలవుతున్నాయి.

ఎయిమ్స్‌లో ఉపరాష్ట్రపతి

- ఆరోగ్య పరిస్థితిపై ప్రధాని మోడీ ఆరా

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఎయిమ్స్‌లో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలిసిన వెంటనే ప్రధాని మోడీ ఆస్పత్రికి వచ్చి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నట్టు ఆయన స్వయంగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. ధన్కర్ ఆరోగ్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆదివారం తెల్లవారు జామున 2గంటల సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో జగదీప్ ధన్కర్‌ను ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన్ను క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో చికిత్స అందిస్తున్నారు. అంతకు ముందు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఆస్పత్రికి వెళ్లి ఉపరాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై విద్వేషం..


- ఖండించిన భారత్

కాలిఫోర్నియా : అమెరికాలోని కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై దాడి జరిగింది. చినో హిల్స్‌లోని బాప్స్ స్వామినారాయణ్ మందిరంపై పెయింట్‌తో కొందరు వ్యక్తులు విద్వేషపూరిత రాతలు రాశారు. ఆలయ అధికారులు ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే, ఈ దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'కాలిఫోర్నియా చినో హిల్స్‌లోని హిందూ దేవాలయంపై జరిగిన దాడి వార్తలను చూశాం. ఇలాంటి హేయమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ ఘటన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను డిమాండ్ చేస్తున్నాం. అదే విధంగా ప్రార్థనా స్థలాలకు తగిన భద్రతను కల్పించాలని కోరుతున్నాం' అని జైశ్వాల్ పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లోనూ ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. కాలిఫోర్నియా శాక్రమెంటోలోని బాప్స్ శ్రీ స్వామినారాయణ మందిరంపై విద్వేషపూరిత రాతలు రాశారు. దీనికి ముందు సైతం న్యూయార్క్‌లోని బాప్స్ మందిరం వద్ద దుండగులు ఇదే విధంగా ప్రవర్తించారు.

పెరుగుతున్న ఎండలు

చిన్నపిల్లలు, వృద్ధులకు జాగ్రత్తలు అవసరం : నిపుణులు

ప్రభుత్వాస్పత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎండల తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకు వాతావరణం వేడెక్కుతోంది. గత రెండు, మూడు రోజుల్లోనే ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెంటిగ్రేడ్స్ పెరిగినట్టు వాతావరణశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రజలు డీహైడ్రేట్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులతో పాటు వైద్యారోగ్యశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం, గ్లోబల్ వార్మింగ్ పెరగడం వంటి వాతావరణ మార్పులతో పాటు, మనిషి కలుషిత ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, రోగ నిరోధక శక్తి తగ్గడం తదితర కారణాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. అందువల్ల ఆరోగ్యాన్ని సంరక్షించుకునేందుకు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని నిపుణులు సూచిస్తున్నారు.

దాహంగా లేకపోయినా సరే వీలైనన్ని ఎక్కువసార్లు నీళ్లు తాగడం ద్వారా శరీరం డీహైడ్రేటేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. నీటితో పాటు ఇంట్లో తయారు చేసుకున్న లెమన్ వాటర్, బటర్ మిల్క్, సాల్ట్ -షుగర్ సొల్యూషన్, ఫ్రూట్ జ్యూస్ వంటివి తీసుకుంటే మంచిది. ప్రయాణ సమయాల్లో నీటిని వెంట తీసుకెళ్లాలి. ఆహార పదార్థాలు, వాటర్ మెలన్, మస్క్ మెలన్, ఆరెంజ్, ద్రాక్ష పళ్లు, పైనాపిల్ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు ఎంపిక చేసుకోవాలి. వీటితో పాటు కూరగాయలను తీసుకోవాలి. వదులుగా ఉన్న లైట్ కలర్ కాటన్ దుస్తులు ధరిస్తే బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత ప్రభావం శరీరంపై తక్కువగా ఉంటుంది. గొడుగు, క్యాప్, టవల్,, సాంప్రదాయ తలపాగలతో తలను కవర్ చేసుకోవాలి. తప్పనిసరిగా చెప్పులు ధరించాలి. సాధ్యమైనంత వరకు బయటి గాలి వచ్చే చల్లని ప్రదేశాల్లో ఉండాలి. సూర్యుని నుంచి వేడి నేరుగా ఇంట్లోకి రాకుండా కిటీకీలు, కర్టెన్లను మూసి ఉంచుకుని, రాత్రి సమయంలో, వాతావరణంలో ఉష్ణోగ్రత తగ్గాక తెరిచి ఉంచాలి.

పని వేళలను మార్చుకోవాలి

సాధ్యమైనంత వరకు బయటి పనులను ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళలకు మార్చుకోవాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో బయట పనుల పెట్టుకోవద్దు. ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింక్స్, ఎక్కువ మొత్తంలో షుగర్ కలిగిన పానీయాలు తీసుకుంటే అవి శరీరంలో ఉన్న నీటి శాతాన్ని తగ్గించి కడుపునొప్పికి కారణమవుతాయి.

వడదెబ్బకు సంకేతాలు

మానసికంగా ఆందోళనగా అనిపించడం, గందరగోళానికి గురికావడం, చర్మం వేడిగా, ఎర్రగా పొడిబారడం, కండరాలు బలహీన పడటం, గుండె అదే పనిగా కొట్టుకోవడం, శ్వాసలో వేగం పెరగడం, నిస్సారంగా మారుతుండటం గమనిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ ఏర్పాట్లు

వాతావరణంలో పెరుగుతున్న వేడికి తగినట్టుగా వైద్యారోగ్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లతో పాటు ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ బి.రవీందర్ నాయక్ తెలిపారు. అదే విధంగా పంపిణీ కోసం ఏఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్టు చెప్పారు.

ప్రజలకు నిబద్ధతతో సేవలందించండి

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి : రెవెన్యూ సంఘాల నేతలతో మంత్రి పొంగులేటి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ప్రజలకు సేవలందించడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖకు ఇటీవల పలు వరాలు ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి కృజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికే భూ భారతిని త్వరలోనే అందుబాటులోకి తెస్తున్నట్టు చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కొత్తగా పోస్టుల మంజూరు చేసిందన్నారు. 10,954 గ్రామ స్థాయి పరిపాలన అధికారులు (జీపీఓ), కొత్త డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను మంజూరు చేసినట్టు తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగులకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగుల వేతనాలను నెల మొదటి వారంలోనే ఇస్తున్నామన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, మహిళా అధ్యక్షురాలు రాధ, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, సీసీఎల్ఏ యూనిట్ అధ్యక్షులు రాంబాబు, తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు, ప్రధాన కార్యదర్శి వి లక్ష్మీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్దిదారుల ఎంపిక వేగవంతం చేయండి : కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశం

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. రెండు, మూడు రోజుల్లో ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి సమీక్షించారు. ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ ప్రక్రియలో కలెక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని కలెక్టర్లకు సూచించారు. లబ్దిదారుల ఎంపికలో ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని కలెక్టర్లు తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. నిర్మాణం పూర్తయిన రెండు గదుల ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేయాలని కోరారు. అసంపూర్తిగా ఉన్న వాటిని కాంట్రాక్టర్లు పూర్తి చేయని పక్షంలో లబ్దిదారులే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సాగు, త్రాగునీరుకు ఎలాంటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. వరంగల్ జిల్లాలోని ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డుకు భూసేకరణను వేగవతం చేయాలని మంత్రి ఆదేశించారు.

'యంగ్ ఇండియా'కు రూ.11వేల కోట్లు మంజూరు

- వెల్లడించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి, పొంగులేటి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రూ.11వేల కోట్ల నిధుల్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశ చరిత్రలోనే విద్యాశాఖకు ఇంత భారీ మొత్తంలో ఏకకాలంలో నిధులు కేటాయించడం తొలిసారి అని చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్‌లో ప్రపంచాన్ని శాసించే సంస్థల్లో పనిచేసే విధంగా ఎదుగుతారనీ, ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని వివరించారు. తొలి విడతలో అంతర్జాతీయ ప్రమాణాలతో 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన, సామాన్య, మధ్యతరగతి పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గతంలో ఈ పాఠశాలల నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.600 కోట్లు నిధుల్ని కేటాయించిందని గుర్తుచేశారు. ఒక్కో పాఠశాల దాదాపు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో, అద్భుతమైన క్రీడా ప్రాంగాణాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అక్కడే నివాస వసతి ఏర్పాట్లతో గృహ సముదాయాలు ఉంటాయని వివరించారు. ఆధునిక సాంకేతికతతో, అంతర్జాతీయ ప్రమాణాలతో, డిజిటల్ విద్యా బోధన చేసేలా ఈ పాఠశాలలు డిజైన్ చేయబడ్డాయని తెలిపారు. విద్యార్థులకు కావలసిన ల్యాబ్స్, లైబ్రరీ, మినీ యాంఫ్ థియేటర్ కూడా ఉంటుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వీటి నిర్మాణం, విద్యాబోధన ఉంటాయనీ, సామాజిక మార్పును తెస్తాయని విశ్వసం వ్యక్తం చేశారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు రామసహాయం, రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఖమ్మం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆగి ఉన్న ఐచర్‌ని ప్రయివేట్ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున మండలంలోని జందాపూర్ 44వ జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జందాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద 44వ జాతీయ రహదారి పైన ఆగి ఉన్న ఐచర్‌ను ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు మృతి చెందగా పదిమందికి గాయాలయ్యాయి. వారిని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మార్చి 8న హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ జాబల్‌పూర్ బయలుదేరినట్టు తెలిపారు. డ్రైవర్ ప్రదీప్ సావ్(35), చత్తీస్‌గఢ్‌కు చెందిన లచన్ సావ్(33) మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ ఫణిధర్, ఎస్ఐ ముజాహిద్, పోలీస్ బృందం ఘటనా స్థలాన్ని సందర్శించారు.

యూపీలో జర్నలిస్టు దారుణ హత్య

- అంత్యక్రియలకు కుటుంబ సభ్యుల నిరాకరణ
- హంతకులను అరెస్టు చేయాలని డిమాండ్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం జరిగింది. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు, భూమి కొనుగోళ్లలో స్టాంప్ డ్యూటీ ఎగవేత వంటి అంశాలపై వార్తలను రాస్తున్నందుకు సీతాపూర్ జిల్లాలో ఒక జర్నలిస్టును గుర్తుతెలియని వ్యక్తులు కాల్చిచంపారు. సీతాపూర్‌లో ఒక హిందీ దిన పత్రికకు జర్నలిస్టుగా పనిచేస్తున్న 35 ఏండ్ల రాఘవేంద్ర బాజ్‌పేయ్‌ను మోటార్ సైకిల్‌పై వెళుతుండగా సమీపం నుంచి తూటల వర్షం కురిపించారు. శనివారం రాత్రి ఇమాలియా సుల్తాన్‌పూర్ హైవే వద్ద ఈ ఘటన జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలికి చేరుకుని బాజ్‌పేయ్‌ను ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి శరీరంలో నాలుగు తూటాలు ఉన్నట్టు చెప్పారు. పోస్టుమార్టం తరువాత బాజ్‌పేయ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే హంతకుల్ని అరెస్టు చేసేవరకూ అంత్యక్రియలు చేయడానికి బంధువులు నిరాకరిస్తున్నారు. బాజ్‌పేయ్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. సీతాపూర్‌లోని మహోలి ప్రాంతానికి చెందిన బాజ్‌పేయ్ దాదాపు 10 ఏండ్ల నుంచి జర్నలిస్టుగా పని చేస్తున్నారు. వ్యవసాయధార కుటుంబం నుంచి వచ్చిన మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. బాజ్‌పేయ్ తల్లిదండ్రులకు కూడా అతనే ఆధారమని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బాజ్‌పేయ్ అన్నయ్య 15 ఏండ్ల క్రితం ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు. అప్పట్నించి కుటుంబంలో బాజ్‌పేయ్ ఒక్కడే సంపాదనపరుడు. స్థానిక అక్రమార్కులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నందుకే బాజ్‌పేయ్‌ను హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు, పోలీసులు బాజ్‌పేయ్ అంత్యక్రియలను నిర్వహించాలని కుటుంబసభ్యులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై హత్య అభియోగాలపై గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు లక్నో రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల ప్రశాంత్ కుమార్ తెలిపారు. అన్ని కోణాల నుంచి కేసును దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే బాధితుడి సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపారు. నివేదిక రావాల్సి ఉందని తెలిపారు. బాజ్‌పేయ్ కాల్ రికార్డులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.



కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు

- నేడు ఖతార్‌కు ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం

జెరూసలేం : గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చించడానికి సోమవారం ఖతార్‌కు ఇజ్రాయిల్ ఒక ప్రతినిధి బృందాన్ని పంపనుంది. విరమణ ఒప్పందం చర్చలను ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ బృందాన్ని పంపుతున్నట్టు తెలిపింది. రెండో దశ కాల్పుల విరమణ ఒప్పందంపై ఈజిప్టు,ఖతార్ మధ్యవర్తులు, హమాస్ మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా జరిగాయనే వార్తలు నేపథ్యంలో ఇజ్రాయిల్ నుంచి ఈ ప్రకటన వచ్చింది. 'అమెరికా మద్దతుగల మధ్యవర్తుల ఆహ్వానాన్ని అంగీకరిస్తూ తమ బృందం ఖతార్‌కు వెళ్లనుంది' అని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇతర వివరాలను వెల్లడించలేదు. అలాగే హమాస్ ప్రతినిధి అబ్దేల్ -లతీఫ్ అల్ కనౌవా కూడా ఎటువంటి వివరాలు ప్రకటించలేదు. నిజానికి కాల్పుల విరమణపై రెండవ దశ చర్చలు ఒక నెల ముందే ప్రారంభం కావాల్సి వుంది. ఇజ్రాయిల్ వైఖరి కారణంగా ఈ చర్చలు ముందుకు సాగలేదు. అయితే గత వారంలో హమాస్ వద్ద మిగిలిన ఉన్న బందీల్లో సగం మందిని విడుదల చేయాలని, దీని తరువాతపై కాల్పుల విరమణపై చర్చలు ప్రారంభిస్తామని ఇజ్రాయిల్ తెలిపింది. అంతేకాకుండా హమాస్‌పై ఒత్తిడి తీసుకుని రావడానికి గాజాకు ఎలాంటి మానవతా సాయం అందకుండా సరిహద్దులు మూసివేసింది. దీంతో ఇజ్రాయిల్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేటి నుంచి పార్లమెంటు రెండో దశ

- వక్ఫ్ సవరణ బిల్లు, బడ్జెట్ ఆమోదం అంశాలపై కేంద్రం దృష్టి
- సమావేశాల్లో గందరగోళం ఏర్పడే అవకాశం

ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ప్రతిపక్షాల వ్యూహం



న్యూఢిల్లీ : సోమవారం నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల రెండో దశ ప్రారంభం కానుంది. ఈ సమావేశంలో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య అనేక అంశాలపై వాడీవేడి చర్చలు కొనసాగే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, మణిపూర్ హింస, ట్రంప్ ప్రభుత్వంతో భారతదేశ సంబంధాలు వంటి అంశాలను లేవనెత్తాలని ప్రతిపక్షం యోచిస్తున్నట్టు సమాచారం. గ్రాంట్ డిమాండ్లకు పార్లమెంటు ఆమోదం పొందడం, బడ్జెట్ ప్రక్రియను పూర్తి చేయడం, మణిపూర్ బడ్జెట్‌కు ఆమోదం పొందడం వక్ఫ్‌సవరణ బిల్లు ఆమోదించడంపై ప్రభుత్వం దృష్టి సారించనుంది.దీనితో పాటు.. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ప్రకటించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఒక చట్టబద్ధమైన ప్రతిపాదనను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అదే సమయంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం మణిపూర్ బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టనున్నారు. ఎందుకంటే ముఖ్యమంత్రి ఎన్ బిరెన్ సింగ్ రాజీనామా తర్వాత.. ఫిబ్రవరి 13 నుంచి ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలులో ఉంది.

ప్రతిపక్షాల ఆరోపణ ఏమిటి?

డూప్లికేట్ ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్ల విషయంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం సన్నాహాలు చేస్తున్నాయి. ఇటీవల, ఈ అంశాన్ని లేవనెత్తడంలో తృణమూల్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషించింది. ఆ తర్వాత కేంద్ర ఎన్నికల సంఘం రాబోయే మూడు నెలల్లో దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే పశ్చిమ బెంగాల్‌లో ఇతర రాష్ట్రాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్ల జాబితాలను తారుమారు చేశారనే టీఎంసీ వాదనను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. కొంతమంది ఓటర్లకు ఒకే ఓటరు ఐడీ నంబర్ ఉండవచ్చు, కానీ జనాభా సమాచారం, అసెంబ్లీ నియోజకవర్గం , పోలింగ్ స్టేషన్ వంటి ఇతర వివరాలు భిన్నంగా ఉంటాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. టీఎంసీ నాయకులు సోమవారం ఎన్నికల సంఘాన్ని కలవనున్నారు. బడ్జెట్ సమావేశాల రెండవ దశలో పార్లమెంటు ఉభయ సభల్లో ఈ అంశాన్ని లేవనెత్తడానికి కాంగ్రెస్, డీఎంకే, శివసేన-యూబీటీ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలను కూడా ఏకం చేశారు.

వక్ఫ్‌సవరణ బిల్లు ఆమోదం పొందడంపై దృష్టి

వక్ఫ్‌సవరణ బిల్లును త్వరగా ఆమోదించడం మోడీ మొదటి ప్రాధాన్యతగా కనిపిస్తున్నది. ఇటీవల ముగిసిన ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ, ముస్లిం సమాజానికి చెందిన అనేక సమస్యలను పరిష్కరించే వక్ఫ్ సవరణ బిల్లును త్వరలో ఆమోదించేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. ప్రతిపక్షాల తీవ్ర వ్యతిరేకత మధ్య పార్లమెంటు సంయుక్త కమిటీ ఈ బిల్లుపై తమ నివేదికను లోక్‌సభకు సమర్పించింది.

బిల్లుకు ఇండియా బ్లాక్ నుంచి తీవ్ర ప్రతిఘటన

వక్ఫ్‌బిల్లును ఉమ్మడిగా వ్యతిరేకించడానికి ప్రతిపక్ష ఇండియా బ్లాక్ నాయకులు వ్యూహాలు చేస్తున్నారు. ఆయా ప్రతిపక్ష నేతలతో చర్చలు జరుపుతున్నారని కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్ అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాల అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతూనే ఉంటుందని, ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా జరగడం లేదని ఆయన అన్నారు.

ట్రంప్ పరస్పర సుంకం బెదిరింపులు

బడ్జెట్ సమావేశాల రెండవ దశలో ట్రంప్ పరస్పర సుంకం బెదిరింపుల అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తనున్నది. ఈ బెదిరింపులను ఎదుర్కోవడానికి ద్వైపాక్షిక సమిష్టి సంకల్పానికి పిలుపునిచ్చిందని ఆయన అన్నారు.

కాగా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి దశ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు కొనసాగింది. రెండవ దశ మార్చి 10 నుంచి (సోమవారం) ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నది.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు నిధులు ఆపడం సరిగాదు

కేంద్ర బడ్జెట్‌లో గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను పునరుద్ధరించాలి

- ఇందిరాపార్కు వద్ద ధర్నాలో పలువురు వక్తలు
- కుటుంబాలతో కదిలి వచ్చిన ఎన్ఐఆర్‌డీపీఆర్ ఉద్యోగులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర బడ్జెట్‌లో జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్) సంస్థకు నిధులు ఆపడం సరిగాదని పలువురు వక్తలు చెప్పారు. కేంద్ర బడ్జెట్ సవరణల్లో ఆ సంస్థకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సంస్థను ప్రయివేటీకరించే ఆలోచనను విడనాడాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని తప్పుబడుతూ ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద వందలాది మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహారావు మాట్లాడుతూ. .గ్రామీణాభివృద్ధిలో, జాతీయ ఉపాధి హామీ చట్టం అమలులో కీలక భూమిక పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఐఆర్‌డీపీఆర్‌కు కేంద్రం నిధులు కేటాయించకపోవడాన్ని తప్పుబట్టారు. కేంద్రం నిర్ణయం వల్ల 221 మంది రెగ్యులర్, 410 మంది కాంటాక్ట్ ఉద్యోగులు, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేసిందనీ, 300 మందికి పైగా పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు కూడా తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్న సంస్థకు నిధులు కేటాయించకపోతే దేశ ఆర్థిక ప్రగతి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దేశంలోనే కీలకమైన ఈ సంస్థ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సంస్థకు నిధులు కేటాయించకపోవడంపై పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీలు చర్చ పెట్టాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పి.కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని పంచాయతీల బలోపేతానికి కృషిచేస్తున్న ఎన్ఐఆర్‌డీపీఆర్ గురించి వివరించారు. ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు గ్రామీణాభివృద్ధి.. పంచాయతీరాజ్ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే సంస్థకు నిధులు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ఏ. ప్రసాద్ మాట్లాడుతూ.. 2025-26 కేంద్ర బడ్జెట్లో ఎన్ఐఆర్‌డిపిఆర్‌కు నిధులు కేటాయించకపోవడంతో ఆ సంస్థ భవిష్యత్తు అనిశ్చితంగా మారిందని చెప్పారు. 65 ఏండ్లుగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఈ సంస్థకు ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని గుర్తుచేశారు. అకస్మాత్తుగా నిధులు ఉపసంహరించుకోవడం వలన ఆ సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారిందని వాపోయారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అకడెమిక్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ జ్యోతిస్ సత్యపాలన్, డాక్టర్ సి. ధీరజ, డాక్టర్ రాజేష్ కుమార్ సిన్హా, డాక్టర్ సి. కాతిరేసన్, డాక్టర్ పల్లా అనురాధ, డాక్టర్ ఎం.వి. రవిబాబు, ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డి. రామకృష్ణ, ఎ. పరశురాముడు, సుశీల్ కుమార్, మహమూద్ అలీ, డి. సరోజ, పెన్షనర్ల సంఘం నాయకులు జంగయ్య, మురళి మాట్లాడుతూ..తమ సంస్థ గొప్పతనాన్ని వివరించారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం గత బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించి 73.68 కోట్లే ఖర్చుపెట్టిందని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1 లక్షకు తగ్గించడంతో అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోయారు. భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులు, పెన్షనర్లు మరియు గ్రామీణాభివృద్ధిలో పాల్గొన్న వాటాదారులలో తీవ్రమైన ఆందోళనలను రేకెత్తించిందన్నారు. 2008లో తమ సంస్థ స్వర్ణోత్సవాలను జరుపుకున్నదనీ, హైదరాబాద్‌లోని ప్రధాన క్యాంపస్‌తో పాటు అస్సాంలోని గౌహతిలో ఈశాన్య ప్రాంతీయ కేంద్రం, న్యూఢిల్లీలో ఒక శాఖ, బీహార్‌లోని వైశాలిలో కెరీర్ గైడెన్స్ సెంటర్ ఉన్నాయని చెప్పారు.తమ సంస్థకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్థన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర సాధనలో మిలియన్ మార్చ్ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నదనీ, దాని స్ఫూర్తి కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్థన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక హక్కుగా భావించిన మలిదశ ఉద్యమం విజయ తీరాలకు చేరడంలో మిలియన్ మార్చ్‌ది ప్రధాన పోరాట ఘట్టమని పేర్కొన్నారు. మిలియన్‌మార్చ్ ఆ నాటి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచిందని గుర్తుచేశారు. ఎక్కడ దోపిడీ పీడన, వివక్షత, అణచివేత, అన్యాయం, క్రూర నియంతృత్వం ఉంటుందో అక్కడ తప్పనిసరిగా ప్రజా తిరుగుబాటు ఉంటుందని మిలియన్‌మార్చ్ నిరూపించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాలుగు కోట్ల ప్రజానీకానికి అను నిత్యం అది స్ఫూర్తినిస్తుందనీ, పోరాడే ప్రజానీకానికి సదా స్మరణీయమని పేర్కొన్నారు.



లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ) డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ జనరల్ కౌన్సిల్ సమావేశాలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్.భానుకిరణ్ ప్రవేశపెట్టిన నివేదికపై 15 జిల్లాల నుంచి హాజరైన కౌన్సిల్ సభ్యులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. సమావేశంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు కనీస వేతనాలు నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెస్తున్న లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా అల్బర్ట్‌డేవిడ్, సానోఫీ, వాల్లస్ యాజమాన్యాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తీర్మానాలు ప్రవేశపెట్టారు. జనరల్ కౌన్సిల్ సభ్యులు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన కార్యదర్శి, కోశాధికారి నివేదికలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కష్టానంద్, తమిళనాడు మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వాసుదేవన్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యు.ఎస్.రవి ప్రసంగించారు. టీయంఎస్ఆర్ యు సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 'స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ'

- ఆరుగురు సభ్యులతో నియామకం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణలో పార్టీ కార్యకలాపాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు సభ్యులతో కూడిన 'స్టేట్ కో ఆర్డినేషన్ కమిటీ'ని నియమించింది. ఈ మేరకు శనివారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో సీడబ్ల్యూసీ సభ్యులు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎస్ఏ. సంపత్ కుమార్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తాహెర్ బిన్ అహ్మద్, తేజావత్ బెల్లయ్య నాయక్, వెన్నెల గద్దర్ సభ్యులుగా ఉన్నారు. వీరందరినీ 'జైబాపు... జైభీమ్... జైసంవిధాన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియమించింది.



వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తారు?

- విలేకర్ల సమావేశంలో మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వర్గీకరణ పూర్తికాకుండానే ఆగమేఘాల మీద ఉద్యోగాల భర్తీ ఎందుకు చేస్తున్నారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. గ్రూప్ 1,2 తో పాటు అనేక పోస్టులకు వారంలోనే ఫలితాలెందుకు ప్రకటించనున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

తక్షణమే ఫలితాల ప్రకటన ఆపకపోతే ఎస్సీ నిరుద్యోగుల ఆగ్రహానికి వారి రాజకీయ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి మాలల భ్రమలో ఉన్నారనీ, మాలల ఒత్తిడికి తలొగ్గి పని చేస్తున్నారని ఆరోపించారు. నేటి నుంచి వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు జిల్లాల్లో నిరవధిక దీక్షలు చేస్తామని ప్రకటించారు. వర్గీకరణకు మద్దతిచ్చే సంఘాలు.. రాజకీయ పార్టీలను కలుపుకుపోతామని తెలిపారు. అన్ని యూనివర్సిటీల్లో దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగతో పాటు ఆ సంఘం రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

ఈ ఫలితాలకు 'ఎస్సీ వర్గీకరణ' ఎలా వర్తిస్తుంది?

- మందకృష్ణకు సతీశ్ మాదిగ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గతంలో విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఇప్పుడు విడుదల చేస్తున్న ఫలితాలకు ఎస్సీ వర్గీకరణ ఎలా వర్తిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్ మాదిగ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ప్రశ్నించారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఫలితాలు ఆపి, వర్గీకరణ పూర్తయిన తర్వాతనే ఫలితాలు విడుదల చేయాలనడం సరైందికాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పునకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. వర్గీకరణ తర్వాతనే కొత్త నోటిఫికేషన్లు ఉంటాయంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించిన విషయాన్ని మరచిపోయారా? అని ప్రశ్నించారు. వర్గీకరణను అమలు చేస్తూ స్పెషల్ ఆర్డినేన్స్ తెచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని తమకు ఉన్నా...ఆర్డినెన్స్‌పై ఎవరైనా కోర్టుకు పోతే ఉద్యోగ నియామకాలు చెల్లవని తీర్పులు వస్తాయని అనుమానం వ్యక్తం చేశారు.

ఈ విధంగా చేయడం ద్వారా న్యాయ పరమైన చిక్కులతో మాదిగలకు అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పునకు ముందు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చారా? అక్కడ కమిషన్ నివేదిక వచ్చిందా? అసెంబ్లీ తీర్మానం చేసిందా? లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై లేనిపోని దుష్ప్రచారం చేస్తే మళ్లీ ప్రకాశం జిల్లాకు పంపిస్తామని మందకృష్ణను ఆయన హెచ్చరించారు.

యువ కార్మిక నాయకులు నైపుణ్యాలు పెంచుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువ కార్మిక నాయకులు తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలనీ, కార్మికుల హక్కుల పోరాటాల రూపకల్పన కోసం, సమస్యల పరిష్కారం కోసం లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యువ కార్మిక నాయకులకు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ క్లాసులు బోధించారు. ప్రారంభోత్సవం సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ..29 కేంద్ర కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తేవాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తీరును ఎండగట్టారు. మోడీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. దేశసంపదను నూతన పద్ధతుల్లో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతున్న తీరును వివరించారు. కార్మికులు పోరాడిసాధించుకున్న హక్కులను హరించి, శ్రమ దోపిడీచేస్తుందని చెప్పారు. కనీస వేతనాలు పెంచకుండా ఫ్లోర్ లేవర్ మినిమమ్ పేరుతో రోజుకు రూ.178 వేతనం నిర్ణయించడం దారుణమన్నారు. ఆ వేతనంతో బీజేపీ నేతలు బతికి చూపించాలని సవాల్ విసిరారు. మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడం కోసం దేశ వ్యాప్తంగా బలమైన కార్మికోద్యమాన్ని నిర్మించాల్సి అవసరముందని నొక్కి చెప్పారు. కార్మికవర్గ ఐక్యతను కుల, మతాల పేరుతో చీల్చుతున్న తీరును ఉదాహరణలతో వివరించారు. బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టి కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలంటే యువ నాయకత్వం దానికనుగుణంగా తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఈ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి బి.మధు ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వేలంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వండి

- సింగరేణి కార్మిక సంఘాల డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనేలా సింగరేణి కాలరీస్ యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని ఆ సంస్థకు చెందిన గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ), ప్రాతినిధ్య కార్మికసంఘం (ఐఎన్‌టీయూసీ), కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి బ్రాంచ్ అధికారుల సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించినట్టు ఆ సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారంనాడిక్కడి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు ఆ వివరాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే గనుల వేలానికి అనుమతులు ఇచ్చి ఉంటే, సింగరేణి భవిష్యత్ మరోరకంగా ఉండేదని చెప్పారు. నామినేషన్ పద్ధతిలో గనుల్ని కేటాయిస్తే సింగరేణి సంస్థ 14 శాతం రాయిల్టీ, 14 శాతం ఎలాట్‌మెంట్ చేసినందుకు, మొత్తంగా 28 శాతం పన్నుల రూపంలో కట్టాల్సి ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొంటే కేవలం 4.5 శాతం చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. కోల్ ఇండియాలో బొగ్గును తక్కువ రేటుకు అమ్ముతున్నారనీ, సింగరేణిలో ధర ఎక్కువగా ఉందన్నారు. దీనివల్ల కోల్ ఇండియా మైన్స్ నుంచి రైల్వే రవాణా పెరుగుతున్నదనీ, త్వరలోనే మూడోలైన్ నిర్మాణం కూడా దాదాపు పూర్తికావస్తుందని చెప్పారు. ఫలితంగా సింగరేణి మార్కెట్ పోతుందనీ, భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల సింగరేణిలో ఉత్పత్తిని పెంచాలనీ, దానికోసం బొగ్గుబ్లాకుల వేలంలో పాల్గొనే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర గనుల నుంచి బొగ్గును వెలికితీసే అనుమతుల్ని కేంద్ర ప్రభుత్వం సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాటో నుంచి అమెరికా నిష్క్రమించాలి

ఎలన్ మస్క్



న్యూయార్క్ : నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (ఎన్ఏటీఓ) కూటమిపై ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి నిష్క్రమించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సీనియర్ సలహాదారు మైక్ లీ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్‌కు మస్క్ మద్దతుపలికారు. వెంటనే అగ్రరాజ్యం నాటో, ఐక్యరాజ్య సమితి నుంచి నిష్క్రమించాలని కోరారు. ఐరోపా దేశాల రక్షణ కోసం యూఎస్ డబ్బులు చెల్లించడం ఏమాత్రం సమంజసమైన విషయం కాదని పేర్కొన్నారు.

ఇప్పటికే నాటో భవిష్యత్తుపై ఆ దేశాల్లో సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో మస్క్ వ్యాఖ్యలు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. గతంలో నాటో దేశాల్లో నిధుల కేటాయింపుపై ట్రంప్ మాట్లాడుతూ..కూటమిలో నిర్ణయించిన విధంగా అన్ని దేశాలు రక్షణ వ్యవస్థ బలోపేతానికి తమ జీడీపీ నుంచి తగిన మొత్తంలో నిధులు కేటాయించాలన్నారు. నాటోలోని ఇతర దేశాలు తమ వంతు నిధులను కేటాయించకపోతే తమ రక్షణ దళాలను వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు.కాగా రక్షణ వ్యయాన్ని భారీగా పెంచే ఉద్దేశంతో ఈయూ దేశాలు గత వారం బ్రస్సెల్స్‌లో అత్యవసర శిఖరాగ్ర సమావేశం నిర్వహించాయి. తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు 800 బిలియన్ యూరోల (841 బిలియన్ డాలర్ల)తో ప్రణాళిక ప్రతిపాదించాయి. రక్షణ కోసం సభ్య దేశాలకు 162.5 బిలియన్ డాలర్ల రుణాలను అందించే యూరోపియన్ కమిషన్ ప్రతిపాదనపై చర్చించాయి. తాజాగా ఉక్రెయిన్ పట్ల అమెరికా తీరు ఐరోపా దేశాల్లో ఆందోళనను రేకెత్తిస్తోంది. అసలు యూఎస్ వ్యూహం ఏమిటో ఇప్పటికీ స్పష్టంగా తెలియట్లేదని ఈయూ రక్షణ కమిషనర్ ఆండ్రియస్ కుబిలియస్ అన్నారు.

సీఎం సంతాపం

ఎస్ఎల్‌బీసీ మృతుని కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల జరుగుతున్న సహాయక చర్యల్లో గుర్తించిన మృతదేహం పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్‌మరణానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి సంతాపం తెలిపారు. అతను రాబిన్స్ ఇండియా కంపెనీ ఏరెక్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడనీ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. వైద్య పరీక్షల అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో పంజాబ్‌లోని కార్మికుడి స్వస్థలానికి మృతదేహాన్ని తరలించనున్నట్టు పేర్కొన్నారు.

ఎస్సీలను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

బీఆర్ఎస్ నేతలు రాజయ్య, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మెతుకు ఆనంద్‌తో కలిసి మాట్లాడుతూ ఎస్సీ సబ్ కేటగిరీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి దగా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణకు చట్టబద్ధత రాకముందే గ్రూప్ ఉద్యోగాలను నింపాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల ఫలితాల ప్రకటనను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా ఎదిగిన కుటుంబాలను గ్రూప్ ఏ లో పెట్టి, అట్టడుగు కులాల వారికి అన్యాయం చేశారని ఆరోపించారు. వర్గీకరణ తప్పుల తడకగా ఉందని విమర్శించారు.

కులభూషణ్ జాదవ్ కిడ్నాప్‌కి సహకరించిన వ్యక్తి హత్య

ఇస్లామాబాద్ : భారత నేవీ మాజీ అధికారి కులభూషణ్ జాదవ్ కిడ్నాప్‌కి సహకరించిన ముఫ్తీ షా మిర్ హత్యకు గురయ్యారు. బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో కొందరు దుండగులు ఆయనపై కాల్పులు జరిపినట్లు స్థానిక మీడియా ఓ ప్రకటనలో తెలిపింది. భారత నేవీ మాజీ అధికారి కులభూషణ్ జాదవ్ కిడ్నాప్‌లో పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐకి సహకరించినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కెచ్‌లోని టర్బాట్ నగరంలో శుక్రవారం రాత్రి ప్రార్థనల అనంతరం మసీదు నుండి వెళు తుండగా కెచ్‌లోని టర్బాట్ నగరంలో కొందరు దుండుగులు ముఫ్తీ షా మిర్‌ను లక్ష్యంగా చేసుకున్నట్టు పేర్కొంది.

మోటార్‌సైకిల్‌పై వచ్చిన దుండగులు ఆయనపై కాల్పులు జరిపారని, వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్టు ఆదివారం ఆ ప్రకటన తెలిపింది.

ముఫ్తీ షా మీర్ జమాయత్ ఉలేమా -ఇ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) సంస్థకి సన్నిహితంగా ఉండేవారు. గతంలో ఆయనపై జరిగిన రెండు హత్యాయత్నాలు జరిగాయి. అయితే వాటి నుంచి తప్పించుకోగలిగారు. ఖుజ్దార్‌లో ఇద్దరు జేయూఐ-ఎఫ్ నేతలను కాల్చి చంపిన కొన్ని రోజుల తర్వాత ఈ ఘటన జరిగింది.

ఉద్యోగులకిచ్చిన హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడచినప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయనందున ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, వాటి అమలుకు తక్షణం ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ గడువు ముగిసి.. 20 నెలలు పూర్తయిందని, అధికారంలోకి రాగానే ఆరు నెల్లలో పీఆర్సీని మెరుగైన ఫిట్‌మెంట్‌తో అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మొదటి తేదీనే జీతాలు చెల్లిస్తున్నప్పటికీ, పెండింగ్ బకాయిల బిల్లులు జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ సరెండర్ లీవ్ బిలులు, మెడికల్ బిల్లులు, రిటైరయిన వారి బెనిఫిట్స్ ఏండ్ల తరబడి చెల్లించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు, అసౌకర్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆరు నెలుకోసారి చెల్లించాల్సిన కరువు భత్యాలను (డీఏ) చెల్లించకపోవటం, సీపీఎస్ రద్దుకిచ్చిన హామీ అమలుకు పూనుకోకపోవడం సమంజసం కాదన్నారు. వీటిని సాధించుకోవటం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే కానీ.. ఎన్నికల్లో ప్రవేశించిన కుల, మతతత్వ ధోరణులు డబ్బు, మద్యం ప్రభావాల పట్ల అప్రమతంగా ఉండాలన్నారు.

పెండింగ్ డీఏలను ప్రకటించాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకటి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పేరుకుపోయిన వివిధ రకాల పెండింగ్ బకాయిల విషయంలో మార్చినాటికి చెల్లిస్తానని ప్రభుత్వం జేఏసీతో జరిగిన చర్చల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. మళ్లీ 16 నెలల గడువు పేరుతో కాలయాపన చేయటం సమంజసం కాదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బకాయిల విషయంలో చొరవచూపాలనీ, లేదంటే ఉద్యమానికి పూనుకుంటామని హెచ్చరించారు. ఆర్థికేతర అంశాల్లో భాగంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, ఓపీఎస్ అమలుకు చర్యలు తీసుకోవాలనీ, 2003 డీఎస్సీ వారికి కేంద్రం ఇచ్చిన మెమో 57 ప్రకారం ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ-2024 వారికి అక్టోబర్ 10 నుంచి వేతనాలు చెల్లించాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా సమయపాలనను మార్చాలన్నారు. మిగిలిన పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జంగయ్య, సిహెచ్. దుర్గాభవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు కె.సోమశేఖర్, ఎం. రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, కె.రవికుమార్, డి.సత్యానంద్, ఎ.సింహాచలం, జి.శ్రీధర్, ఎం.వెంకటప్ప, వై.జ్ఞానమంజరి, వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



కౌన్ బనేగా కెనడా ప్రధాని

రేసులో నలుగురు.. నేడే ఓటింగ్..

ఓట్టావా: అమెరికా నుంచి కెనడా టారిఫ్‌ల సవాల్ ఎదుర్కొంటున్న వేళ.. కెనడా పాలనా పగ్గాలు ఎవరు చేపట్టబోతున్నారనే విషయం ఆసక్తిగా మారింది. రేసులో మొత్తం నలుగురు ఉండగా.. వారిలో ట్రూడో వారసులు అయ్యేదెవరనే అంశం ఉత్కంఠ రేపుతోంది. నూతన ప్రధాని ఎంపిక కోసం లిబరల్ పార్టీ లో ఓటింగ్ జరగనుంది. మొత్తం 1.40 లక్షల మంది ఈ ఓటింగ్‌లో పాల్గొననున్నారు.

కెనడా ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవి నుంచి వైదొలగనున్నట్టు గత జనవరిలో ప్రకటించారు. ఈ క్రమంలో పార్టీ నూతన సారథిని ఎన్నుకునేందుకు అధికార లిబరల్ పార్టీ సిద్ధమైంది. అందుకోసం ఆదివారం ఓటింగ్ నిర్వహించనుంది. ఈ రేసులో మొత్తం నలుగురు కొనసాగుతున్నారు. వారిలో మార్క్ కార్నీ, క్రిస్టియా ఫ్రీలాండ్, కరినా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్‌లు ఉన్నారు.

ఆ నలుగురిలో మార్క్ కార్నీ, ఫ్రీలాండ్‌ల మధ్య తీవ్ర పోటీ ఉన్నప్పటికీ.. మాజీ బ్యాంకర్ అయిన కార్నీ నూతన ప్రధానిగా ఎన్నికయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ కెనడాకు గతంలో గవర్నర్‌గా పనిచేసిన మార్క్ కార్నీ.. అంతకుముందు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. ఇక ట్రూడో ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన క్రిస్టియా ఫ్రీలాండ్.. గత డిసెంబర్‌లో తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా సందర్భంగా ఫ్రీలాండ్ రాసిన లేఖ ట్రూడో రాజీనామాకు దారితీసిందనే వాదన వినిపిస్తోంది.

వ్యర్థాలు తరలించండి మహాప్రభో..



నవతెలంగాణ - చంపాపేట్

డ్రైనేజీ మరమ్మతులు నిర్వహించి.. వ్యర్థాలను తొలగించకపో వడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాకుత్‌పురా నియోజకవర్గం కుర్మగూడ డివిజన్ మాదన్నపేట్ చంద్రయన్న హాట్స్ సైదాబాద్ ధోబీ ఘాట్ కల్లు దుకాణం లైన్ వద్ద ఉన్న రోడ్డులో కొద్ది రోజుల కిందట జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు డ్రైనేజీ పూడికతీత పనులు చేపట్టారు. మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు కృషి చేశారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీల నుంచి తీసిన వ్యర్థాలను రోజుల తరబడి తొలగించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో సతమతమవుతున్నారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేసిన వారికి చలానా విధిస్తామంటున్న జీహెచ్‌ఎంసీ అధికారులు వారి తప్పిదాలను ఎలా సమర్థించుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

బొంతరాజుకు డాక్టరేట్



నవతెలంగాణ-హయత్ నగర్

అనాథ పిల్లలను చేరదీసి, వారికి ఉచిత సేవలు అందిస్తున్న బొంత రాజు సేవలను తమిళనాడుకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గుర్తించి.. అతనికి డాక్టరేట్‌ను అందజేసింది. ఇతను హయత్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. 2013 నుండి ది సుధీర్ ఫౌండేషన్ పేరిట అనాథ శరణాలయాన్ని ప్రారంభించి.. అందులో ఉన్న చిన్న పిల్లలకు ఆహారంతో పాటు వారిని ఉన్నత స్థానంలో తీర్చిదిద్దడంలో దిట్ట అని చెప్పవచ్చు. డాక్టరేట్ వచ్చిన సందర్భంగా రాజు మాట్లాడుతూ తనకు ఈ డాక్టర్ రేటుతో మరింత బాధ్యత పెరిగిందని, సేవా గుణంతో పాటు తన వద్ద చదువుకునే పిల్లలను ఉన్నత విద్యావంతులకు చేయడమే తన లక్ష్యమని అన్నారు.

వనస్థలిపురం ఫేస్-2లో గ్రౌండ్ నిర్మిస్తాం



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఫేస్-2లో గ్రౌండ్‌ను నిర్మిస్తామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఫేస్-2 లో ఉన్న గ్రౌండ్ నందు కొన్ని రోజులుగా కొందరు పార్క్, మరికొందరు ప్లే గ్రౌండ్ కావాలని అడగడం జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గ్రౌండ్ ప్రదేశంలో స్థానిక కాలనీవాసులు, యువతచే సమావేశం ఏర్పాటు చేశారు. దానిలో భాగంగా కొందరు కాలనీవాసులు గ్రౌండ్ స్థలంలో పార్క్, యువత ఏమో ప్లే గ్రౌండ్ నిర్మించాలని కోరారు. తర్వాత కాలనీవాసులు మాట్లాడుతూ పార్క్ నందు రాత్రిపూట మద్యం సేవిస్తూ.. నానా హంగామా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎక్కడెక్కడ నుండి వచ్చి ఇక్కడ క్రికెట్ ఆడుతూ పక్క ఇంటి అద్దాలు ధ్వంసం చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే కొన్ని కొన్ని సందర్భాల్లో పెద్ద,పెద్ద శబ్దాలు పెట్టి నానా హంగామా చేస్తున్నారని పేర్కొన్నారు. కావున ఈ స్థలంలో పార్క్ నిర్మించాలని కోరారు.

గ్రౌండ్ సమీపంలో దాదాపు 50 అడుగుల దూరంలో జయశంకర్ పార్క్ ఉందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. 100 అడుగుల దూరంలో పోలీస్ స్టేషన్ వెనుక పార్క్ ఉందన్నారు.150 అడుగుల దూరంలో రైతు బజార్ దగ్గర అతి పెద్ద పార్క్ కూడా ఉందని తెలిపారు. నేను గతంలోనే దూరదృష్టితో ఆలోచించి 8 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాల వయస్సు గల అందరూ ఉత్సాహంగా, ఆరోగ్యకరంగా ఉండాలని నియోజకవర్గ పరిధిలో అనేక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అలాగే నేటి యువత ఆడుకోవడానికి ప్లే గ్రౌండ్స్ ఎక్కడ లేని కారణంగా ప్లే గ్రౌండ్స్ నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. యువతకు ప్లే గ్రౌండ్స్ కావాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగడం జరుగుతుందని చెప్పారు. రాజకీయ మనుగడ కోసం కాలనీ వాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

యువత కోసం ఎట్టి పరిస్థితుల్లో ప్లే గ్రౌండ్ నిర్మిస్తామని తెలిపారు. స్థలంలో రాత్రిపూట యువత మద్యం సేవిస్తున్న విషయం ఇప్పుడే మా దృష్టికి మీరు తీసుకొని రావడం జరిగిందన్నారు. వెంటనే ఈ స్థలంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి, కనెక్షన్‌ను పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేస్తామని పేర్కొన్నారు. అలాగే క్రికెట్ బాల్ బయట పడకుండా ఉండడానికి గ్రిల్స్ ఎత్తు పెంచి, చుట్టుపక్కల జాలి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్లే గ్రౌండ్ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఇప్పటినుంచి ఈ ప్రదేశంలో ఎవరైనా మద్యం తాగితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. అలాగే మహిళల కోసం క్రికెట్ నెట్ ఏర్పాటు చేస్తామని, అలాగే కొంతమేర వాకింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మాకు ఎవరిపైన వ్యతిరేకత లేదని, అందరూ సమానంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా యువతను దృష్టిలో పెట్టుకొని ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేసి వారి భవిష్యత్ కోసం మీ యొక్క సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవి కుమార్, సంజయ్ కుమార్, శివ శంకర్, మిట్టా రామ్మోహన్, కాలనీవాసులు జగదీష్, ప్రవీణ్, అశోక్ కుమార్ గౌడ్, బీరప్ప, శోభ, అనుప్‌కుమార్, యువత తదితరులు పాల్గొన్నారు.

పన్నులు తగ్గించేందుకు ప్రయత్నం చేస్తాం

- టీయూడీఎఫ్ఐడీసీ చైర్మెన్ చల్లా నర్సింహారెడ్డి





నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికంగా ఉన్న ఇంటి పన్నులను తగ్గించేందుకు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, అసెంబ్లీలో చర్చించి.. తగ్గించేందుకు ప్రయత్నం చేస్తామని టీయూడీఎఫ్ఐడీసీ చైర్మెన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలో ఓ ఫంక్షన్ హాల్లో కాలనీల వెల్ఫర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మెన్ చల్లా నర్సింహారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇంటి పన్నులు, వ్యాపార పన్నులు ఉన్నాయని, మున్సిపల్ అధికారులు అధిక పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో అధిక పన్నులు తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, మున్సిపల్ కార్యాలయం ముట్టడి, కాలనీల్లో పాదయాత్రలు చేపట్టినట్టు గుర్తుచేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కొంత మేరకు తగ్గించారని తెలియజేశారు. మూడు నెలల ముందు మళ్లీ పన్నులు పెంచారని, దింతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేని విధంగా ఇక్కడ పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పన్నులు తగ్గించాలంటే ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తప్ప తగ్గవని, రేపటి నుండి జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో చర్చించి..తగ్గించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. సొంత గ్రామం అయినా మీర్‌పేట్, జిల్లెలగూడ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పన్నులు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వెల్ఫేయిర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, వంటేరు నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల నుండి పన్నులు తగ్గించేందుకు పోరాటం చేస్తున్నామని చెప్పారు. పక్కన ఉండే జీహెచ్‌ఎంసీలో సైతం ఇంత అధికంగా పన్నులు లేవని, కేవలం మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మాత్రమే ఎక్కువ పన్నులు ఉన్నాయని గుర్తు చేశారు. పన్నులు తగ్గించే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీల వెల్ఫేయిర్ అసోసియేషన్ సభ్యులు, వివిధ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మెట్రోలో గుండెను తరలించిన వైద్యులు



నవతెలంగాణ-హయత్‌నగర్

మెట్రోలో గుండెను తరలించి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఆదివారం ఎల్బీనగర్ కామినేని హాస్పిటల్ నుండి జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి మెట్రోలో గుండెను తరలించారు. డైలేటెడ్ కార్డియో మయోపతి సమస్యతో బాధపడుతున్న(44)వ్యక్తికి గుండె ఎమర్జెన్సీ అవ్వగా.. అందుకు మెట్రో అయితేనే త్వరగా చేరుకోగలుగుతారని భావించి, మెట్రోను ఎంచుకుని నాగోల్ మెట్రో నుండి జూబ్లీహిల్స్‌లో దిగారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

- కళ్లెం నవజీవన్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. సుప్రజా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ సిగ విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చేతుల మీదుగా ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి ఉచితంగా జనరల్ ఫిజీషియన్ ఆర్థోపెడిషన్ ఫిజియోథెరపీ గైనిక్ కార్డియాలజీ డాక్టర్ కన్సల్టెంట్స్‌తో పాటు జీఆర్‌బీఎస్, బిపి, ఈసీజీ మొదలగు పరీక్షలు నిర్వహించి..అవసరమైన వారికి సలహాలు, సూచనలు చేస్తూ ఉచితంగా మందులు ఇచ్చినట్టు తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, దానికి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ అని అన్నారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ జీఎం సిగ అజయ్ కుమార్ గౌడ్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ ప్రణయ కో ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, కార్తికేయన్, ప్రదీప్, మాచిరాజు, బీజేపీ అధ్యక్షులు గంగాని శీను, పాం డాల శ్రీధర్, శ్రీకర్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్, నాయకులు వజ్బురి వెంకటేష్, సురేష్, నరసింహా రెడ్డి, అరుణ్, బీజేవైఎం అధ్యక్షులు ఎర్ర ప్రైమ్ పాల్గొన్నారు.



అధ్వానంగా అల్మాస్‌గూడ నుండి గుర్రంగూడ ప్రధాన రహదారి

- పట్టించుకోని అధికారులు
- నవ్వారు మల్లారెడ్డి





నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ శివాలయం (శ్రీశ్రీ హోమ్స్)నుండి విశాఖ నగర్, జయ శంకర్ కాలనీ వరకు ఉన్న ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి, కాలనీ వాసులు అవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారంలో మాజీ కార్పొరేటర్ రోడ్ల అభివృద్ధి పనులను పట్టించుకోలేదని ఆరోపించారు. వాటర్ వర్క్స్ అధికారులు తాగునీటి పైప్ లైన్ కోసం రోడ్డు తవ్వేసి దాదాపు రెండు సంవత్సరాలు దాటినా రోడ్డు మరమ్మత్తులు చేయకుండా వదిలేయటంతో రోడ్డంతా గుంతలమయంగా మారిందని చెప్పారు. దీంతో వాహన దారులు, ప్రజలు, వివిధ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నవతెలంగాణ - బడంగ్‌పేట్

నేటి సమాజంలో పేదరికం నిర్మూలించాలంటే ధనవంతులు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేద ప్రజలకు దానం చేయాలని అల్ ఖురేష్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆదిల్ ఖురేషి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న వాది ఏ ముస్తఫా, షాహిన్ నగర్‌లోని పేదలకు కులమతాలకు అతీతంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనవంతులైన ముస్లింలు తమ సంపాదనలో కొంత బాగాన్ని పేదలకు దానం చేస్తే మరణానంతరం స్వర్గంలో స్థానం లభిస్తుందన్నారు. రంజాన్ మాసంలో ఒక్క రూపాయి దానం చేస్తే దెబ్బయ్ రెండు రూపాయలు దానం చేసిన పుణ్యం లభిస్తుందన్నారు. తమ సంస్థ తరఫున ఇప్పటి వరకు 850 మందికి నిత్యవసర వస్తువుల కిట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'సమాజానికి పునాది మహిళలే..'



నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్

మహిళల హక్కులు సాధించే వరకూ నిరంతర పోరాటాలు నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.సుమలత పిలుపునిచ్చారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషాధిక్యత అధికంగా ఉండే సమాజంలో రోజురోజుకూ మహిళల పై హత్యలు, అత్యాచారాలు అధికమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలే శరణ్యమని ఆమె వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మహిళలను ఓటు బ్యాంకుగా చూసే పరిస్థితి రావడం దురదృష్టకరం అని అసహనాన్ని వ్యక్తం చేశారు. మహిళలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత స్పష్టం చేస్తుందన్నారు. ఉన్నత విద్యా వైద్య రంగాల్లో మహిళలకు ఇంకా అందని ద్రాక్ష పండ్లు మాదిరిగా ఉందని అభిప్రాయపడ్డారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు, మహిళలకు పౌష్టికాహారం లేకపోవడంతో రక్తహీనతతో బాధపడుతున్నారని అన్నారు. మహిళల సంక్షేమం అంటూనే మహిళలను సంక్షోభంలోకి నెట్టుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశానికి ఎం పద్మ అధ్యక్షత వహించగా చైతన్యపురి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైతన్యపురి డివిజన్ నూతన కమిటీ అధ్యక్షురాలిగా ఆర్. సుశీల, కార్యదర్శిగా ఏం. సంతోషి, సభ్యులుగా మంగ, పుష్ప, వెంకటమ్మ, దీపిక, సునీతలను ఎన్నుకున్నారు. అనంతరం మహిళా కార్మికులకు, మహిళలకు నూతన కమిటీ అధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకులు సిఎచ్. వెంకన్న, కె. శ్రీనివాస్, సిఎచ్. మల్లేష్, కేవీపీఎస్ నాయకులు ఎం. కృష్ణ, జి. మనోహర్, గిరిజన సంఘం నేత గోపి నాయక్, సీఐటీయూ నాయకులు ఎం వీరయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

సమాజానికి మూలం మహిళలేనని, మహిళలు లేనిది సమాజమే లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ గ్రీన్ రిచ్ కాలనీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి హాజరయ్యారు. తర్వాత కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఎస్సైలను, కాలనీ మహిళలను పూల మాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు బి.ప్రియాంక, జి.శిరీష, ఎం.మౌనిక, టీవీ ఎండీ జర్నలిస్ట్ జి.శ్రావ్య, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 5వ డివిజన్ నవారు యాదిరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో మాజీ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేసి మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. మహిళలందరు పురుషులతో సమానంగా కృషి, పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులుయ



మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

- ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న నగదు, సొమ్ము పోలీసులకు అప్పగింత

నవతెలంగాణ-హయత్ నగర్

ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఓ ప్రయాణికురాలు ఆటోలో పోగొట్టుకున్న నగదు, బంగారాన్ని ఆ ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి శభాష్ అనిపించుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న ఉదయం 5:30 సమయంలో మహబూబ్‌నగర్‌కు చెందిన వీర సత్య మల్లేష్ భార్య శ్రీ సూక్ష్మలు ఆంధ్రప్రదేశ్ నుండి హయత్ నగర్‌లో బస్సు దిగి, సూర్య నగర్ లో ఉన్న స్నేహితుడు అయిన శరత్ చంద్ర ఇంటికి వెళ్లేటప్పుడు హయత్ నగర్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్ వద్ద బస్సు దిగి అక్కడి నుండి లోకల్ ఆటోలో సూర్య నగర్‌కు వెళ్లాడు. ఆటో దిగిన తర్వాత బ్యాగ్‌ను చూసుకోవడంతో హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ప్రయాణం చేసిన ఆటోను గుర్తించారు. తర్వాత ఆటో డ్రైవర్ భుఖ్య నాగేశ్వరావు దగ్గర నుండి బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు ఒక జత కమ్మలు, ఒక జత బ్లాక్ బీట్స్ చైన్, రెండు లాకెట్ చైన్లు, ఒక పాపిడి బిళ్ల,14000 నగదును బాధితులకు అప్పగించడంతో ఆటో డ్రైవర్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com

మహిళలు అన్ని రంగాల్లో చైతన్యం కావాలి

- ఆర్యవైశ్య సంఘం నాయకురాలు రెడ్డిశెట్టి రాధిక



నవతెలంగాణ - జవహర్ నగర్

మహిళలు చదువుతో పాటు అన్ని రంగాలలో చైతన్యవంతులు కావాలని ఆర్యవైశ్య సంఘం నాయకురాలు రెడ్డిశెట్టి రాధిక అన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య ఫ్రెండ్స్ ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర కాలనిలో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజిని, మమత, సంధ్య, రూప, లావణ్య, భవాని, రమ్య, రజిత, స్వరూప, రాణీ, ఉష, స్వప్న, ఉమ, నాగమణి, నీరజ, మాధవి, భారతి, సువర్ణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ -శామీర్‌పేట

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన ఆదివారం శామీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. శామీర్ పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 8గంటలకు శామీర్ పేట ఔటర్ రింగ్ రోడ్డు రోటరీ-1వద్ద శామీర్ పేట పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా అటువైపు వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం (ఏపి23యూ5899)ను ఆపి తనిఖీ చే చేశారు. ఆ వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 24టన్నుల బియ్యాన్ని గుర్తించారు. డ్రైవర్ ఎస్ కె సర్దార్ (44), క్లీనర్ చంద్రం (50) లను అదుపులోకి తీసుకుని విచారించగా నగరంలోని ఎల్ బి నగర్ (ఆటో నగర్) లో తమ వాహన యజమాని మహమ్మద్ మజార్ వద్ద నుండి బియ్యం తీసుకోని బలిజే మహేందర్ సూచనల మేరకు శశి కుమార్ (సిద్దిపేట)కు డెలివరీ చేయడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. పంచుల సమక్షంలో పోలీసులు వాహనం, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌర సరఫరా విభాగానికి అప్పగించామని ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణారెడ్డి నగర్ కాలనీకి అండగా ఉంటా



- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

నవతెలంగాణ - చర్లపల్లి

కృష్ణారెడ్డి నగర్ కాలనీకి అండగా ఉంటానని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్‌లోని కృష్ణారెడ్డి నగర్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ..కాలనీలోని పనులు చాలావరకు పూర్తి చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న యూజీడీ, సీసీ రోడ్డు పనులను ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి పనులన్నీ తమ ఆధ్వర్యంలో జరిగాయని, ఎల్లప్పుడూ కాలనీవాసులకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వెంకటేష్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ శేఖర్ నాయక్, జనరల్ సెక్రెటరీ సురేష్ నాయక్, జాయింట్ సెక్రెటరీ రమేష్ నాయక్, నరసింహ పటేల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగుల్ ముదిరాజ్, వినోద్ నాయక్, ఉమెన్ సెక్రటరీ మీనా ముదిరాజ్, మమత, ట్రెజరర్ శంకర్ నాయక్, అడ్వైజర్ సురేష్ నాయక్, రాంచందర్ యాదవ్, దశరథ్ నాయక్, విజయ్ నాయక్, సంతోష్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్ యాదవ్, హీరాలాల్ నాయక్, క్రాంతి, జై కృష్ణ, సంపత్, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారం



నవతెలంగాణ-కాప్రా

కుషాయిగూడలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్ వీ. బాల భాస్కరరావు పర్యవేక్షణలో పలు కేసులను విచారించి ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 21 బెంచీలలో 316 సివిల్ కేసులు, 1,87,812 క్రిమినల్ కేసులు, 19,996 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారం చూపినట్టు కోర్టు అధికారులు తెలిపారు. అలాగే రూ.61,31,654 పరిహారం కింద చెల్లింపబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి ఆర్ రఘునాథరెడ్డి, అదనపు న్యాయమూర్తి జే విక్రమ్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. కిరణ్ కుమార్, కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ టీ. మహేష్, పలువురు న్యాయమూర్తులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ కృష్ణనగర్ కాలనీలో స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను తెలుసుకోడానికి కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆదివారం కాలనీలో పర్యటించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించానని తెలిపారు. వాటి పరిష్కరించేందుకు ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లారెడ్డి, సెక్రటరీ దేవిరాజ్, ప్రభాకర్ రెడ్డి, కిష్టారెడ్డి, బాలరాజు, బ్రహ్మచారి, అనంతచారి, ఎం.ఎస్.ఎన్ మూర్తి, శ్రీనివాస్, అంజయ్య గౌడ్, జయమ్మ సుజాత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో ప్రతి ఆదివారం జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం ఈ ఆదివారం 145వ వారానికి చేరింది. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిరావు పూలే, డా బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, టీం సభ్యులు ఎస్.ఏ.రహీమ్, నర్సింహ్మా చారి, రవి నాయక్, చంద్రం సేటు, వెంకటయ్య నాగేష్, తదితరులు జ్ఞానమాల సమర్పించారు.

చేతివృత్తులు-చిరు వ్యాపారుల సమావేశం



నవతెలంగాణ-కాప్రా

కమలానగర్‌లోని కాపు భవనంలో ఆదివారం చేతి వృత్తులు- చిరు వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోమేపల్లి సోమయ్య స్మారక అధ్యయన సంస్థ నిర్వహించింది. ఈ సమావేశంలో వివిధ వృత్తులలో ఎదురు అవుతున్న సమస్యలు వాటిని అధిగమించడానికి చేయాల్సిన పనులపై విస్తృతంగా చర్చించారు. సమస్యల పరిష్కారం దిశగా ప్రగతిని సమీక్షించడానికి ప్రతి 3 నెలలకు ఒకసారి కలవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సామాజిక సమరసతా వేదిక అఖిల భారత నాయకులు శ్యామ్ ప్రసాద్, బీఎంఎస్ నాయకులు రవిశంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ, నాయి బ్రాహ్మణ, పద్మశాలి, మేస్త్రీ, గంగిరెద్దుల వారు, మాలదాసరి, రజక, మేదరి, స్ట్రీట్ వెండర్స్ తదితర వృత్తుల వారు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కాలనీలు బస్తీలలోని సమస్యల పరిష్కారానికి రాజీలేని కృషిని కొనసాగిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కృష్ణా రెడ్డి నగర్ (బంజారా కాలనీ) నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లకు ప్రణాళికలు సిద్ధం చేసి, అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు మహేష్ గౌడ్, జయకృష్ణ, సంపత్ కుమార్, కృష్ణారెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి సురేష్ నాయక్, ఉపాధ్యక్షుడు శంకర్ నాయక్, సిసిఎస్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, గంప కృష్ణ, సారా వినోద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్‌పై లైంగిక దాడి నిందితుడిని శిక్షించాలి



- సీఐటీయూ నాచారం ఏరియా కార్యదర్శి గణేష్

నవతెలంగాణ - చర్లపల్లి

జగిత్యాల జిల్లాలో లైంగికదాడికి గురైన ఆశా వర్కం కు న్యాయం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాచారం ఏరియా కార్యదర్శి పి.గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆశా వర్కర్ అత్యాచార ఘటన బాధితురాలకు సంఘీభావంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నాచారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. జగిత్యాల జిల్లాలో ఫిబ్రవరి 27న ఆశా వర్కర్ విధులు నిర్వహించి ఇంటికి వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను బెదిరించి, లైంగికదాడి చేశాడని వాపోయారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయకుండా నిందితుడిని అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దళిత మహిళలు, అణగారిణ ప్రజలు అంటే చిన్న చూపు చూస్తున్నారని మండిపడ్డారు. బాధితురాలికి చట్ట ప్రకారం న్యాయం చేయాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలు దళిత మహిళ 18 ఏండ్లుగా ఆశా వర్కర్‌గా సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్, నరేష్, నరసింహ, ఎల్లేష్, మల్లేష్, చిన్న, ప్రభాకర్, శ్రీనివాస్, వెంకట్, కనకయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ స్కూల్ 28వ వార్షికోత్సవ వేడుకలు

- హాజరైన సీఐ అద్దాని సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజాహరినాథ్



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని పాపారాయ విద్యానికేతన్ స్కూల్ 28వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జేకే.శైలజ హరినాథ్, మేడ్చల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణలు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 28 ఏండ్లుగా మేడ్చల్ పట్టణంలో పాపారాయ విద్యానికేతన్ ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నదన్నారు. ఈ స్కూల్‌లో చదివిన విద్యార్థులు మంచి హోదాలలో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల క్రమశిక్షణకు మారుపేరుగా పాపారాయ విద్యానికేతన్ నిలుస్తుందని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించవద్దని సూచించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శంకర్, మాజీ కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్, ఎస్సీ సెల్ ఏ బ్లాక్ అధ్యక్షులు పానుగంటి మహేష్, మండల ప్రైవేట్ స్కూల్‌లో అధ్యక్షులు పి.గిరిబాబు, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ట్రెజరర్ రమేష్, పాండు, స్కూల్ డైరెక్టర్లు రామేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, ఆంజనేయులు, రాజేందర్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ అనిత ప్రియా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మహిళ మనసే ఒక కాన్వాస్



- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320ఎ వైస్ గవర్నర్ డా.మహేంద్రకుమార్, డా.హిప్నో పద్మా కమలాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

"మహిళ మనసే ఒక కాన్వాస్" సృజనాత్మకతను ప్రతిబింబించే గొప్ప కళ అని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320ఎ వైస్ గవర్నర్ డా.మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే లక్ష్యంతో, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్‌లో 8 నుంచి 88 ఏండ్ల వయస్సు గల 108 మంది మహిళా విద్యార్థుల అత్యుత్తమ చిత్రకళా సృజనలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృజనాత్మకతకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించే ఈ కళా ప్రదర్శన, మహిళల భావోద్వేగ శక్తిని అర్థం చేసుకునే గొప్ప వేదికగా నిలవనుందని తెలిపారు. మహిళలు అనుభూతులను, సంస్కృతి, సామాజిక ఒత్తిళ్లు, వ్యక్తిగత పోరాటాలను కూడా తమ చిత్రాల్లో ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. డా. హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ...8 నుంచి 88 ఏండ్ల మహిళలు తమ కలలను, భావోద్వేగాలను రంగుల రూపంలో ప్రపంచానికి తెలియజేస్తున్నారన్నారు. "మహిళ మనసు ఒక సున్నితమైన క్యాన్వాస్ అన్నారు. ప్రతి భావోద్వేగం ఒక ప్రత్యేకమైన రంగని చెప్పారు. ఆమె జీవితంలో ఎదురయ్యే అనుభవాలు ఆమె చిత్రాలను అద్భుత కళాఖండాలుగా మార్చుతాయని తెలిపారు. మహిళల మనోభావాలను అర్థం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ప్రదర్శనకు హాజరై, రంగుల మాధ్యమంగా వ్యక్తమయ్యే భావాలను అనుభవించాలని నిర్వాహకులు కోరారు. 20మంది మహిళా కళాకారిణులకు డా.మహేంద్ర కుమార్, డా.హిప్నో పద్మా కమలాకర్, ఎస్. సి.సి సరోజా, డాన్సర్ చుడామణి, చొక్కాలు వెంకట రమణ, అకాడమీ డైరెక్టర్ సిరి, స్వామి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు.

ఎల్‌ఆర్‌ఎస్ సందేహాల కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన ఏవేని సందేహాలు సమస్యల నివృత్తి కోసం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి లే అవుట్ క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి ఈ ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అన్ని పని దినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందనీ, ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులకు సంబంధించిన విషయాలపై మార్గనిర్దేశం పొందడానికి ఈ కాల్ సెంటర్‌లోని ఫోన్ నెంబర్ 9492409781లలో సంప్రదించగలరని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు గమనించి సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - చర్లపల్లి



మహిళలు అన్ని రంగాల్లో మగవారికి దీటుగా ముందుకు సాగుతున్నారని మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నాచారం డివిజన్‌లో బీజేపీ ఉపాధ్యక్షులు లావణ్య ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ బీజేపీ మహిళా కన్వీనర్ అనితరెడ్డి అధ్యక్షతన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు ప్రకాష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అభిషేక్ గౌడ్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు నవీన్ కుమార్,

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కార్పొరేటర్ శాంతి



నవతెలంగాణ - చర్లపల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం నాచారం వీఎస్‌టీ కాలనీలోని పార్క్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పాల్గొని మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నాగారంలో మహిళా దినోత్సవం



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ 20 వార్డులో మహిళా దినోత్సవ వేడుకలు మాజీ వార్డు కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్రా సురేష్ ఆధ్వర్యంలో గోపీకృష్ణ కాలనీలో నిర్వహించారు. వార్డులోని అన్ని కాలనీల మహిళలు పాల్గొన్నారు. ఆట పాటల పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. 60ఏండ్లు దాటిన వారిని శాలువాతో సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటాం

- బీజేపీ నాయకులు శశాంక్ సింగ్



నవతెలంగాణ - జవహర్ నగర్

మన నగరాన్ని సుందరంగా ఉండడానికి ఎంతో శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతామని బీజేపీ నాయకులు శశాంక్ సింగ్ (రాహుల్) అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పుస్కరించుకొని ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లిఖిత యాదవ్, జవహర్ నగర్ కార్పొరేషన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మీ రెడ్డి, ఉపాధ్యక్షురాలు వనబోజు రాజేశ్వరి, నాయకులు భారతి, బీజేపీ నాయకులు జితేందర్, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం, రాజ్య అధికారమే లక్ష్యం

- రంగుల శంకర్ నేత
- మహా సభకు వెళ్లిన నగర వాసులు



నవతెలంగాణ - జవహర్ నగర్

జనాభాలో పద్మశాలీల వాటా, ఐక్యత, ఆత్మగౌరవం, రాజ్య అధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర సెక్రటరీ రంగుల శంకర్ నేత పిలుపునిచ్చారు. ఆదివారం జవహర్ నగర్ పద్మశాలి సంఘం, మార్కండేయ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలి సంఘం 17వ మహా సభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహా సభలకు భారీగా తరలి వెళ్లారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు ఆపండి



- ఎమ్మార్పీఎస్ కీసర మండల అధ్యక్షుడు మంచాల మహేందర్ మాదిగ

నవతెలంగాణ-కీసర

ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంతవరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు ఆపాలని ఎమ్మార్పీఎస్ కీసర మండల అధ్యక్షుడు మంచాల మహేందర్ మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పంగ విజయ్ మాదిగ సూచన మేరకు ఆదివారం కీసర మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ పూర్తిస్థాయిలో చేయకుండా గ్రూప్ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తుండటం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకొని మాదిగ ఉప కులాల జనాభా నిష్పత్తిని పరిగణలోకి తీసుకున్న తర్వాతే గ్రూప్స్ ఫలితాలు విడుదల చేయాలన్నారు. లేదంటే మాదిగల పోరాటం మరింత ఉధృతం అవుతుందని సర్కార్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో కీసర మండల ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కర్రె గణేష్, ఉపాధ్యక్షులు కంచిమీది సంతోష్, తుడుం శ్రీనివాస్, తుడుం బాల్ రాజ్, మండల మహిళ అధ్యక్షురాలు నాగయ్యపల్లి సుజాత శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము సుదర్శన్, కీసర గ్రామశాఖ ఇన్‌చార్జి శీలం మల్లేష్ , కీసర అధ్యక్షుడు కుంటోళ్ల విజయ్, రాంపల్లి గ్రామశాఖ అధ్యక్షులు బందెల పరమేష్, ప్రధాన కార్యదర్శి మంచాల నర్సింగ్ రావు, చిర్యాల్ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి నర్సింగ్ రావు , కిరణ్ , నాయకులు కట్ట శంకరయ్య, బంటు శ్రీనివాస్, పుంద్రు రాకేష్, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com



మేడ్చల్- మల్కాజిగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాదె వినోద్ కుమార్తె వివాహంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, గణేష్, కోలన్ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రజా శ్రేయస్సు కోసం పని చేస్తా



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆదివారం తన నివాసం వద్ద, చిత్తరమ్మ గుడి వద్ద నియోజకవర్గం ప్రజ లను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు ఆహ్వానాలు, వినతి పత్రాలు స్వీక రించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. నియోజక వర్గం అభివృద్ధి నా లక్ష్యం అన్నారు. నా దృష్టికి వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తానన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్ రావు అస్పత్రిలో

జర్నలిస్ట్‌లకు మెగా వైద్య శిబిరం



- జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్య రక్షణ అభినందనీయం
- ఎమ్మెల్యేలు అరికేపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు
- జర్నలిస్టుల పక్షాన కృతజ్ఞతలు తెలిపిన టీయూడబ్ల్యూజె అధ్యక్షులు విరహత్ అలీ

నవతెలంగాణ-కేపీ హెచ్‌బీ

కూకట్‌పల్లిలోని రాందేవ్ రావు ఆస్పత్రిలో విలేకరులకు వారి కుటుంబ సభ్యులకు ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పీఏసీ చైర్మెన్,శేరిలింగం పల్లి శాసనసభ్యులు అరికేపూడి గాంధీ, కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధ వరం కాంతారావు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరహత్ అలీ, జనసేన కూక ట్‌పల్లి ఇన్‌చార్జి ప్రేమాకుమార్‌లు వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ఉరు కులు పరుగులతో ఉండే జర్నలిస్టులు, వారి కుటుంబాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోని వైద్య పరీక్షలు చేయించడం అభినందనీయమన్నారు. రాందేవ్ రావు అస్పత్రి నిర్వాహకులు చేపట్టిన కార్యక్రమం ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. జర్నలిస్టులు సమాజ భద్రత కోసమే పనిచేస్తే.. వారి ఆరోగ్యాల కోసమే రాందేవ్ రావు అస్పత్రి పాటుపడు తుందన్నారు. క్యాంపులో జరుగుతున్న పరీక్షల గురించి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, సీఈఓ డాక్టర్ యోబులు వివరించారు.

ఈ సందర్భంగా వివిధ రక్త పరీక్షలు, కిడ్నీ, గుండె, లివర్, షుగర్, డైబెటిక్ నీరోపతీ, ఫుట్ హెల్త్ కేర్ పొడ యటరీ, ఎముకల సాంద్రత, కండ్ల, డెంటల్ పరీక్షలు చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 300 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించు కున్నారు.

కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చెల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కరీం, జర్నలిస్టులు నవీన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, నాగరాజు, రాహుల్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్వాసన వెదజల్లే మురుగు నీరు



- కాలువతో ఇబంది పడుతున్న స్థానిక ప్రజలు
- నాగార్జున డ్రీమ్‌ల్యాండ్ సమీపంలో కాలువ మరమ్మతులు ఎప్పుడో..

నవతెలంగాణ-దుండిగల్

దూలపల్లి కొంపల్లి ప్రధాన రోడ్డులోని నాగార్జున డ్రీమ్‌ల్యాండ్ సమీపంలో నుంచి వస్తున్న ఓపెన్ డ్రయినేజీ వ్యవస్థతో కొంపల్లి పరిసర ప్రాంతం వాసులు దుర్వాసనతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతం అయినప్పటికీ, కాలువ దుర్వా సనను వెదజల్లుతూ.. మురుగు నీరుతో పరిసర ప్రాంతాల ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. పాతికేండ్ల క్రితం మున్సిపల్ పాలకవర్గం చేసిన కవర్డ్ డ్రయినేజీ వాగ్దానాలు అమలుకు నోచుకోలేదు. ప్రజల ఇబ్బంది రీత్యా ఇప్పటికైనా కైనా మున్సిపల్ అధికారులు మురుగునీటి కాలువకు పరిష్కా రం చూపించి.. పరిసర ప్రాంతం కాలనీ ప్రజలను, వారి ఆరోగ్యాలను కాపాడవలసిందిగా నాగార్జున డ్రీమ్‌ల్యాండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-నిజాంపేట్/దుండిగల్

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయి కృష్ణయ్య కాలనీలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి శంకుస్థాపన చేశారు. గత కొంత కాలంగా కాలనీలో అంతర్గత రోడ్ల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని స్థానికులు, హనుమంత రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నిజాంపేట మున్సి పల్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. కార్పొరేషన్ ఫండ్స్ నుంచి 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె.జనార్దన్ రెడ్డి, సిద్ధనోళ్ళ సంజీవరెడ్డి, వెంకటేశ్వరరావు, జీవన్ రెడ్డి, జై.సింహా రెడ్డి, నాగేశ్వరరావు, విజయ్ తదితర కాలనీవాసులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శిగా

కె. మనోచారి ఎన్నిక



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ సీపీఐ పార్టీ కార్యాలయంలో శ్రీశ్రీ నగర్ శాఖ మహాసభ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టకు పార్టీ నిర్ణయాలకు పార్టీ కార్యక్రమాలకు కట్టుబడి పని చేయాల న్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై పేద ప్రజలను ఏకం చేసి ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు. ఈ మేరకు శ్రీశ్రీ నగర్ సీపీఐ శాఖ కార్యదర్శిగా కె.మనోచారిని పార్టీ సభ్యులు ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో కె. కృష్ణాచారి, బాలయ్య, రాములు, పెంటయ్య, చంద్రమ్మ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కమ్మరి లలితమ్మ జ్ఞాపకాలు పదిలం..



- ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మెన్, ప్రజా గాయకులు దరువు అంజన్న తల్లి కమ్మరి లలితమ్మ మృతి బాధాకరమని.. ఆమె జ్ఞాపకాలు మా మదిలో పదిలంగా ఉంటాయని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజులరామారం డివిజన్ పరిధి ద్వారకనగర్‌లోని అంజన్న నివాసం వద్ద నిర్వహించిన దశదినకర్మ కార్యక్ర మానికి ఆయనతోపాటు, పలువురు రాజకీయ, జర్నలిస్టు, కవులు కళాకారులు హాజరై చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. దరువు అంజన్న ఓదార్చారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ దరువు అంజన్నకు తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, టి.యు.డబ్ల్యు.జే (143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, నల్లగొండ గద్దర్ నరసన్న, నేర్నాల కిషోర్, తెలంగాణ విఠల్, ప్రసాద్, పాల్గొని నివాళులు అర్పించారు.

బాచుపల్లిలో స్థానికులు భారీ ర్యాలీ



నవతెలంగాణ-నిజాంపేట్

పారిశ్రామిక కాలుష్యానికి వ్యతిరేకంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని పలు కాలనీలకు చెందిన నివాసులు ఆదివారం బాచుపల్లి నిజాంపేట ప్రధా న రహదారిలో భారీ ర్యాలీని నిర్వహించారు. బాచుపల్లి పరిధిలోని బొల్లారం కాజిపల్లిలో గల పలు రసాయన పరి శ్రమలు విడుదల చేస్తున్న కారణంగా.. బాచుపల్లి పరిధిలో గాలి పూర్తిగా కాలుష్యమయమై, నివాసాలు ఉండలేని పరిస్థితి ఉత్పన్నమవుతుందని స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై కొన్ని సంవత్సరాలుగా రాజకీయ నేతలకు, అధికారులకు పలుమార్లు విన్నవించిన ఫలితం దక్కలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన ర్యాలీలో స్థానిక తనవి హిల్స్, సాయి అనురాగ్ కాలనీ, కావ్య ఏవెన్యూ నందనవనం, ఎస్‌జెబి హిల్స్ కాలనీ, శ్రీ హెరామ్స్ కాలనీల నుంచి భారీ సంఖ్యలో మహిళలు, చిన్నారులతో సహా ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో వాయు కాలుష్యా నికి వ్యతిరేకంగా మహిళలు, చిన్నారులు బ్యానర్‌లను, ఫ్ల కార్డులు చేపట్టి నినాదాలు ఇవ్వడం ఆకర్షణగా నిలిచింది.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్



- నిందితుల నుంచి 5 సెల్ ఫోన్లు, రూ.5.090 నగదు, రెండు పేకాట కార్డుల సెట్ల స్వాధీనం

నవతెలంగాణ-నిజాంపేట్

ఐదుగురు వ్యక్తులు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో బాచుపల్లి పోలీసులు ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై దాడులు నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.5.090 లు నగదును స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బాచుపల్లి పోలీసులకు నిజాంపేట ఇందిరమ్మ కాలనీ ఫేస్ టు ఇంటి నెంబర్ 23లో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిం ది. దీంతో పోలీసులు ఆ ఇంటి పై దాడులు చేసి అక్కడ మూడుముక్కల ఆట ఆడుతున్న నిజాంపేట జయభారత్ నగర్‌కు చెందిన మిస్సకోడేటి ముని, నిజాంపేట ఇందిర మ్మ కాలనీ చెందిన కోటేశ్వరరావు, నిజాంపేట ఈశ్వర విలాక్ చెందిన నరసింహమూర్తి, నిజాంపేట్‌కి చెందిన వి. శ్రీనివాస్, నిజాంపేట బాలాజీ పార్క్‌కు చెందిన పి చంద్రయ్యలు కార్డ్స్ ఆడుతున్నట్లు నిర్ధారించారు. దీంతో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో తాము పేకాట ఆడుతున్నట్లు ఒప్పుకున్నా రు. నిందితుల నుంచి 5 సెల్ ఫోన్లు, రూ.5.090 లు నగదు, రెండు పేకాట కార్డు సెట్‌లను పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. ఈ విషయమై బాచుపల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాయకుడిలా కాకుండా సేవకుడిలా పని చేస్తా

- బీఆర్ఎస్ పార్టీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్
- ఓర్పు, సహనం కలగలసిన విజనరీ లీడర్ ఎమ్మెల్యే : కాలనీ వాసులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నాయకుడిలా కాకుండా సేవకుడిలా పనిచేస్తానని, ప్రజల సంక్షేమమే తన ధ్యేయ మని బీఆర్ఎస్ విప్, స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. శనివారం సాయంత్రం గాజులరామారం డివిజన్ కమలమ్మ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "సన్మాన సభ"ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను దశలవారీగా నెరవేర్చుతూ రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్ ను తీర్చిదిద్దు తానన్నారు. గత పదేండ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామని తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసి మూడవసారి భారీ మెజార్టీతో నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు.

ఓర్పు, ఓపిక, సహనం కలగలిసిన విజనరీ లీడర్ ఎమ్మెల్యే : కాలనీవాసులు..

ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి వాగ్దానాలు చేస్తూనే ఉంటారని మొదట్లో అనుకున్నాం. కానీ తన మాటల్లో కాదు. చేత ల్లో సంక్షేమాన్ని చూపి కాలనీని ఎంతో అభివృద్ధి చేసిన విజయ నరీ లీడర్ మన ఎమ్మెల్యే అని కోనియాడారు. ఓర్పు, ఓపిక, సహనం కలగలసిన నాయకులు ఎమ్మెలే అని కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కమలమ్మ నగర్ అధ్యక్షులు రమణారెడ్డి, సంక్షేమ సంఘం సభ్యులు కోటేశ్వరరావు, సింహాచలం, ప్రసాద్ రావు, గంగిరెడ్డి, నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు విజయ్ రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగ ఎంతగానో ఉపయోగపడుతుంది..

132 - జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలోని అల్వాల్ హిల్స్ వద్ద శివశక్తి ధ్యానయోగ సెంటర్ ఆధ్వర్యంలో ఆది వారం ఏర్పాటుచేసిన "సోల్ ఫ్యూయల్" యోగ మెడిటేష న్ సెంటర్‌ను బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకా నంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. ధ్యాన శక్తి ద్వారానే మానసిక ఒత్తిడిని జయించ డంతోపాటు మనలో ఆత్మస్థైర్యం పెంపొందుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేం దర్ రెడ్డి, యోగా గురువు మల్లేష్, యోగా జడ్జి పూర్ణ, ఇంటర్నేషనల్ యోగ మాస్టర్ విజయ్ పాల్గొన్నారు.



మహాయోధుడు "సర్దార్ సర్వాయి పాపన్న"

కుత్బుల్లాపూర్ : 130 - సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్‌లో కౌండిన్య మహాముని గౌడ సంఘం ఆధ్వర్యంలో.. నూతనంగా ఏర్పాటు చేసిన "సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్" విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ విప్ కెపి.వివేకానంద్, శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామి గౌడ్, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్‌లు ము ఖ్య అతిథులుగా హాజరయ్యారు.అనంతరం "సర్దార్ సర్వా యి పాపన్న గౌడ్" విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ..... బడుగు, బల హీన వర్గాలపై జరుగుతున్న అణచివేత, దురాగతా లు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన బలహీనవర్గాల మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అంతకముందు స్థానికంగా గల రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ముఖ్య అతిథులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ అభినవ్, కార్పొరేట ర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మెన్ మన్నె రాజు, ములుగు మాజీ ఎంపీపీ అంజన్ గౌడ్, సీఐ వెంకటేశ్వర్లు, సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రన్న కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణనిజాంపేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని ఆదివారం నిజాంపేట ఇంద్రన్న కాలనీలో వేడుకలు నిర్వహించారు. పాల బిందెల సింధూరి అధ్యక్షతన వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తం గా మహిళలు పోరాటాలతో తమ హక్కులను సాధించు కున్నారని అవి కాపాడుకోవడానికి ప్రతి ఒక్క మహిళ కృషి చేయాలని అన్నారు. నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు వస్తున్నా యని వాటిని అందిపుచ్చుకోవడానికి మహిళలు కృషి చేయాలని కోరారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటాలు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్ర మంలో రాధిక, రమ, తులసి, ఆదిలక్ష్మి, అలివేలు, గంగా మణి, ఉషారాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు. మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేసి మిఠాయిలను పంచారు.

132 డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలి



- చెరుకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 జీడిమెట్ల డివిజన్ లో నెలకొన్న సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అన్నారు. ఆదివారం132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ కమిటీ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశ కార్యక్రమంలో భరత్ సింహారెడ్డి పాల్గొన్నారు. కాలనీవాసులు శానిటైజషన్, డ్రయినేజీ , పార్క్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో ఆయన పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందించి ఆయన శానిటైజషన్, డ్రయినేజీ లైన్‌లను, పార్క్ సమస్యలను వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జి.సుధాకర్ గౌడ్, కృష్ణ గౌడ్, మోహన్ రావు, సర్వేశ్వర్ రావు, వెంకట రెడ్డి, ఎం.శ్రీనివాస్, సుబ్బారావు ,రమేష్,బాల స్వామి ,జగదీష్ రావు,సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని.. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మహిళా నాయకురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో.. పారిశుద్ధ్య కార్మికులకు ఆది వారం చీరల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట బీజేపీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్, సచిన్, సతీష్, కృష్ణ, పాండు, బండారి లే అవుట్ కాలనీవాసులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | మార్చి 10, 2025 | www.navatelangana.com



కరాటే అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బెల్టులు ప్రధాన చేసిన కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ నవతెలంగాణ-అంబర్‌పేట

ఉపాధ్యాయుల రుణం తీర్చుకుంటా..

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి
- పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకుల సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించిన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటానని, అన్ని పెండింగ్ బిల్లులను ఇప్పించడంతో పాటు మంచి పీఆర్సీ ఇపిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పింగిలి శ్రీపాల్ రెడ్డి ఎన్నికయిన తర్వాత మొదటిసారి నారాయణగూడలోని పీఆర్‌టీయూ టీఎస్ సంఘం కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా ఆ సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ ప్రధానకార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల భాధ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్
ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వ భూములను అమ్మకూడదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ అధ్యక్షతన హాస్టల్ విద్యార్థులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ హాస్టల్లో నిర్వాహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు ప్రజల ఆస్తులు వీటిని ప్రజా అవసరాలకు పేదల ఇండ్లు కట్టడానికి ప్రభుత్వ ఆఫీసులకు హాస్టళ్లకు స్కూళ్లకు నిర్మాణానికి ఉపయోగించాలి అంతేగాని అమ్ముకోవడానికి కాదని ఇప్పుడు అమ్మితే భావితరాలకు ఏమి ఉండదన్నారు. మన రాష్ట్రంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 295 హాస్టలు, 320 బీసీ గురుకులాలకు ఒక్క హాస్టల్‌కు సొంత భవనం లేదన్నారు. అద్దె భవనాలకు మూడు సంవత్సరాలుగా అద్దె చెల్లించకపోవడంతో ఖాళీ చేయమని యజమాన్యం ఒత్తిడి చేస్తున్నారన్నారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ రూ.4000 కోట్లు తక్షణమే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థులకు అన్ని వస్తువులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీలా వెంకటేష్, జీలపల్లి అంజి, అనంతయ్య, నందగోపాల్, మోడీ రాందేవ్, నిఖిల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించాలి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
విద్యార్థులలో నైపుణ్యతను పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వాసుగ్రూప్ (ఫార్మా స్యూటికల్స్) అధినేతలు బెజ్గామ్ శ్రీనివాస్ బెజ్గామ్ రమేష్‌లు పిలుపునిచ్చారు. జాతీయస్థాయి విద్యార్థుల సాంకేతిక వేడుకలు సీబీఐటీ కళాశాలలో ఘనంగా జరిగాయి. వేడుకలలో భాగంగా సీబీఐటీ కళాశాలలో మెకానిక్ విభాగం మూడవ సంవత్సరం విద్యార్థులకు వాసుగ్రూప్ కొంతమేర స్పాన్సర్ చేశారు. ఈసందర్భంగా ఆ విభాగానికి చెందిన విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడుతూ.. తమ గ్రూప్ పలు స్వచ్ఛంద కార్యక్రమాలను నిర్వహిస్తుంటుందని పేర్కొన్నారు. సన్మానించిన వారిలో సీబీఐటీ మెకానిక్ విభాగం మూడవ సంవత్సవరం విద్యార్థులు బేజిని చిదానంద కృష్ణా, బండారు అర్షిత్, బెల్లం కొండ విజయ్ రామ కృష్ణార్జున్, పారుపల్లి గౌతమ్ తదితరులున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధా రాణి



నవతెలంగాణ-ముషీరాబాద్
చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లలపై జరుగుతున్న ఆకృత్యాలపై ప్రత్యేకంగా పోక్సో చట్టం ఉందని ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఇంట్లో ప్రతి అంశంపై నిర్ణయాధికారం తీసుకునే హక్కు భార్యకు కూడా ఉంటుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మహిళలు భయపడాల్సిన అవసరం లేదని, ఎన్నో రకాల చట్టాలున్నాయని, అలాంటి వాటిపై అవగాహన చేసుకొని సమాజంలో ముందుకెళ్లాలని ఆమె సూచించారు. మద్రాసు హైకోర్టు న్యాయవాది చిమ్మిరాజ్, సమావేశంలో ఐలూ జాతీయ మహిళా కన్వీనర్ సీహెచ్. శైలజ, కో కన్వీనర్ వనజ, ఐలూ రాష్ట్ర కార్యదర్శి సార్థ సారధి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధించాలి



- సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవర్దన్

నవతెలంగాణ-ముషీరాబాద్
రాయల సుభాష్ చంద్రబోస్ ఆశయాలు సాధించాలని సీపీఐ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. గోవర్దన్ అన్నారు. తన జీవితాన్ని విప్లవోద్యమ నిర్మాణానికి అంకితం చేసిన సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రాయల సుభాష్ చంద్ర బోస్ జీవితం విప్లవశ్రేణులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కామ్రేడ్ బోస్ 9వ వర్ధంతి సందర్భంగా విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం కే.గోవర్దన్ మాట్లాడుతూ నక్సల్బరి విప్లవ పోలికేకతో ఖమ్మంలో డిగ్రీ చదువుతున్న బోస్ ఆకర్షితులై ఖమ్మం ఏజెన్సీ ప్రాంతంలో విప్లవోద్యమా నిర్మాణానికి బయలు దేరారని తెలిపారు. 1972 ప్రాంతంలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డితో కలిసి అడవుల్లో ని ఆదివాసీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తుపాకీ పట్టి రహస్య జీవితం గడిపారు. ఆయన చూపిన ఆదర్శం, క్రమశిక్షణ, అంకితభావం నేటి విప్లవ కమ్యూనిస్టులందరికి శిరోదార్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యు జాతీయ నాయకులు ఝాన్సీ, ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, అనురాధ, శివబాబు, పీడీఎస్‌యు జాతీయ నాయకులు మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మంద నవీన్, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శాంతా-వసంత ట్రస్టు పురస్కారం ప్రదానోత్సవం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
స్వయంకృషితో ఉన్నత స్థానానికి చేరుకొని సాటి మానవుల శారీరక ఆరోగ్యానికి ఔషధాలను, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాహిత్యాన్ని అందిస్తున్న డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి ఆదర్శప్రాయులని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. ఆదివారం పరిషత్తు లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన శాంతా వసంతా ట్రస్టు పురస్కార ప్రదానోత్సవంలో శివారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంస్కృతిక వికాసానికి శాంతా వసంతా ట్రస్టు బహుముఖీనమైన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అభినందించారు. సంస్కృతాంధ్ర భాషా సాహిత్య రంగాలలో విశేషమైన కృషి అందించిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు మహా మహోపాధ్యాయ డాక్టర్ శలాక రఘునాథ శర్మ, డాక్టర్ వరప్రసాద రెడ్డి ఉత్తమ సాహిత్య వేత్త పురస్కారాన్ని, రచయితగా, అనేక పత్రికల నిర్వహణ ద్వారా యువతకు మార్గ దర్శకులుగా ఉన్న ఎస్వీ సురేష్, కోడూరు వెంకట రమణారెడ్డిలకు ఉత్తమ సాహిత్య సేవ పురస్కారాన్ని ప్రదానం, రూ.లక్ష నగదు, జ్ఞాపిక ప్రశంసా పత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి తల్లి నుంచి మాధవసేవా దృష్టిని, సామ్యవాద భావుకుడైన మేనమామ సేతురామిరెడ్డి నుంచి మానవ సేవానురక్తిని ఉనికి పుచ్చుకొని జీవితమంతా ఆ స్ఫూర్తిని ఆచరిస్తున్నారని ప్రశంసించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ కులపతి డాక్టర్ అనుమాండ్ల భూమయ్య సమగ్ర సాహిత్య శ్రేణిలో కొత్తగా ప్రచురించిన దశ గ్రంథ విమర్శ సంపుటిని వరప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రముఖ ప్రవచన కారుడు గంధం బసవ శంకర్‌రావు ఆ సంపుటిని పరిచయం చేశారు. సినీ విజ్ఞాన విశారద ఎస్.వి. రామారావు సారథ్యంలో గాయకుడు బాల కామేశ్వరరావు సభా కార్యక్రమానికి ముందు ఘంటసాల మధుర గీతాలను, పద్యాలను ఆలపించి ఆకట్టుకున్నారు. పురస్కార స్వీకర్తలు డాక్టర్ శలాక రఘునాథ శర్మ, ఎస్వీ సురేష్ స్పందన తెలియజేశారు. శాంతా వసంత ట్రస్టు సభ్యుడు, ప్రముఖ రచయిత ఎంబీఎస్ ప్రసాద్,ప్రస్తుత కార్యదర్శి తొడుపునూరి నవీన్,పెద్ద సంఖ్యలో కళాభిమానులు కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళా దినోత్సవానికి కన్నీటి చరిత్ర ఉంది

- శ్రామిక మహిళ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ





నవతెలంగాణ-సిటీబ్యూరో
మహిళా దినోత్సవం అంటే కేకులు కట్ చేసి సంబురాలు జరుపుకునే పండుగలా అనేక సంస్థలు, పార్టీలు మార్చాయనీ, శ్రామిక మహిళా దినోత్సవానికి కన్నీటి చరిత్ర ఉందని శ్రామిక మహిళ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రామిక మహిళలతో పిక్నిక్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ.రమ మాట్లాడుతూ అనేక దేశాల్లో మహిళలు తమ హక్కుల కోసం పోరాటం చేసిన క్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించిందన్నారు. పురుషాధిక్య సమాజంలో శ్రామిక మహిళలు అణచివేయబడుతున్న కాలంలో ఒకపక్క కార్మిక రంగంలో పోరాటాలు జరుగుతున్న క్రమంలో మహిళలు తమ కనీస హక్కులు కల్పించబడాలని పోరాటం చేసిన చరిత్ర అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఉందన్నారు. ఆనాడు గంటల తరబడి కార్ఖానాల్లో పని చేస్తున్న కార్మికులు తమకు పని గంటలు తగ్గించాలని పోరాడిన క్రమంలో మహిళా కార్మికులు తమ పిల్లల బాగోగులు చూసుకునేందుకు సైతం కనీసం పాలిచ్చే తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడానికి సైతం అవకాశం కోసం పోరాడాల్సి వచ్చిందన్నారు. అనేక దేశాల్లో ఓటు హక్కు కోసం మహిళలు పోరాడిన క్రమంలో రష్యాలో మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం మహిళలకు హక్కులు కల్పించిందనీ, ఆ తర్వాత అనేక దేశాల్లో ఏర్పడ్డ ప్రభుత్వాలు గత్యంతరం లేక మహిళా హక్కులను కల్పించాయన్నారు. ఇది అంతర్జాతీయ మహిళా దినోత్సవం చరిత్ర అనీ, ఇది పోరాటాల చరిత్ర మాత్రమే కానీ కేకులు కట్ చేసి శాలువాలు కప్పుకుని చరిత్ర కాదన్నారు. నేటికీ మహిళలు పురుషులతో సమానంగా చూడబడటం లేదన్నారు. శ్రామిక మహిళలు పురుషులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం పొందడం లేదన్నారు. భారతీయ సమాజంలో ఇంటి పని కేవలం మహిళలదే అనే రీతిలో ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలు ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏం పని చేయాలి.. అనే కట్టుబాట్లు మహిళలపై రుద్దే ప్రయత్నం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, అధ్యక్షులు కుమార స్వామి, శ్రామిక మహిళా కన్వీనర్ కిరణ్ మై, నగర నాయకులు రాములు, శ్రీనివాస్, అజయ్ బాబు, యాదమ్మ, శ్యామలీల, మల్లేష్, గీత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అపోలో హాస్పిటల్స్ 'ఎస్‌టీఏటీ-2025' సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో
అపోలో హాస్పిటల్స్ 'ఎస్‌టీఏటీ-2025'ను విజయవంతంగా నిర్వహించింది. ది హెూటల్ వెస్టిన్ మైండ్‌స్పేస్‌లో శని, ఆదివారం రెండు రోజులు స్ట్రోక్ థ్రాంబోలిసిస్, థ్రోంబెక్టమీపై సమావేశం నిర్వహించారు. అక్యూట్ స్ట్రోక్ మేనేజ్‌మెంట్, వినూత్న ఇమేజింగ్ పద్ధతులు, క్లిష్టమైన విధానపరమైన వ్యూహాల్లో అత్యాధునిక పురోగతిని చర్చించడానికి ఈ ఈవెంట్ ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ నిపుణులను సేకరించింది. ఈ సదస్సును ముఖ్య అతిథిగా డీజీపీ డాక్టర్ జితేందర్, తెలంగాణ రీజియన్ సీఈఓ వి.తేజేస్వీరావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అపోలో గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ "ప్రపంచ వ్యాప్తంగా వైకల్యం, మరణాలకు తీవ్రమైన స్ట్రోక్ ఒక ముఖ్యమైన కారణం. ఎస్‌టీఏటీ-2025 వంటి సదస్సులు విప్లవాత్మక ఆలోచనలు, సాంకేతికతలు, అనుభవాల మార్పిడిని సులభతరం చేయడం ద్వారా స్ట్రోక్ కేర్‌ను మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రోగి వేగవంతమైన, సమర్థవంతమైన, ప్రభావవంతమైన స్ట్రోక్ చికిత్సను అందుకుంటారు. మా లక్ష్యం కేవలం ప్రాణాలను కాపాడటమే కాదు.. స్ట్రోక్ బతికి ఉన్న వారి జీవిత నాణ్యతను నిర్ధారించడం" అని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ తెలంగాణ రీజియన్ సీఈఓ వి.తేజేస్వీరావు మాట్లాడుతూ "అపోలో హాస్పిటల్స్‌లో ఆవిష్కరణలు, నైపుణ్యం ద్వారా అక్యూట్ స్ట్రోక్ కేర్‌ను అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నాం. ఎస్‌టీ ఏటీ-2025 కాన్ఫరెన్స్ గ్లోబల్, నేషనల్ ఎక్స్‌పర్ట్‌ను ఒకచోట చేర్చి, స్ట్రోక్ థ్రోంబోక్టమ్, థ్రోంబోలెక్టమ్‌లో గ్రౌండ్ బ్రేకింగ్ పురోగతిని చర్చించడానికి ఒక కీలక వేదికగా పని చేస్తుంది" అని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ తెలంగాణ రీజియన్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ "స్ట్రోక్ మేనేజ్‌మెంట్‌లో సమయానుకూల జోక్యం కీలకం. ఈ కాన్ఫరెన్స్ ఈ రంగంలో అవగాహన, క్లినికల్ నైపుణ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. తాజా చికిత్సలు, సాంకేతికతలపై చర్చలను ప్రోత్సహించడం ద్వారా మేం కొత్త వాటిని సెట్ చేయడానికి ప్రయత్నిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బారెడ్డి, అపోలో హాస్పిటల్స్ అసోసియేట్ డీఎంఎస్, డాక్టర్ అలోక్ రంజన్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, అపోలో హాస్పిటల్స్ కన్సల్టెంట్ కుమార్, డాక్టర్ సుధీరుల్ట్ కుమార్, ప్రఖ్యాత అంతర్జాతీయ వైద్య నిపుణులు డాక్టర్ మారియోస్ సైకోగియోస్, బాసెల్, స్విట్జర్లాండ్, డాక్టర్ మార్క్ రిబో, బార్సిలోనా, స్పెయిన్, డాక్టర్ నబీల్ హెరియల్, అల్బానీ, వైఎస్, యూఎస్ఏ, డాక్టర్ రీడ్ గూచ్, ఫిలడెల్ఫియా, యూఎస్ఏ, డా.ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

20న రవాణా రంగ కార్మికుల నిరసన దినాన్ని పాటించండి

- ఎఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ (సీఐటీయు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్



నవతెలంగాణ-ముషీరాబాద్
కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌ఫోర్టు రంగంలో దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న విధానాలను పట్ల నిరసన తెలియజేస్తూ మార్చి 20న దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగ కార్మికులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కే.అజయ్ బాబు అధ్యక్షతన రాంనగర్ ఆటో స్టాండ్‌లో గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆటో, ట్రాలీ స్టాండ్స్‌లలో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పి. శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోటార్ వెహికల్ యాక్ట్‌లో సవరణలో తీసుకోవడం ద్వారా అగ్రిగేటర్ పేరుతో ప్రయివేట్ యాజమాన్యాలకు రవాణారంగాన్ని అప్పగించారని, దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులాగా నిత్యం ఒత్తిడితో బ్రతికే డ్రైవర్ల జీవితాలకు భద్రతను కల్పించే చర్యలు కేంద్ర ప్రభుత్వం ఒకటి తీసుకోలేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా రవాణా రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని దాని ద్వారా వెల్ఫేర్ స్కీమ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 24న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఏఐఆర్‌టీ డబ్ల్యూఎఫ్ నిర్వహిస్తుందని, 20న దేశవ్యాప్తంగా రవాణా రంగా కార్మికుల నిరసన దినాన్ని పాటించాలని ఆల్ ఇండియా కమిటీ పిలుపునిచ్చిందని రాష్ట్రంలో ప్రతి ఒక్క రవాణా రంగా కార్మికులు వద్దకు తీసుకెళ్లే పద్ధతుల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నగర నాయకులు టి.మహేందర్ ఏఐ ఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకులు దత్, నర్సింగు, వెంకటేష్, శివ, షబ్బీర్, కన్నా, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
గన్ ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్ భీష్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు లైబ్రరీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అపోలో హాస్పిటల్ డాక్టర్ సౌమ్య, నారాయణ సేవా సమితి నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అలక చౌదరి, బీజేపీ సీనియర్ లీడర్ అరుణ జ్యోతి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కిల్ ఇండియా డెవలప్మెంట్ ఉచిత బ్యూటిషన్ ట్రైనింగ్ కోర్స్ గౌలిగూడ, పూల్ బాగ్ బస్తీల్లో నిర్వహించి అందులో పాల్గొన్న మహిళలకు వారు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావ్య, నిత్య స్వప్న, గీత,రాజలక్ష్మి, రేఖ, పూజ, మౌనిక, లలిత, శోభ,లక్ష్మి, జ్యోతి, త్రిజ, కేశవి, శిరీష, శ్రీలత, మాయ డివిజన్ కార్యకర్తలు డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



ధూల్‌పేట్‌లో..



సుల్తాన్‌బజార్‌లో

నవతెలంగాణ-ధూల్‌పేట్
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్వాన్ గుడి మల్కపుర్ లో కేక్ సీపీఐ (ఎం) నాయకులతో కలిసి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేష్, కళ్యాణ్, మహిళా నాయకులు లక్ష్మీదేవి, చెన్నమ్మ, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, మోహిని, జ్యోతి, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో మహిళా దినోత్సవం..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ పాల్గొని మహిళ ఉద్యోగుల ందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ సాధన, డాక్టర్ శృతి, వైద్యులు, నర్సింగ్ సూపరిడెంట్ శమంతకమణి, షాహిదా, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేటలో

నవతెలంగాణ-అంబర్‌పేట
అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట మహిళా పోలీస్ అధికారులను హరితసేన ఆధ్వర్యంలో వారిని సన్మానించి మొక్కలు నాటించి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరితసేన అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షులు నిరంజన్ పూలే కందిమల్ల కృష్ణ, కొండూరు చక్రపాణి, గాజుల గోపాల్, మహేష్, శ్రీకాంత్ తదితరులు న్నారు.

'విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్ నగర్ లోని రాజ్ బహదూర్ హాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. సమాజం ముందుకు వెళ్లాలంటే విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ, విద్యా రంగంలో చివరి స్థానంలో ఉందన్నారు. ప్రజా పాలకులమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గత పాలకుల మాదిరిగా విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను నిలిపివేసి, మౌళిక సౌకర్యాలు పెంపొందించాలన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రానున్న బడ్జెట్ లో విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించి, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి మాట్లాడుతూ తెలంగాణలో నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు.ఎస్‌టీయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించి, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సరిచేయకుండా ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, పీడీఎస్‌యు (జార్జిరెడ్డి) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్ రావు, పీడీఎస్‌యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి విజయ్ కన్నా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు గ్యార నరేష్, రఘురామ్, రెహమాన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజినీకాంత్, ఎస్ టియు నాయకులు శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశీవర్ధన్ రెడ్డి, ఎండీ అన్వర్, రాష్ట్ర నాయకులు హరీష్, అరుణ్, శ్రావణి, వెంకటేష్, అశ్విన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్
రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌ల మీదనే జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 272వ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సేవాసభ్యులు ఆంజనేయులు పాల్గొన్నారు.

నాగారంలో చోరీ

● బంగారం, వెండి ఆభరణాలు నగదు చోరీ చేసిన దొంగలు

నవతెలంగాణ-కీసర

నాగారంలో ఓ ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళం పగలగొట్టి బంగారం , వెండి ఆభరణాలు నగదు ను దొంగలు దోచుకెళ్లిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగారం ఓల్డ్ విలేజ్ లో నివాసముంటున్న ప్రదీప్ కుమార్ శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బీబీనగర్ పడమటి సోమరం శివాలయం దేవాలయానికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన అతనికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటం చూసి కీసర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి లోపటికి వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో ఉన్న 16 తులాల బంగారం, 45 తులాల వెండి వస్తువులు, సుమారు 20000 రూపాయల నగదు కనిపించట్లేదు. బాధితులు కీసర పోలీస్‌లకు సమాచారం అందించడంతో కీసర సీఐ శ్రీనివాస్



సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా దినోత్సవ వేడుకల్లో అసఫ్ జాహి రాజవంశం



● 9వ నిజాం హైనెస్ రౌనఖ్ యార్ ఖాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హెూటల్‌లో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు అసఫ్ జాహి రాజవంశం 9వ నిజాం రౌనఖ్ యార్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముఖ్య అతిథిగా హాజరైన నవాబ్ రౌనఖ్ యార్ ఖాన్ భారతదేశంలో లింగ తటస్థత ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. పక్షపాతం లేని మెరిటోక్రటిక్ సమాజాన్ని ప్రోత్సహించడంలో సుప్రీంకోర్టు పాత్రను నొక్కి చెప్పారు. ఈ వేడుకలో మహిళలకు అవార్డులు ప్రధానం చేయడంతోపాటు కళాత్మక ప్రతిభను ప్రదర్శించే పేయింటింగ్ ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవాబ్ రౌనక్ యార్ ఖాన్ హైదరాబాద్ మొదటి నిజాం ఖమ్రుద్దీన్ గురించి అంతర్దృష్టులను పంచుకున్నాడు. తన మనవరాలు ఖైరున్నీసా కుమారుడు ముజఫర్‌ను తన వారసుడిగా పేరు పెట్టాలనే ముఖ్యమైన చారిత్రక నిర్ణయాన్ని గుర్తించాడు. ఆరుగురు కుమారులు ఉన్నప్పటికీ ఈ గౌరవం లభించింది. ఇది లింగం కంటే యోగ్యతకు నిబద్ధతను నొక్కి చెబుతుంది. "నేడు మహిళలు గాజు పైకప్పు పరిమితులు లేకుండా వారి సామర్థ్యాలు, పురోగతి ఏ రంగంలోనైనా అర్హత సాధించే అవకాశం ఉంది" అని నవాబ్ రౌనక్ పేర్కొన్నాడు, హాజరైన వారు తమ సామర్థ్యాన్ని స్వీకరించి గొప్పతనం కోసం కృషి చేయాలని ప్రోత్సహించాడు. సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అనిత, నవాబ్ రౌనక్ పట్ల తన కతజ్ఞతలు తెలుపుతూ, మహిళా కేంద్రీకత ధార్మిక కార్యక్రమాలకు ఆయనను కీలకమైన వ్యక్తిగా పేర్కొన్నారు. జీవితంలోని ప్రతి అంశంలోనూ మహిళలకు సాధికారత కల్పించడంలో ఫౌండేషన్ నిబద్ధతను నొక్కి చెబుతూ, ప్రపంచ వ్యాప్తం గా ఉన్న మహిళలందరికీ "మహిళా దినోత్సవ శుభాకాంక్షలు" తెలుపుతూ ఆమె హదయపూర్వక సందేశాన్ని అందించారు. ప్రముఖ సినీ కళాకారులు పూనమ్ కౌర్, సుమన్, నటుడు కృష్ణం రాజు భార్య శ్యామల, ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, వెనుకబడిన తరగతుల విభాగం నుంచి ప్రభుత్వ ప్రతినిధులున్నారు.

11 వ తేదీన
ప్రముఖ కవి రసమయి రాము జన్మ దిన వేడుక

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 11 వ తేదీన ప్రముఖ కవి రసమయి సంస్థ నిర్వాహకుడు డాక్టర్ ఎం. కె.రాము జన్మ దిన వేడుకలు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వాహకుడు జె నరసింహా రావు తెలిపారు. ముఖ్య అతిథిగా హై కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ పాల్గొనగా ఆదాయ పన్నుల శాఖ విశ్రాంత ప్రధాన కమిషనర్ నరసింహప్ప అధ్యక్షత వహిస్తారు. కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి నేటి నిజం పత్రిక సంపాదకుడు బైస దేవదాసు లలిత సంగీత స్వర కర్త పివి సాయి బాబా తదితరులు అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా లిటిల్ మ్యూజిక్ అకాడెమీ విద్యార్థులు రామాచారి నిర్వహణలో డాక్టర్ రాము రచించిన గీతాలు ఆలపిస్తారు. డాక్టర్ రాము ఐదు దశాబ్దాలు పైగా రసమయి సంస్థ ద్వారా ఎన్నో సాహిత్య సాంస్కతిక కార్యక్రమాలు చేపట్టారు. నాడు ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు రసమయి నిర్వహించే కార్యక్రమాలకు 25 సార్లు పాల్గొనటం మరే సంస్థకు దక్కని గౌరవం రసమయి వేదిక పై సహితీ సంగీత మహామహులు కరుణశ్రీ కొసరాజు వేటూరి కొండవీటి వెంకటకవి సాలూరి రాజేశ్వరరావు వంటి వారు ఎన్‌టీఆర్ నుంచి సత్కారాలు అందుకున్నారు. డాక్టర్ రాము బాల భవన్ సంచాలకునిగా బాలలను నత్యం సంగీతం తదితర అంశాలులో ప్రోత్సహించి వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి బాల శ్రీ అవార్డులు పొందేందుకు కృషి చేశారు. డాక్టర్ నారాయణ రెడ్డి గీతాల పై పరిశోధన చేసి సినారె గీతాలు లయత్మకత అంశం పై డాక్టరేట్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974-75బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు పాల్గొన్నారు. నాటి హెచ్‌ఎం, లింగారెడ్డి, మల్లారెడ్డి, ఉపాధ్యాయలు ప్రభాకర్ రెడ్డి యాదగిరిస్వామి హాజరు అయ్యారు. వారు విద్యార్థులతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నాటి విద్యార్థులు 50 ఏండ్ల తరువాత కలుసుకోవడం అపూర్వ ఘట్టామని తెలిపారు. 62 మందిలో 39 మంది పాల్గొనగా 16మంది పూర్వ విద్యార్థులు చనిపోయారని తెలిపారు. ఈ బ్యాచ్ వారు డాక్టర్లు, లాయర్లు, వివిధ హెూదాల్లో ఉన్నారని తెలిపారు. హెచ్‌ఎం పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. హెచ్‌ఎంను అందజేసి శాలువా కప్పి సన్మానించి శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అభివృద్ధికి తమవంతు సహాయంగా ఒక లక్ష రూపా యల చెక్కును ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డికి అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేవరకు
గ్రూప్ ఫలితాలు నిలిపివేయాలి

● ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ

నవతెలంగాణ-నవాబుపేట్

ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేవరకు గ్రూప్ ఇతర ఫలితాలు నిలిపివేయాలని ఈనెల పదో తేదీనుంచి పోరాటాన్ని ఉధృతం చేయాలని ఆదివారం నవాబ్ పేట్ మండల ఇన్చార్జి చిట్టిగిద్ద కిష్టయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నవాబుపేట్ విలేకరులతో మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణకు చట్టబద్ధత రాకముందే గ్రూప్.. 1,. గ్రూప్..2..గ్రూప్...3 డబ్ల్యూ హెచ్ ఓ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్స్ ఉద్యోగ ఫలితాలు విడుదల చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న త్రిపుర అన్యాయమైన చర్య అని ఆయన విమర్శించారు. దీని ద్వారా మాదిగలు మరియు ఉప కులాలకు అలాగే వర్గీకరణ కోరుతున్న అన్ని కులాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగ నియామకాలకు చేపట్టడం దారుణం ఆయన ఆగ్రహారం వ్యక్తం చేశారు. ఉద్యోగ నియమాకాల ఫలితాలు వెంటనే చేయాలి ఎస్సీ వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చట్టబద్ధత కల్పించేంతవరకు ఉద్యోగ నియామకాల ఫలితాలను నిలిపివేయాలని డిమాండు చేస్తూ ఈనెల పదో నుండి ఎమ్మార్పీఎస్.. ఏం ఎస్ పి మరియు అన్ని అనుబంధ సంఘాల అధ్వారంలో అన్ని జిల్లా మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడుతామని నవాబుపేట్ మండల ఇన్చార్జి చిట్టి గిద్ద కిష్టయ్య మాదిగ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని దేశం గర్వించేలా ఎదగాలి

ఆదిబట్ల మున్సిపల్ మాజీ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిబట్ల

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాణించి, దేశం గర్వించేలా ఎదగాలని ఆది బట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరి ధిలోని ఆదిబట్ల గ్రామంలో పల్లె గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో సుదర్శన్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆదిబట్ల క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ ఎనిమిది ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆదిబట్ల ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవదాలు తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగపరుచుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెఫ్రాలజీ, యూరాలజీ పట్ల నిర్లక్ష్యం చేయొద్దు



● ప్రత్యేకంగా కిమ్స్ కడల్స్‌లో బెడ్ వెట్టింగ్ క్లినిక్
● పిల్లల్లో కిడ్నీ, యూరాలజీ సమస్యలపై సుదీర్ఘ చర్చ
● కిమ్స్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ నెఫ్రాలజీపై సీఎంఈ
● మూడు రాష్ట్రాల నుంచి 250 మంది వైద్యుల హాజరు

నవతెలంగాణ-సిటీబ్యూరో

చిన్న పిల్లల్లో వచ్చే నెఫ్రాలజీ, యూరాలజీ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదనీ, ఏమాత్రం లక్షణాలు కనిపించినా తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తమై వైద్యులకు చూపిస్తే వాటిని చాలా వరకు నయం చేయొచ్చని వైద్య నిపుణులు తెలిపారు. ఐదేండ్లు దాటినా పక్కతడిపే అలవాటు చాలా మంది పిల్లలకు ఉంటుందనీ, దాని గురించి బయటకు చెప్పడానికి సిగ్గుపడి చెప్పకపోవడం వల్ల ఆ సమస్య పెద్దయినా అలాగే ఉంటుందనీ, అలాంటి సమస్యల పరిష్కారానికి కిమ్స్ కడల్స్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం బెడ్ వెట్టింగ్ క్లినిక్ పని చేస్తుందని చెప్పారు. కిమ్స్ కడల్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మౌనిక మోటమర్రి ఆధ్వర్యంలో ఆదివారం నెఫ్రో-యూరో సమిట్-2025 పేరుతో కంటిన్యువ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో పీడియాట్రిక్ నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాల వైద్యులు దాదాపు 250 మంది వరకు హాజరయ్యారు. ప్రధానంగా చిన్న పిల్లలకు కూడా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయని, వాళ్లు నొప్పి అని చెప్పినప్పుడు, మూత్రంలో రక్తం చారికలు కనిపించినప్పుడు వెంటనే యూరాలజిస్టులకు చూపించాలనీ, అలాగే వదిలేస్తే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంటుందని వైద్యనిపుణులు చెప్పారు. పిల్లల్లో కొందరికి మూత్రం ఎర్రగా వస్తుందనీ, దానికి కారణాలేంటో కొన్ని పరీక్షల ద్వారా తెలుస్తుందని వివరించారు. పిల్లల శరీర బరువులో ఒక కేజీకి 2 మిల్లీ గ్రాముల కంటే ఎక్కువగా ప్రోటీన్ ఉంటే కూడా జాగ్రత్త పడాలనీ, పిల్లల వైద్యులు ఈ విషయంలో కీలకపాత్ర పోషించాలని చెప్పారు. కొందరికి చిన్నతనంలోనే హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) ఉంటుందనీ, దాన్ని పట్టించుకోకపోతే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కొందరు పిల్లల్లో మూత్రనాళాలు చిన్నగా ఉండటం వల్ల సమస్య తలెత్తుతుందనీ, దానికి శస్త్రచికిత్స ద్వారా మంచి పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎంఈ సందర్భంగా కిమ్స్ సికింద్రాబాద్, కొండాపూర్ ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం బెడ్ వెట్టింగ్ క్లినిక్ నిర్వహించనున్నట్టు డాక్టర్ మౌనిక తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఎస్.మదార్కర్, డాక్టర్ యోగ నాగేందర్, డాక్టర్ పరాగ్ డెకాటే, డాక్టర్ అపర్ణ సి.డాక్టర్ వి.ఎస్ రెడ్డి, డాక్టర్ నితిన్ చావ్లా, తదితరులు పాల్గొన్నారు.

సున్నితత్వం మానవత్వం నిండిన 'మధు కవనం'



● ఆచార్య కాశీం

నవతెలంగాణ-కల్చరల్

మధువనం కవితా సంపుటిలో సున్నితత్వం మానవత్వం పరిమళించే కవితలు వున్నాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కాశీమ్ అన్నారు. మృదుల రచించిన మధుకవనం కవితా సంపుటి ఆవిష్కరణ సభ త్యాగరాయ గానసభలోని కళా మారుతి కళా వేదిక పై జరిగింది ముఖ్య అతిథిగా ఆచార్య కాసీమ్ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వం రాసే ప్రతి కవీ కవిత్వం గురించి అమ్మ నాన్న గురించి తప్పక రాస్తారు. అని అలాగే మృదుల గొప్పగా భావవ్యక్తీకరణ చేశారు అని ప్రశంసించారు. ప్రేమ ప్రకతి వ్యాఖ్యానించటం కవిత్వం అని మృదుల కవిత్వం అంతా అదేనని అన్నారు. స్త్రీలకు పరిశీలన శక్తి ఎక్కువ అని మృదులలో అట్టి ప్రతిభ వుందని అభినందించారు. ఐతే నేడు అసమ్మతి ప్రకటిస్తేనే నేరంగా భావించే సందర్భంలో మృదుల వాస్తవ పరిస్థితి పరిశీలన చేసి రాబోయే రోజుల్లో సామాజిక దృక్పథంతో రాయాలని కోరారు. అధ్యక్షత వహించిన ఆచార్య మొహమ్మద్ సలీం మాట్లాడుతూ వున్నత విద్యావంతురాలిగా మృదుల తన శిష్య బృందంకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. సంపుటిని సమీక్ష చేసిన సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ నల్గొండ మట్టిలోనే కవిత్వం వుందని అన్నారు. మృదుల నల్గొండ నెలలో పుట్టినందున ఆత్మ గౌరవ ప్రతీకలుగా కవితలు వున్నాయని అభివర్ణించారు. రాజ్యాంగ నైతిక అవగాహన వున్నందున సర్వ మత సమాన భావన ఆమె కవితలో వుందని చెప్పారు. కీలకో పన్యాసం చేసిన డాక్టర్ కె. కృష్ణ మూర్తి మాట్లాడుతూ సమాజ హితం సాహిత్య లక్ష్యం ఇనా నియమిత నిబంధనలు వుండవని అన్నారు కవి ఆలోచనలు అక్షర రూపం దాల్చి నప్పుడు అత్యుత్తమ సంస్కారం వ్యక్తీకరణ కావాలని అన్నారు. మృదుల కవిత్వం అదే దిశగా సాగింది అని తెలిపారు. సంఘాన్ని ప్రశ్నించే తత్వం లోతైన అధ్యయనం వాస్తవిక దృష్టితో మదుల కవిత్వ రచన చేసారు అని వివరించారు. డాక్టర్ త్రిపురం భాస్కర్ రెడ్డి, డాక్టర్ జయ ప్రకాష్ అసిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని నియమించాలి

● పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి
● నిర్మాణ రంగా కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మహిపాల్

నవతెలంగాణ-మర్పల్లి

కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని, పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని నిర్మాణ రంగా కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మహిపాల్ డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 20 లక్షల మంది బిల్డింగ్ నిర్మాణ రంగ కార్మికులకు వెంటనే రెన్యువల్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పెండ్లి ఖర్చుల డబ్బులు రూ.లక్ష 50వేలు, డెలివరీకి రూ.లక్ష, సాదరణమరణంకు 5లక్షలు, ప్రమాదవశాత్తూ చనిపోయిన వారికి 10లక్షలు చొప్పున దరఖాస్తుదారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. వయసు పైబడిన వారికి ఫించన్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. మర్పల్లి మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం కార్మిక నాయకులు పద్మారావు అధ్యక్షతన బిల్డింగ్, కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రామ్మోహన్, మహిపాల్ హాజరై మాట్లాడారు.. బిల్డింగ్ నిర్మాణ రంగ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఉన్న బెనిఫిట్స్ అందించడంలో గత పాలకులు పూర్తిగా పట్టించుకోలేదన్నారు. కొత్త ప్రభుత్వ పాలకులు వచ్చి ఏడాదిపైగా అవుతున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిని నియమించలేదని అన్నారు. వెంటనే మంత్రిని నియమించి, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. 50 కార్మిక కార్డులు ఉన్న ప్రతి గ్రామంలో ఏఎల్‌ఓ లేబర్ అధికారులు గ్రామాల్లో సందర్శించి పెండింగ్ కార్డులు వేలిముద్రలు పెట్టించాలని డిమాండ్ చేశారు. బిల్డింగ్ రంగంలో ఉన్న 54 రకాల కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఎనిమిది నెలలుగా ఆన్‌లైన్ సిస్టం ఆగిపోయిందని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్మికులందరికీ ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించి, పెండింగ్ లేబర్ కార్డులు రెన్యూవలః చేయాలని, లేదంటే జిల్లా లేబర్ ఆఫీసు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు మర్పల్లి ఆనందం, ఉపాధ్యక్షులు పద్మారావు, విజయలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, సుభాస్‌చందర్, ప్రధాన కార్యదర్శి మాసయ్య, సహాయ కార్యదర్శిలు సంకు శంకర్, సంజీవ్, జయసింగ్ సుధాకర్, మల్కయ్య, బాబు, కష్మి బాయ్, నర్సింలు, లక్ష్మయ్య, జనార్ధన్, మోహన్, బాబు గోపాల్, వివిధ గ్రామాల బిల్డింగ్ నిర్మాణ రంగ కార్మికులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులు ఐక్యతకు దోహదం



కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హిందూ ముస్లింల ఐక్యతకు ఇఫ్తార్ విందులు దోహదమని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శనివారం సాయంత్రం డివిజన్ మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఆజం ఆధ్వ ర్యంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరై ప్రార్థనలు చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని తెలిపారు. డివిజన్‌లోని మైనార్టీల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు దర్గా, ఈద్గిల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్, మైనార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, నవాబు పాషా, రాయి రాజేష్, గూడ సంతోష్, మహమూద్, హాజీ, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జనాభాలో కురుమ రాజకీయ వాటా ఎంతో తేల్చండి



- కురుమ సంఘుల జేఏసీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్ర జనాభాలో కురుమల రాజకీయవాటాని తేల్చాలి అంటూ ప్రభుత్వాన్ని కురుమ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘల జెయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ముత్త సంపత్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముత్త సంపత్ టీఎస్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి, కురుమ హక్కుల వేదిక అధ్యక్షుడు కోశిక శ్రీనివాసరావు, మాజీ ప్రధాన కార్యదర్శి రమేష్, బీసీ సంఘం శ్యాం కురుమలతో కలిసి మాట్లాడారు.. రాష్ట్ర జనాభాలో కురుమల వాటా రాజకీయ ప్రాతినిత్యం తేలే వరకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుమలకు అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పించాలన్నారు. విద్యావంతులకు యువకులకు సామాజిక స్పృహ ఉన్న సేవా దృక్పథం ఉన్న యువతను ప్రోత్సహించి రాజకీయ నాయకులుగా అవకాశాలు కల్పించవలసినటువంటి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన అన్ని ప్రధాన పార్టీల పైన ఉందని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నికల్లో యువతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం జనాభా లెక్కలను ప్రకటించకుండా తమకున్న ఏకైక శాసనసభ్యులు మంత్రి పదవి ఇవ్వకుండా చైర్మెన్ పదవులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తే త్వరలోనే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలకు సంబంధించినటువంటి కురుమ సంఘం నాయకులు రమేష్, ఉప్పల్ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి పర్వతాలు, గొర్ల కాపరుల సంఘం బాపు మాల్ శెట్టి, రాంగోపాల్ దొడ్డు కొమురయ్య మనవడు చంద్రం, గణం నరసింహ, వంశీ, ఎమ్మే మహేందర్, గురునాథ్, శ్రీనాథ్ వివిధ జిల్లాల నుంచి అనేకమంది కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండాలి



- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్/అమీర్‌పేట్

కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బాజీబాబాకు సూచించారు. అమీర్‌పేట్‌లోని బుద్ధా నగర్ కాలనీకి నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బాజీబాబా, కాలనీ వాసులతో కలిసి ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాజీబాబాకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీలోని సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా, త్వరలోనే బుద్దానగర్‌లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కాలనీ వాసులు వినోద్, శ్రీను, భిక్షపతి, జహంగీర్, సుమన్, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట డివిజన్‌లో 'బస్తీ బాట'




నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ నియోజక వర్గం, అడ్డగుట్ట డివిజన్ పరిధిలో గల కట్టెల మండి, ఇందిరా నగర్ డీ కాలనీ, ఇందిరా నగర్ సీ కాలనీ, శేష పహాడ్ ఏరియాలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ 'బస్తీ బాట' కార్యక్రమన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమములో డ్రయినేజీ, మంచినీటి, బోర్, ఎలక్ట్రిసిటీ, రోడ్ల సమస్యలు బస్తీ ప్రజలు ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. గత పదేండ్ల నుంచి స్థానిక ఎమ్మెల్యేగాని, కార్పొరేటర్‌గాని తమ సమస్యలు పట్టించుకోలేదని ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యలు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని బస్తీ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదం భరత్ కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్, తార్నాక డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ గౌడ్, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, తార్నాక డివిజన్ అధ్యక్షులు బ్రహ్మాజీ, సీనియర్ నాయకులు ఈసన్న, మైనార్టీ సీనియర్ నాయకుడు షకీల్ ఖాన్, కేకేసీ చైర్మెన్ గంట రాజు సాగర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొమ్మాటి శివకుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమెర్, అబ్దుల్ నిసార్, ఎస్ శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య కాన్సెప్ట్ స్కూల్ ఫుట్‌పాత్‌పై మధురానగర్ మెట్రో స్టేషన్‌కు అతి సమీపంలో గుర్తుతెలియని 40 ఏండ్ల వ్యక్తి పడిపోయి ఉండగా.. ఆదివారం 11 గంటలకు స్కూల్ క్యాంపస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ 100 డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే అక్కడికి వెళ్లిన కానిస్టేబుల్ జి. మల్లేష్ యాదవ్ ఆ గుర్తుతెలియని వ్యక్తి గురించి అధికారులకు తెలియపరచి అంబులెన్స్‌కు కాల్ చేశాడు. అంబులెన్స్ సిబ్బంది పడిపోయి ఉన్న వ్యక్తిని పరిశీలించి చనిపోయినట్టుగా నిర్ధారించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించాడు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించిన ఎడల మధురానగర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సబ్ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 8712571916కు తెలియపరచాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-శంషాబాద్

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శనివారం మధ్య రాత్రి 12 గంటల 54 నిమిషాలకు మదనపల్లి పరిధిలోని నేషనల్ హైవే శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్లే దారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ విషయాన్ని పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. మరణించిన గుర్తు తెలియని వ్యక్తి 30 నుంచి 35 ఏండ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వాహనం అతివేగంగా అతడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెట్రోల్ మొబైల్ వన్ ఏరియా ఎస్‌పీఓ విజయ్ శంకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి మహిళా ఒక రత్నం



- జాస్తి వెంకట్ భాను ప్రకాష్, విష్ణు ప్రియ

నవతెలంగాణ-బంజారాహిల్స్

అనంత్ డైమండ్స్ అధినేత జాస్తి వెంకట్ భాను ప్రకాష్, విష్ణు ప్రియలు విశిష్ట మహిళామణులతో కలసి స్త్రీ వ్యక్తిత్వానికి నివాళిగా తమ సరికొత్త మహిళల ప్రత్యేక 'ఏకం-కలెక్షన్స్'ను ఆవిష్కరించారు. అనంతరం మహిళలను సత్కరించారు. జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతినిధులు వెంకట్ భాను ప్రకాష్, విష్ణు ప్రియలు మాట్లాడుతూ.. ప్రతి మహిళా ఒక రత్నం వలె.. ప్రత్యేకమైన వజ్రం వలె అరుదైనది, విలువైనది అనేది అనంత్ డైమండ్స్ వారి నమ్మకం అన్నారు. ఏకం-కలెక్షన్స్ సేకరణ అనేది స్త్రీతత్వం మూర్తీభవించే గాంభీర్యం వారసత్వం యొక్క వేడుకగా భావిస్తూ ఖచ్చితత్వంతో అత్యుత్తమ నాణ్యతతో రూపొందించబడిన ఏకం కలెక్షన్ అనంత్ డైమండ్స్ యొక్క ఉన్నత విలువలు, సంప్రదాయాలు సంస్కృతిని ప్రతిబింబిస్తుందని చెప్పారు. సేకరణలోని ప్రతి భాగం వినియోగదారులు తరతరాలుగా ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

రంగుల రాజకీయం

- ఆర్ట్స్ కళాశాల వేదిక కోసం పోటీ..
- ఎన్ఎస్‌యుఐ, ఏబీవీపీ
- సమన్వయంకై రంగంలో దిగిన పోలీసులు
- వర్సిటీ అధికారులకు, పోలీసులకు తలనొప్పిగా మారిన హెలీ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల మరొక అంశంతో చర్చలోకి వచ్చింది. ఈ నెల 14న హోలీ పండుగ ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఎదుట గత కొన్ని ఏండ్లుగా హోలీ వేడుకలు తామే నిర్వహిస్తున్నట్టు ఓయూ ఏబీవీపీ నేతలు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి మేము కూడా హెలీ వేడుకలు ఘనంగా నిర్వహించటానికి మాకు అనుమతి ఇవ్వాలని ఎన్ఎస్‌యూఐ ఓయూ నేతలు పోలీసులకు అనుమతి కోసం లెటర్ పెట్టారు. దీనితో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. ఇనేండ్లుగా మేమే నిర్వహిస్తున్న సందర్భంగా తమకే అనుమతి ఇవ్వాలని ఏబీవీపీ అంటుంది. మాకే అనుమతి ఇవ్వలని ఎన్ఎస్‌యూఐ పట్టుపట్టింది. దీనితో పోలీసులకు ఈ విషయం కాస్త తల నొప్పిగా మారింది.

విద్యార్థులకు దగ్గర ఐయ్యేందుకు ప్రయత్నాలు..

ఈ హోలీ పండుగ ద్వారా విద్యార్థులకు దగ్గర కావాలని ఇరువురు పోటా పోటీగా ఉన్నారు. రంగుల హోళీ పండగ వేదిక విషయంలో ఈ రెండు జాతీయ స్థాయి విద్యార్థి సంఘాల మధ్య పోటీ సంఘర్షణ కు దారి తీసే అవకాశం ఉంది. ఒకే చోట వేదిక కోసం విద్యార్థి సంఘాలు పోటీకి దిగడం రంగుల పండగ మరింత రాజకీయ రంగు పులుముకుంది. ఎంతో స్నేహ సంబంధాలు కలిగిన, ఆనంద ఉత్సవాలతో అందరు కలిసి జరుపుకోవాల్సిన ఈ పండుగ ఇలా రాజకీయం కావడంతో ఓయూలో పరిస్థితి మరింత రసవత్తరంగా మారిందనే చెప్పాలి.

> **భయపెడుతున్న ఇటీవల ఘర్షణ..**
>
> గత గణపతి నిమజ్జన వేడుకల్లో గణపతి శోభయాత్ర సమయంలో ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏబీవీపీకి కొందరు జనరల్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెల్సిందే. ఈ ఘర్షణ సందర్భంగా పలువురిపై కేసు నమోదు అయ్యాయి. మరొక వైపు ఏకంగా ఈ ఘర్షణ వాతావరణంలో ఓయూ ఎస్సై విధుల్లో గాయపడ్డాడు.

ఎన్ని వైరుధ భావజాలాలు ఉన్న సైద్ధాంతిక పోరాటాన్ని చేసిన విద్యార్థులు అందరు సోదర భావంతో ఉండటం ఈ విశ్వవిద్యాలయానికి ఉన్న గొప్ప లక్షణం. పండుగలు అనేవి మిత్రులతో భావాలు పెంచి పోషించి శత్రుత్వ భావాన్ని దూరం చేయాలి. కానీ వేదిక విషయంలో ముందస్తు అనుమతి కోరుతూన్న సంఘలు కొన్ని.. సంప్రదాయంగా అనేక ఏండ్లుగా మేమే పండుగ నిర్వహిస్తున్నాము కాబట్టి మాకు ఎవరి అనుమతి అవసరం లేదని భావించే సంఘాలు కొన్ని.. ఒకవేల ఓయూలో విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంటే అది ఎంత దూరం వెళ్తాందో మనం ఊహించలేం. దీనితో హోలీ ఓయూ అధికారులకు అటు శాంతిబద్రతలు కాపాడాల్సిన పోలీసులకు ఒక సవాల్‌గా మారిందనే చెప్పాలి. ఇక ఈ విషయంలో ఇరు విద్యార్థి సంఘాల నేతల వివరణ కోరగా వారు తోసి పుచ్చారు.

ఇటు యూనివర్సిటీ, అటు విద్యార్థులు యూనివర్సిటీలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నా వేళా ఇలా బాధ్యత కలిగిన విద్యార్థి సంఘాలు ఇలా పోటీకి దిగడంతో జనరల్ విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



సృష్టికి మూలం మహిళామణులే..



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు లోకయానస్థనక్ స్వచ్ఛంద సంస్థ ఆదివారం కంటోన్మెంట్ సఖి నిలయంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరయ్యారు. మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సోదరీమణులు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సృష్టికి మూలం మహిళామణులే.. కేవలం మహిళా దినోత్సవం నాడే కాకుండా ప్రతి నిత్యం మహిళలను గౌరవించుకోవాలన్నారు. ఎక్కడ మహిళలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మహిళలు అభివృద్ధి చెందాలంటే విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో వారిని మరింతగా ఎదగాలని ఆయన ఆశించారు. దీనిని దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను వ్యాపారులుగా తీర్చి దిద్దాలని సంకల్పించారని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న క్యాంటిన్‌లను మహిళా సంఘాలకే కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయిస్తుందని తెలియాజేశారు. మహిళా సంఘాల ద్వారానే బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీ సంస్థకు అద్దెకు ఇప్పించి దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని మహిళా సంఘాలకే వచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, నిన్న మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బస్సులను లాంఛనంగా ప్రారంభించారని గుర్తు చేశారు. మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్లులను ప్రారంభించి ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు కూడా మహిళా సంఘాల ద్వారానే సరఫరా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని వివరించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా, భారీ పరిశ్రమల ఏర్పాటుకు కూడా మహిళా సోదరీమణు లకు శిక్షణ ఇప్పించి వారి చేతనే పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం లోని మహిళా సోదరీమణులు ఎవరైనా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనుకుంటే వారికి తానే స్వంత ఖర్చులతో రవాణా సదుపాయం ఏర్పాటు చేసి ప్రభుత్వ శిక్షణా కేంద్రాలలో శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. వేడుకలలో కంటోన్మెంట్ డిప్యూటీ సీఈవో పల్లవి, లోకయానస్థనక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తులసి, కార్తీక్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరత్, స్థానిక నాయకులు వినోద్, ఉత్తరయ్య, శంకర్, సంతోష్ యాదవ్, షణ్ముగం, విద్దు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొ. వీవీ. బసవరావుకి సన్మానం



నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఓయూ టెక్నాలజీ కళాశాల రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావు ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ న్యూ ఎమ్మెల్యే కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రొ. వి.వి.బసవరావుని అభినందించారు. ఈ సందర్భంగా డా.సాదం ఐలయ్య తాను రాసిన కవితను చదివి వినిపించాడు. తాను రాసిన ఎ. లైఫ్ జర్నీ ఆఫ్ ఎ. ప్రొఫెసర్ వి.వి.బసవరావు అను పుస్తకాన్ని బహుకరించాడు. అనంతరం ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన ప్రొ. వి. రమేష్ కుమార్‌ని, మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొ. పి. శశికళని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు ఎం. రాజమహేందర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సి.పి రాములు, పూర్వ అధ్యక్షులు, టెక్నాలజీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొ. ఎస్. వెంకటేశ్వర్, శ్రీ ఎ.భాస్కర్ రెడ్డి, టెక్నాలజీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొ. డి.జయ ప్రకాష్, జాయింట్ సెక్రెటరీ డా.వి పవన్ కుమార్, ట్రెజరర్ విద్యా భూషణ్, యాదగిరి, డా. రవీంద్ర, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మగ పిల్లలు, ఆడ పిల్లలు ఇద్దరూ సమానమే..



- జేడీ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-బంజారాహిల్స్

మగ పిల్లలు, ఆడ పిల్లలు ఇద్దరు సమానమే అని ఈలాంటి ధోరణితో పిల్లలను తల్లిదండ్రులు పెంచాల్సిన అవసరం ఉందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం అమీర్‌పేట్ సారధి స్టూడియోలో తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డ్స్-2025 వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా రంగం, సామాజిక రంగం, సినీ రంగంతో పాటు పలు రంగాల్లో విశేష సేవలందించిన పలువురు మహిళలకు ఆయన అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సమాజం, ఒక దేశం ముందుకు వెళ్లాలన్నా, అభివృద్ధి చెందాలన్నా అందులో మహిళల పాత్ర కీలకమని అన్నారు. మహిళలకు సముచిత గౌరవం ఇచ్చి సత్కారాలు చేయడం అభినందనీయమని అన్నారు. తెలంగాణ చరిత్రను చూసినా కూడా ఓ రాణి రుద్రమదేవి, ఓ చాకలి ఐయిలమ్మ గుర్తుకు వస్తారని గుర్తు చేశారు. భారత దేశాన్ని సైతం మనం భారత మాతగా పూజిస్తామని ఎక్కడైతే మహిళలు పూజింపబడతారో ఆ దేశం ఎంతో ఎత్తుకు ఎదుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకుడు జి. కిరణ్ కుమార్, సినీ నటుడు, మాజీ శాసన సభ్యుడు బాబూ మోహన్, సినీ నటి ఎస్తేర్, యూట్యూబర్ గంగవ్వ, సినీ నటి ఎస్తేర్, పారా ఒలింపిక్స్ విజేత దీప్తి జీవాంజి, యూట్యూబర్ గంగవ్వ, సినీ నటి ఎస్తేర్, ప్రముఖ గైనకాలజిస్ట్ జయంతిరెడ్డి, తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, హంసవాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరిస్తా..



- కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పీవీ ఎంక్లేవ్స్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కాలనీ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆదివారము పీవీ ఎంక్లేవ్ కాలనీ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించుకున్నారు. ఆ సమావేశానికి కార్పొరేటర్ నరసింహ యాదవ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ మేరకు సమస్యలను కమిటీ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీ కమిటీ హాల్ రిటైనింగ్ వాల్, రాత్రిపూట వీధి కుక్కల బెదడా, డ్రయినేజీ, స్ట్రీట్ లైట్, పారిశుద్ధ్య సమస్యలు కార్పొరేటర్‌కు తెలియజేశారు. వెంటనే ఆయన వీధిలైట్లను మరము చేయాలని అధికారులకు ఆదేశించారు. కుక్కలను, శానిటేషన్, డ్రయినేజి సమస్యలను జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు జగదీష్ కృష్ణ, మినీ పాండే రవి, నింజల్ నారాయణరావు, జీహెచ్ఎంసీ సిబ్బంది సంపత్, చైతన్య, మలేష్ యాదవ్ పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌లు మానవత్వంతో సేవలందించే కేంద్రాలు

- సామాజికవేత్త సుధాకర్ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆరోగ్యాన్ని మెరుగుగా ఉన్నప్పుడు ఏ ఒక్కరూ ఆస్పత్రికి వెళ్లాలని కోరు. అటువంటిది ఆరోగ్య పరిస్థితి నిలకడగా లేనప్పుడు పలువురు ఉత్తమ సేవలపై వెల్‌నెస్ సెంటర్లనే ఎంచుకుంటున్న సందర్భంలో మానవతా దృక్పథంతో సేవలందించే కేంద్రాలుగా, నిలయాలుగా నిలవాలని ప్రముఖ సామాజికవేత్త సంఘ సేవకురాలు సుధా రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి అంతర్జాతీయంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూబ్లీహిల్స్‌లో ప్రఖ్యాతి పొందిన వెల్‌నెస్ నిపుణుడు గ్రాండ్‌మాస్టర్ అంకిత్ స్థాపించిన అంకితం అనే ప్రత్యేకమైన వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె ప్రారంభించి ప్రసంగించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నిపుణుల కొరత లేకుండా మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలనే అత్యధిక మందిని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఏర్పాటు చేయడం శుభప్రదం అన్నారు. 360-డిగ్రీ విధానంలో ఏర్పాటైన ఈ సంస్థ హెూలిస్టిక్ వెల్‌నెస్‌లో విజనరీతో అంకిత్ ఈ రంగంలో ఒక విశిష్ట అధికారి, 2006 నుంచి యోగా వెల్‌నెస్‌లో నిష్ణాతులైన ఆయన యోగా, మెడిటేషన్‌లో మాస్టర్స్ డిగ్రీనితో పాటు అనేక



ప్రత్యేక విభాగాలలో సర్టిఫికేట్ పొందాడని అన్నారు. మహిళామణులతో కలిసి సేవలందించే భాగ్యం తనకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని, మహిళలు ప్రపంచ స్థాయిలో రాణిస్తూ, ముందుకు వెళ్లలన్నదే తన అభిమాతమని ఆ లక్ష్యం దిశగా తమ సంస్థ పనిచేస్తుందని అంకితం వెల్‌నెస్ అధినేత అంకిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళామణులు పాల్గొన్నారు.

అంధుల కళాశాలలో అన్నదానం



- దళిత చైతన్య సంఘం

నవతెలంగాణ-కంటోన్మెంట్

దళిత చైతన్య సంఘ ఆదివారం అంధుల కళాశాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవ కార్యక్రమాలలో భాగంగా బన్సిలాల్‌పేట్‌లోని దేవనార్ అంధుల కళాశాలలో అన్నదానం చేశారు. 200 మంది విద్యార్థులు ఆయన బిర్యానీ వడ్డించారు. ఈ సందర్భంగా ముప్పిడి నవీన్ మాట్లాడుతూ.. అనాథలకు, పేద మధ్యతరగతి వర్గాలకు దళిత చైతన్య సంఘం అండగా ఉంటుందన్నారు. తమ సంఘం అనగారిన వర్గాలకు, పేద మధ్యతరగతి ప్రజలకు ఎల్లపుడూ అండగా ఉంటుందని, అలాగే పేద ప్రజలు సమస్యలను తెలుసుకుని వారిని ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి వాటిని పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, సతీష్ రాజ్, సాయి, వెంకట్, మనోజ్, విశాల్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మహారాణులకు సన్మానం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం, యూసుఫ్ గూడా డివిజన్, వెంకటగిరిలో ఉన్న గుడ్ సిటిజన్ కాన్సెప్ట్ స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ నసీం ఉన్నిసా, కరస్పాండెంట్ అయుఖాన్, జీహెచ్ఎంసీ స్వీపింగ్ మహిళలకు మహిళ దినోత్సవం సందర్భంగా శాలువాతో సన్మానించి, వారికి నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రామానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (అడ్మిన్) కే. శశిశ్రీ, అడిషనల్ డైరెక్టర్, సందర్శని స్కూల్ ప్రిన్సిపాల్ కె. ఎస్. సుప్రభా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కే. శశిశ్రీ, అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రతి విషయంలోనూ పురుషులతో సమానంగా ఉంటూ వారితో పై చేయి సాధిస్తూ అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అందుకుంటూ, ఇంటి సంసారాన్ని కూడా సక్రమంగా నిర్వహిస్తూ తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, అందరితో అభినందనలు పొందుతున్న ఏకైక వ్యక్తి మహిళ అని కొనియాడారు.

జీహెచ్ఎంసీ సిబ్బంది కారోన సమయంలో చేసిన సేవని, ఈ సందర్భంగా కొనియాడారు. ఉదయము నుంచి సాయంత్రం వరకు వీధిలు శుభ్రం చేయడంతో పాటు, మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలు అందుకుంటున్న మహారాణుల్లో మహిళ మొదటి స్థానంలో ఉంది అని అన్నారు.

డిప్రెషన్‌ను తరిమేద్దాం...

డిప్రెషన్.. ఇప్పుడు ఎవరిని కదిపినా ఇదే మాట వినిపిస్తోంది. కొంత మంది చిన్న చిన్న కారణాలకే డిప్రెషన్‌కు లోనవుతున్నారు. చివరికి అందులో నుంచి బయటకు రాలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మధ్య స్కూల్ కి వెళ్లే పిల్లలు సైతం డిప్రెషన్‌కు లోనవుతున్నారు. స్కూల్ లో చదువుల ఒత్తిడులు, ఉద్యోగాల్లో టెన్షన్స్, ప్రేమలో బ్రేకప్స్, ఆర్థిక ఇబ్బందులు, లైంగిక వేధింపులు.. ఇలా అనేక కారణాలతో డిప్రెషన్‌లోకి వెళ్లిపోతున్నారు. అయితే వీటిని అధిగమించడం పెద్ద కష్టం కాదంటున్నారు నిపుణులు. మనకు నచ్చనివి జరిగినప్పుడు బాధ అనేది సహజం. కానీ కాస్త మైండ్ సెట్ ని మార్చుకుంటే అన్నీ ముందులాగే మామూలుగా ఉంటాయి. మన లైఫ్ స్టైల్‌లో, తీసుకునే ఆహార విషయంలో కొద్దిగా మార్పులు చేస్తే.. డిప్రెషన్‌ను దూరం పెట్టవచ్చు. అవేంటో చూద్దాం.

ఇబ్బందిని షేర్ చేసుకోవాలి

ఏ సమస్య వల్ల మీరు ఇబ్బంది పడుతున్నారో.. అది సన్నిహితులకు షేర్ చేసుకుంటే కాస్త బాధ తగ్గుతుంది. దీంతో మనసు తేలిక అవుతుంది. ఒత్తిడి దూరం అవుతుంది. ఇలా చెప్పడం వల్ల మనం ముఖ్యంగా ఇబ్బంది పడకుండా ఉంటాం.

మీకు నచ్చని వాటికి దూరంగా ఉండండి:

కొంత మందికి కొన్ని ఇష్టం ఉండవు. కాబట్టి అలాంటి వాటికి దూరంగా ఉండొచ్చు. మీకు నచ్చని వ్యక్తులైనా సరే వాళ్లకు దూరంగా ఉంటేనే బెటర్. కుదిరితే సున్నితంగా తిరస్కరించుకోవడం నేర్చుకోండి.

హెల్దీ డైట్ ప్లాన్ చేసుకోండి:

మీ ఆరోగ్యం పట్ల మీరే శ్రద్ధ తీసుకోవాలి. మీకు నచ్చే వాటినే హెల్దీగా చేసుకుని తినండి. ఫ్రెష్ ఫ్రూట్స్, కూరగాయలను మీ డైట్‌లో యాడ్ చేసుకోండి.

వ్యాయామం:

వ్యాయామం కూడా మనసును రిలాక్స్ చేస్తుంది. కాబట్టి రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించండి.

హాయిగా నిద్రపోండి:

నిద్ర పోయేటప్పుడు మీకు నచ్చని వ్యక్తులు, విషయాల గురించి అస్సలు ఆలోచించకూడదు. హాయిగా నిద్రపోడానికి ట్రై చేయండి. నిద్రా 22 శాతం డిప్రెషన్‌ను దూరం చేస్తుందట.

మీకు నచ్చిన వ్యక్తులతో సమయాన్ని గడపండి:

డిప్రెషన్‌లో ఉన్నప్పుడు మనకు నచ్చిన వ్యక్తులతో టైమ్ స్పెండ్ చేస్తే.. డిప్రెషన్ నుంచి దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి వీలైనంత వరకూ యాక్టీవ్ గా ఉంటూ మీకు నచ్చిన వ్యక్తులతో టైమ్ స్పెండ్ చేయండి.

లోకం తెలియని పసి పిల్లలు... కల్లాకపటం ఎరుగని మల్లె మొగ్గలు. తెల్లని వన్నీ పాలని నమ్మే అమాయకులు. తమపై అమానుష దాడి జరుగుతున్నా ఏం జరుగుతుందో తెలుసుకోలేని పాల బుగ్గల చిన్నారి బాలికలు. లైంగిక దాడి అంటేనే తీవ్రమైన మానసిక గాయం. ఇక ఏమీ తెలియని వయసులో అలాంటి గాయానికి గురైతే ఆ అమ్మాయి పరిస్థితి ఏంటీ! ఊహించుకోడానికే కష్టంగా ఉంది కదూ! వారి మనసుకైనా ఆ గాయాన్ని మర్చిపోవాలంటే అంతకు మించిన ప్రేమా, ఆప్యాయత వారికి దక్కాలి. అలాంటి అనురాగాన్ని వారికి పంచుతుంది తరుణి స్వాలంబన.

తరుణి స్వావలంబన



తరుణి స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్‌లో బాలలపై అత్యాచార బాధితులు కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సహాయపడే 'తరుణి స్వాలంబన పునరావాసం-నైపుణ్య కేంద్రం' నిర్వహిస్తోంది. ఇలాంటి కేంద్రం భారతదేశంలోనే ఇదే మొదటిది కావచ్చు. 18 ఏండ్ల కంటే తక్కువ వయసు ఉన్న లైంగిక వేధింపులకు గురైన బాలికల అవసరాలకు అనుగుణంగా కౌన్సెలింగ్, ట్రామా కేర్, ఒక ఏడాది పాటు ఉచిత బోర్డింగ్, వసతి, వారి విద్యను కొనసాగించడానికి ప్రత్యేక తరగతులు, నైపుణ్య మెరుగుదల శిక్షణ, గర్భిణీ బాలికలకు ప్రత్యేక వైద్య సంరక్షణ.. ఇలా అనేక రకాల సేవలను ఒకే గొడుగు కింద అందిస్తుంది తరుణి స్వాలంబన కేంద్రం.

కుటుంబం లాంటి ప్రేమ

ఇది 50 పడకల సెంటర్. బాలికలలో ఎక్కువ మందిని వారు ఎదుర్కొంటున్న కళంకం కారణంగా వారి కుటుంబాలు వదిలివేస్తాయి. అందుకే స్వాలంబనలో వైద్యంతో పాటు ఆ అమ్మాయిలకు తల్లి వంటి వాత్సల్యం, సోదరి వంటి మద్దతు, తండ్రి వంటి భరోసా, సోదరుడి వంటి భద్రతను ఇస్తున్నారు. ఇలా తమ కుటుంబం మొత్తాన్ని ఆ బాలికలు ఈ తరుణి సభ్యులలోనే చూసుకుంటారు.

ఎందుకు పెట్టాల్సి వచ్చింది?

జీవితంలో బాధాకరమైన అనుభవాన్ని ఎదుర్కొన్న బాలికలకు సరైన సంరక్షణ, పోషణ అవసరం. ఆ పిల్లలు తమ మానసిక గాయం నుండి బయటపడటానికి మాత్రమే కాకుండా, వారి నైపుణ్యాలను, విశ్వాసాన్ని తగినంతగా పెంపొందించుకోవడానికి వారికి వృత్తిపరమైన శిక్షణ అవసరం. దీని వల్ల వారు భవిష్యత్తుపై ఆశతో కొత్త జీవితాన్ని ప్రారంభించగలుగుతారు. తెలంగాణలో తరుణి స్వచ్ఛంద సంస్థ సాంకేతిక సహకారంతో పోలీసులు భరోసా వన్-స్టాప్ క్రైసిస్ (సమగ్ర సంరక్షణ) సెంటర్లను ఏర్పాటు చేయడం ఈ ప్రక్రియలో మొదటి అడుగు. ఇది ఒకే గొడుగు కింద కౌన్సెలింగ్, వైద్య, చట్టపరమైన సహాయాన్ని అందించడం ద్వారా బాధితులు తిరిగి బాధితులుగా మారకుండా నిరోధించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే బాల లైంగిక వేధింపుల బాధితుల ప్రత్యేక అవసరాలను తీర్చడానికి ప్రత్యేకమైన కేంద్రం లేదు. వీరిలో కొందరు ఇంత చిన్న వయసులో గర్భధారణను కూడా ఎదుర్కోవలసి ఉంటుంది. తెలంగాణలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 34 చైల్డ్ కేర్ సంస్థలు నడుస్తున్నాయి. అలాగే ఎన్‌జీఓలు నిర్వహిస్తున్న అనేక ఇతర గృహాలు ఉన్నాయి. ప్రస్తుత చైల్డ్ కేర్ సంస్థలు అనాథలు, సెమీ-అనాథలు, బాల కార్మికులకు సంరక్షణ, రక్షణ అవసరమైన పిల్లలందరికీ సేవలు అందిస్తున్నాయి. అయితే అవి లైంగిక బాధితుల ప్రత్యేక అవసరాలను తీర్చలేకపోతున్నాయి. అందుకే వీరి కోసం ఒక ప్రత్యేక పునరావాస కేంద్రంగా తరుణి స్వాలంబన ఏర్పాటు చేయబడింది.





స్వాలంబన

ఈ కేంద్రం హైదరాబాద్‌లోని చైతన్యపురిలో ఆగస్టు 29, 2024న ప్రారంభమైన పునరావాస, నైపుణ్య కేంద్రం. బాల లైంగిక దాడుల బాధితులు చాలా గాయాలను ఎదుర్కొంటారు. వీరి తిరిగి సాధారణ స్థితికి రావడానికి ఏండ్లు పడుతుంది. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ థెరపీ ద్వారా వారు మామూలు మనుషులు అవడం వేగవంతం చేయవచ్చు. 'స్వాలంబన'లో బాలికలకు ప్రారంభంలో ఒక నెల పాటు ఈ రెండు చికిత్సలు ఇవ్వబడతాయి. తద్వారా వారి మానసిక గాయాన్ని కొంత తగ్గించ వచ్చు. గర్భిణీ బాలికలకు ఫెర్నాండెజ్ ఆసుపత్రి నుండి ప్రసూతి వైద్య సేవలు అందిస్తారు. అయితే వీరిలో సామర్థ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి విస్తృత నైపుణ్య మెరుగుదల కార్యక్రమాలు చేపట్టబడతాయి. తరుణి స్వాలంబనలో వారు ఉన్నప్పుడు వారి సర్వతోముఖాభివృద్ధికై జీవన నైపుణ్యాలు, యోగా, మెడిటేషన్, కరాటే వంటి శిక్షణతో పాటు, వారికి పుష్టికరమైన భోజనం, ఏసీ గదుల్లో వసతి, ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తారు.

సిల్క్ థ్రెడ్ బ్యాంగిల్స్

బాలికలకు ఇచ్చే శిక్షణలో సాంప్రదాయ చేతిపని అయిన బ్యాంగిల్ మేకింగ్ ఒకటి.





పండుగలు, వివాహాలులతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది. గాజు, లోహం, బట్ట లేదా పర్యావరణ అనుకూల పదార్థాలను ఉపయోగించి ఈ గాజుల తయారీ చేస్తున్నారు. మార్కెట్‌లను ఆకర్షించడానికి ప్రత్యేకమైన డిజైన్‌లను కూడా సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. గాజుల తయారీ కూడా అమ్మాయిలకు ఒక చికిత్స లాంటిందే. పట్టు దారంతో బ్యాంగిల్స్‌ను చుట్టడానికి చాలా గంటలు ఏకాగ్రతతో పని చేస్తారు. తర్వాత వారు తయారు చేసిన అందమైన గాజులను చూసి ఎంతో తృప్తి పొందుతారు. 'మేము కూడా ఒక ఉత్పత్తిని సృష్టించగలం' అనే విశ్వాసాన్ని పొందుతారు. కనుక ఇది వారు మామూలు మనుషులు అవడానికి ఉపయోగపడుతుంది. జీవించడానికి కొత్త ఆశను కల్పిస్తుంది.

బాధితులు కాదు యువ వ్యాపారవేత్తలు

'నా జీవితంలో ఎవరో నన్ను తీవ్రంగా బాధపెట్టారు. కానీ ఇప్పటికీ నేను ఇటువంటి ఉత్పత్తులు చేయగలుగుతున్నాను' ఈ అందమైన బ్యాంగిల్స్ తయారు చేసిన తర్వాత ఒక బాధితురాలు చెప్పిన మాట ఇది. అందుకే వారిని బాధితులుగా కాకుండా యువ వ్యాపారవేత్తలుగా చూడాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాం. ఈ గాజులు కొనుగోలు చేయడం ద్వారా భారతీయ సంస్కృతికి మద్దతు ఇచ్చిన వారు అవుతారు. అలాగే ఆ బాలికల జీవితాల్లో స్వస్థత, మళ్ళీ వికసించడానికి అవకాశం ఇచ్చిన వారు అవుతారు. ఆర్డర్ చేయడానికి +91-9000243000 నంబర్‌కు సంప్రదించండి. మీకు నచ్చిన గాజులు మీ ఇంటికే వస్తాయి. షిప్పింగ్ ఛార్జీలు వర్తిస్తాయి.

ఖాతా వివరాలు :
పేరు: తరుణి
ఖాతా నం: 088110011110337
బ్యాంక్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బ్రాంచ్: రాజ్‌భవన్ రోడ్
IFSC కోడ్: UBIN0804908

స్టార్‌లింక్ సేవల్ని ఆపేస్తే..

వాషింగ్టన్: రష్యాతో యుద్ధం శాశ్వతంగా కొనసాగేలా చేస్తున్నారంటూ ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్ మండిపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా తమ 'స్టార్‌లింక్' ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. యుద్ధక్షేత్రంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. యుద్ధం విషయంలో పుతిన్‌ను పక్కనపెట్టి.. కేవలం ఉక్రెయిన్‌నే ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారనే ట్వీట్‌పై మస్క్ ఈ విధంగా స్పందించారు. "ఉక్రెయిన్ విషయంలో ముఖాముఖికి రావాలంటూ గతంలో పుతిన్‌కు సవాలు విసిరాను. మరోవైపు.. కీవ్ సైన్యానికి మా స్టార్‌లింక్ వ్యవస్థ వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఒకవేళ ఈ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తే.. రణరంగంలో కీవ్ సేనలు కుప్పకూలుతాయి. ఏదేమైనా ఉక్రెయిన్‌కు ఓటమి అనివార్యం. అయినప్పటికీ.. ఏండ్ల తరబడి సాగుతున్న ఊచకోత విసుగు పుట్టిస్తోంది. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారు" అని మస్క్ పేర్కొన్నారు. మరోవైపు.. వైట్‌హౌస్ సమీపంలో భారీ ఉక్రెయిన్ జెండా ఆవిష్కరణకు నిధులు ఎవరు కేటాయించారు? అంటూ 'ఎక్స్' వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు మస్క్ స్పందించారు "టాప్ 10 ఉక్రెయిన్ సంపన్నులపై.. ముఖ్యంగా మొనాకోలో విలాస భవనాలు కలిగి ఉన్నవారిపై ఆంక్షలు విధించాలి. తద్వారా ఇటువంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుంది" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. రష్యా దాడుల్లో ఉక్రెయిన్ కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడంతో ప్రస్తుతం స్టార్‌లింక్ సేవలందిస్తోంది. సైన్యానికి ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది.

16వ రోజున బయటపడిన మృతదేహం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లారు. ఇంజనీర్ గురుప్రీత్ సింగ్.. రాబిన్ ఇండియా ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. టీబీఎంపై మట్టిపడి శకలాల కింద ఇంజనీర్ ఇరుక్కొని చనిపోయారు. ఆయన మృతదేహాన్ని చేతికున్న కడియంతో గుర్తించారు. ఆదివారం తొలి మృతదేహం బయటపడటంతో మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గ్యాస్ కట్టర్‌తో ఇనుప రాడ్లను తొలగించి ఒక్కొక్కరిని బయటకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

రెండు రోజుల్లో ఆపరేషన్ పూర్తి

రెండు రోజుల్లో ఎస్ఎల్బీసీ సొరంగం ఆపరేషన్ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ఇక చనిపోయిన కార్మికులను తమ సొంత ప్రాంతాలకు తీసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మృతదేహాన్ని వెలికి తీయగానే అంబులెన్స్‌లో జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలిస్తారు. అక్కడ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబాలకు తగిన పరిహారం ప్రకటించే అవకాశాలున్నాయి.

మహిళాశక్తి వేడుకల్లో పచ్చి అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండానే ఇచ్చినట్టు మోసం చేసారని ఆరోపించారు. రూ.4 కోట్లకే వడ్డీ లేని రుణాలు వర్తిస్తాయనీ, మిగతా రూ.16వేల కోట్లకు 12శాతం చొప్పున మహిళా సంఘాలు వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. స్కూల్ యూనిఫామ్స్ నుంచి మొదలుకుని మొబైల్ ఫిష్ వ్యాన్ల వరకు మహిళా సంఘాలకు ఇచ్చిన ఘనత తమదేనని అబద్ధాలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. సీఎం వరంగల్ సభలో మహిళా సంఘాలకిచ్చిన చెక్ క్లియర్ కాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

జో..లాలి...

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్నారా అనేది చెప్పటం క్లిష్టమని వివరించారు. ఇక పని గంటల సంఖ్యలో సరళత లేని కారణంగానే శ్రమశక్తిలో మహిళల భాగస్వామ్య రేటు తక్కువగా ఉండటానికి కారణమని రచయితలు చెప్పారు. 1999 నుంచి 2023 మధ్య భారత్‌లో మహిళా శ్రామికశక్తి భాగస్వామ్యంలో గణనీయమైన తగ్గుదల లేదని అధ్యయనం వివరించింది.



42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా తుంచేసే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. అఖిల భారత పద్మశాలి మహాసభ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కులగణన చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ సభను నిర్వహించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆత్మగౌరవం, త్యాగంలో పద్మశాలీలు ముందుంటారనీ, దానికి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పదవిని త్యాగం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీనే నిదర్శనమని చెప్పారు. తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకునేందుకు తన సొంత ఇంటినే వేదిక చేసిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అనీ, అలాంటి వ్యక్తి మరణిస్తే గత ప్రభుత్వం కనీసం నివాళులు కూడా అర్పించకుండా అవమానించిందని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో ముందున్న మరో వ్యక్తి టైగర్ ఆలే నరేంద్ర అనీ, ఆయన్ని కాంగ్రెస్ పార్టీ కేంద్ర మంత్రిని చేస్తే, కేసీఆర్ ధృతరాష్ట్ర కౌగిలితో ఆయన్ని ఖతం చేశారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసుకొని, దానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామనీ, ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కూడా ఆయన పేరే పెడతామని ప్రకటించారు. ఆ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు అప్పగిస్తున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే రూ.600 కోట్ల విలువైన ఒక కోటి 30 లక్షల చీరల ఆర్డర్‌ను నేతన్నలకు ఇచ్చి చేనేత రంగాన్ని ఆదుకుంటున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇక్కడి పద్మశాలీలు కీలకపాత్ర పోషిస్తున్నారనీ, షోలాపూర్‌లో నిర్మించే మార్కండేయ భవనానికి రూ.కోటి నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. పద్మశాలీయులకు ఆర్థికంగా, రాజకీయంగా, ఉపాధి, ఉద్యోగ పరంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మినరల్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత మగ్గంపై సీఎం రేవంత్‌రెడ్డి వస్త్రాన్ని నేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం

(మొదటిపేజీ తరువాయి)

పేరును ఖరారు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యదర్శివర్గం సమావేశంలో నిర్ణయించింది. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆయన పేరును వెల్లడించారు. సోమవారం ఆయన తన నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించిన కాంగ్రెస్ అగ్రనేతలకు, సీఎం, టీపీసీసీ అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షులు కల్వకుంట చంద్రశేఖరరావు ఆదివారం ప్రకటించారు. ఆయన సోమవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు.

కుటుంబం నుంచే లింగ వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరుగా చూస్తున్నారు. ఇది సమాజంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఫలితంగా మహిళలపై, దాడులు అఘాయిత్యాలు ఆగడం లేదు. ఈ ధోరణి పూర్తిగా మారాలి. లింగ సమానత్వం అనేది కుటుంబం నుంచే ప్రారంభం కావాలి" అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర మహిళా కన్వీనింగ్ కమిటీ హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ఛేంజింగ్ లీగల్ ల్యాండ్ స్కేప్ అండ్ రైట్స్ ఆఫ్ ఉమెన్" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఐలు మహిళా రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ సీహెచ్ శైలజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జస్టిస్ రాధారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్త్రీలు ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా ఇంటి పనులు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత, వృత్తి, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లడంలో తీవ్ర ఒత్తిళ్లకు గురువుతున్నారని వ్యాఖ్యానించారు. స్త్రీలతో పాటు పురుషులు కూడా ఇంటి బాధ్యతలను సమానంగా పంచుకోవాలని సూచించారు. కుటుంబం నుంచి మొదలైన సమానత్వం మంచి సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. చివరికి న్యాయం అందించే న్యాయస్థానాల్లోనూ ఈ ధోరణి అక్కడక్కడా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1930కి ముందు స్త్రీలకు కనీస హక్కులు లేవనీ, స్వాతంత్ర్యానంతరం ఓటు, ఆస్తి తదితర హక్కులను రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. ఎన్ని చట్టాలు తెచ్చినా మహిళలు కుటుంబం నుంచి వృత్తి జీవితం వరకు అనేక రకాలుగా వివక్షతలకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. మద్రాస్ హైకోర్టు న్యాయవాది, ఐలు జాతీయ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు చంకిరాజ్ మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు 75 ఏండ్ల తర్వాత కూడా అమలు కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. హైదరాబాద్, ముంబాయి, కోల్‌కతా తదితర 14 ప్రధాన నగరాల్లో చేసిన సర్వే ప్రకారం 69 శాతం మంది మహిళలు తమ సంపాదనపై నిర్ణయం తీసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ఇది ఎలాంటి సమానత్వాన్ని సూచిస్తుందో ఆలోచించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని విమర్శించారు. రేజ్లర్ వినేశ్‌ఫోగట్ తదితర సంఘటనలు ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర కార్యదర్శి కె. పార్థసారధి, ఐలూ రాష్ట్ర కమిటీ మహిళా జనరల్ సెక్రటరీ ఎం వనజ, కో కన్వీనర్ మంజుల, నాయకులు ఉమాదేవి అన్నపూర్ణ, భారత లక్ష్మి కుమారి, రామచంద్రారెడ్డి, మాధవరెడ్డి, ప్రవీణ్, శర్మ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్షవరకు చేనేత రుణాలు మాఫీ

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని చేనేత కార్మికుల రుణమాఫీ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చేనేత కార్మికులకు చెందిన రూ. 33కోట్ల రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆదివారం (జీవో నెంబర్ 56) ఉత్తర్వులు జారీ చేశారు. 2017 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణ బకాయిలను మాఫీ చేయనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫలితంగా రాష్ట్రంలోని 259 చేనేత సహకార సంఘాల సభ్యులకు లబ్ది చేకూరనుంది.

జీ హుజూర్..!!

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవలి పరిణామాలు ఇందుకు భిన్నంగా కన్పిస్తున్నాయి. ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి అమెరికా వాణిజ్య అధికారులతో జరిపిన చర్చల సందర్భంగా వచ్చిన ప్రతిపాదనలు మనకు ఇబ్బందికరంగా ఉన్నాయి.

నాటి సూత్రాన్ని విస్మరించి...

సుంకాల విషయంలో అమెరికా, దాని వాణిజ్య భాగస్వాముల మధ్య ప్రతీకార చర్యలు కొనసాగుతున్నాయి. ఇవి ప్రపంచ వాణిజ్యానికి ఆధారంగా ఉండే నిస్పాక్షికమైన, సమానత్వ సూత్రాలను బలహీనపరుస్తున్నాయి. ఇక్కడ అత్యంత దారుణమైన విషయమేమంటే 2004లో బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనాతో కుదుర్చుకున్న అంగీకార సూత్రాన్ని భారత్ విస్మరించడం. సంపన్న దేశాలతో పోలిస్తే వర్ధమాన దేశాలకు వాణిజ్య చర్చల సందర్భంగా కొన్ని చిన్న చిన్న రాయితీలు కల్పించేందుకు ఈ సూత్రం అనుమతిస్తోంది. సంపన్న, వర్ధమాన దేశాల మధ్య నెలకొన్న వ్యవస్థాగతమైన అసమతుల్యతలను పరిష్కరించడానికి ఈ సూత్రాన్ని రూపొందించారు. ఇప్పుడు ట్రంప్ డిమాండ్లకు భారత్ లొంగిపోయి ఈ సూత్రాన్ని బుట్టదాఖలా చేసిందన్న విమర్శలు వస్తున్నాయి.

డబ్ల్యూటీఓలోనూ సంకటం

వర్ధమాన దేశాల విషయంలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వ్యవహరిస్తున్న తీరుపై ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. వర్ధమాన దేశాలను ప్రత్యేకంగా చూడడం దానికి ఏ మాత్రం ఇష్టం లేదు. అందుకే అది డబ్ల్యూటీఓ వైఫల్యాలను తరచూ ఎత్తిచూపుతోంది. దాని అభివృద్ధి అజెండాను విమర్శిస్తూ అమెరికా వాణిజ్య ప్రతినిధి 207 పేజీల నివేదికను అందజేశారు. ఈ పరిస్థితుల్లో భారత్ రెండు రకాల సంక్షోభాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఒకటి... అమెరికా విధిస్తున్న సుంకాలను ఎదుర్కోవడం. రెండోది...డబ్ల్యూటీఓలో వర్ధమాన దేశ హోదాను కాపాడుకోవడం. భారత్ వంటి దేశాలను ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేదని అమెరికా వాదిస్తోంది. ఏదేమైనా భారత్ ముందున్నది సవాళ్లతో కూడిన రహదారి. మోడీ చెబుతున్న అమృత్‌కాల్ కేవలం ఆశాకిరణంగానే మిగిలిపోతుందా లేక ఎండమావిగా మారుతుందా అనేది ఆయన ప్రభుత్వం తీసుకోబోయే వైఖరిపై ఆధాపడి ఉంటుంది.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. నాలుగు స్థానాల్లో మూడు కాంగ్రెస్ తీసుకోగా, ఒక స్థానాన్ని సీపీఐకి కేటాయించింది. కాంగ్రెస్ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మెన్, సీనియర్ నేత విజయశాంతి పేర్లను ప్రకటించారు. ఎమ్మెల్యే కోటాలో ఐదుగురు ఎమ్మెల్సీలకు అవకాశం ఉన్నది. ఈనెల 10లోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఆధారంగా నాలుగు కాంగ్రెస్‌కు, ఒకటి బీఆర్ఎస్‌కు వస్తాయి. కాంగ్రెస్‌కు ఎంఐఎంతోపాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఓట్లు వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి.

ప్రైజ్‌మనీ రూ.60 కోట్లు



దుబాయ్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ చాంపియన్ భారీ ప్రైజ్‌మనీ దక్కించుకుంది. ఎనిమిదేండ్ల నిరీక్షణ తర్వాత జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీని ఐసీసీ రూ. 60 కోట్లకు పెంచింది. చాంపియన్ రూ. 20 కోట్ల ప్రైజ్‌మనీ అందుకోగా.. రన్నరప్ రూ. 10 కోట్లు ఖాతాలో వేసుకుంది. సెమీఫైనల్స్‌లో ఓడిన జట్లు రూ. 4.6 కోట్ల చొప్పున అందుకోనుండగా.. 6, 7 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.2.9 కోట్ల చొప్పున దక్కనున్నాయి. అట్టడుగు స్థానంలో నిలిచిన రెండు జట్లకు రూ.1.1 కోట్లు ఇవ్వనున్నారు.

ఆషెన్ బండార అరెస్టు



కొలంబో : శ్రీలంక క్రికెటర్ ఆషెన్ బండార (26)ను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం పిలియాందలలోని తన నివాసం వద్ద పార్కింగ్ విషయంలో జరిగిన గొడవలో పొరుగింటి వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆషెన్ దాడి చేసినట్టు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. పార్కింగ్ గొడవ అంశంలో బెయిల్ లభించినా.. ఈ నెల 12న ఆషెన్‌ను న్యాయస్థానంలో హాజరు పరచాల్సి ఉందని శ్రీలంక పోలీసులు తెలిపారు. ఆషెన్ అంశంలో సొంతంగా విచారణ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని శ్రీలంక క్రికెట్ బోర్డు సీఈవో ఆష్లె డి సిల్వ అన్నారు. ఆషెన్ శ్రీలంక తరఫున ఆరు వన్డేలు, ఆరు టీ20లు ఆడాడు.

చాంపియన్స్ ట్రోఫీకి మూడో ముద్దు





మార్క్

- చాంపియన్స్ ట్రోఫీ విజేత టీమ్ ఇండియా
- ఫైనల్లో న్యూజిలాండ్‌పై 4 వికెట్లతో గెలుపు
- ఛేదనలో రోహిత్ శర్మ, శ్రేయస్ మెరుపులు



భారత్ తీన్‌మార్. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని ముచ్చటగా మూడోసారి ముద్దాడింది. ఆదివారం దుబాయ్‌లో జరిగిన టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత స్పిన్నర్ల మాయతో తొలుత న్యూజిలాండ్ 251/7 పరుగులు చేయగా.. లక్ష్యాన్ని భారత్ 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 2002, 2013 తర్వాత 2025లో చాంపియన్స్ ట్రోఫీని భారత్ సొంతం చేసుకుంది. చాంపియన్స్ ట్రోఫీ వేటలో పుష్కర కాల నిరీక్షణకు తెరపడింది. 2013లో చివరగా టైటిల్ సాధించిన భారత్.. 2017లో ఫైనల్‌కు చేరినా ట్రోఫీకి అడుగు దూరంలోనే ఆగిపోయింది. 2025లో గ్రూప్ దశ నుంచి అజేయ రికార్డుతో దండయాత్ర చేసిన టీమ్ ఇండియా 12 ఏండ్ల తర్వాత చాంపియన్స్ ట్రోఫీని మళ్లీ సొంతం చేసుకుంది.

నవతెలంగాణ-దుబాయ్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో భారత్ చరిత్ర సృష్టించింది. అత్యధిక సార్లు ఈ టైటిల్‌ను సాధించిన జట్టుగా నిలిచింది. ఆదివారం దుబాయ్‌లో జరిగిన టైటిల్ పోరులో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం సాధించింది. సవాల్‌తో కూడిన 252 పరుగుల లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి (1) నిరాశపరిచినా.. రోహిత్ శర్మ (76) అర్థ సెంచరీతో చెలరేగాడు. మిడిల్‌లో శ్రేయస్ అయ్యర్ (48, 62 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదరగొట్టగా.. కెఎల్ రాహుల్ (34 నాటౌట్, 33 బంతుల్లో 1 ఫోర్లు, 1 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (29, 40 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. బ్యాటర్లు సమిష్టిగా రాణించటంతో మరో 6 బంతులు ఉండగానే భారత్ లాంఛనం ముగించింది. అంతకుముందు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్ (2/40), వరుణ్ చక్రవర్తి (2/45) మాయ చేయగా న్యూజిలాండ్ 50 ఓవర్లలో 251/7 పరుగులే చేసింది. డార్లీ మిచెల్ (63, 101 బంతుల్లో 3 ఫోర్లు), మైకల్ బ్రేస్‌వెల్ (53 నాటౌట్, 40 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరిశారు. గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడిన కివీస్‌కు అంతిమ పోరులోనూ భంగపాటు తప్పలేదు. 2021 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన న్యూజిలాండ్‌పై రోహిత్‌సేన దుబాయ్‌లో ప్రతీకారం తీర్చుకుంది!.

రోహిత్ దంచికొట్టగా..

ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ (76) దంచికొట్టాడు. పవర్‌ప్లేలోనే ఎదురుదాడి మొదలెట్టిన రోహిత్ శర్మ ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లతో 41 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. శుభ్‌మన్ గిల్ (31, 50 బంతుల్లో 1 సిక్స్) రోహిత్‌కు చక్కటి సహకారం అందించాడు. ఓపెనర్ల మెరుపులతో తొలి వికెట్‌కు భారత్‌కు 105 పరుగులు జోడించింది. ఇక కివీస్‌కు కష్టమే అనుకున్న తరుణంలో వరుస వికెట్లు భారత్‌ను ఒత్తిడిలో పడేశాయి. విరాట్ కోహ్లి (1), శుభ్‌మన్, రోహిత్ శర్మలు 17 పరుగుల వ్యవధిలో పెవిలియన్‌కు చేరారు.

ఆదుకున్న శ్రేయస్

కఠిన పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (48) మరోసారి అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. అక్షర్ పటేల్ (29)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన అయ్యర్.. భారత్‌ను గట్టెక్కించాడు. 2 ఫోర్లు, 2 సిక్సర్లు బాదిన అయ్యర్ 62 బంతుల్లో 48 పరుగులు చేశాడు. అర్థ సెంచరీ ముంగిట అయ్యర్ నిష్క్రమించినా.. కెఎల్ రాహుల్ (34 నాటౌట్), హార్దిక్ పాండ్య (18, 18 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రవీంద్ర జడేజా (9 నాటౌట్, 6 బంతుల్లో 1 ఫోర్) లాంఛనం ముగించారు. కివీస్ స్పిన్నర్లు బ్రేస్‌వెల్, శాంట్నర్, రచిన్‌లు మెరిసినా.. కీలక పేసర్ మాట్ హెన్రీ లేకపోవటంతో భారత్‌పై ఒత్తిడి పెంచలేకపోయారు. 49 ఓవర్లలోనే 254 పరుగులు చేసిన భారత్ మూడోసారి చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది.

స్పిన్ మాయ

తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్‌ను భారత్ స్పిన్‌తో ఆడుకుంది. మిడిల్ (11-40) ఓవర్లలో ఏకంగా 30 ఓవర్ల పాటు స్పిన్నర్లను ప్రయోగించిన రోహిత్ శర్మ.. కివీస్ బ్యాటర్లకు ముకుతాడు వేశాడు. 180 బంతుల్లో 4 వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ 104 పరుగులే చేసింది. వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజాలు పిచ్ నుంచి లభించిన టర్న్‌తో బ్యాటర్లను తిప్పేశారు. కుల్దీప్ యాదవ్ వరుస ఓవర్లలో సెమీస్ సెంచరీ హీరోలు రచిన్ రవీంద్ర (37), కేన్ విలియమ్సన్ (11)ను అవుట్ చేసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. వరుణ్ పవర్ ప్లేలో విల్ యంగ్ (15), మిడిల్‌లో గ్లెన్ ఫిలిప్స్ (34)ను సాగనంపాడు. జడేజా సైతం లేథమ్ (14)ను మాయలో పడేశాడు. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లు అద్భుత ప్రదర్శన చేసి కివీస్‌ను కట్టడి చేశారు.

మెరిసిన డార్లీ, బ్రేస్‌వెల్

టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను పవర్‌ప్లే, డెత్ ఓవర్ల పరుగులే రేసులో నిలిపాయి. ఓపెనర్ రచిన్ రవీంద్ర (37) ఆరంభంలో దూకుడుగా ఆడాడు. దీంతో తొలి పది ఓవర్లలో ఆ జట్టు 69 పరుగులు చేసింది. మిడిల్ ఓవర్లలో గ్లెన్ ఫిలిప్స్ (34) మెరువగా.. డార్లీ మిచెల్ (63) అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. ఒక్కో పరుగు జోడించిన మిచెల్ కెరీర్‌లో నెమ్మదైన అర్థ సెంచరీ బాదాడు. స్పిన్‌ను ఎదుర్కొని 91 బంతుల్లో ఓ ఫోర్‌తో 50 పరుగుల చేరుకున్నాడు. 40 ఓవర్లలో 172/5తో కష్టాల్లో ఉన్న కివీస్‌ను ఆల్‌రౌండర్ మైకల్ బ్రేస్‌వెల్ (53 నాటౌట్) నిలబెట్టాడు. 3 ఫోర్లు, 2 సిక్సర్లతో చెలరేగిన బ్రేస్‌వెల్ డెత్ ఓవర్లలో కివీస్‌కు 79 పరుగులు అందించాడు. దీంతో ఆ జట్టు 50 ఓవర్లలో 251/7 పరుగుల మంచి స్కోరు చేయగల్గింది.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : విల్ యంగ్ (ఎల్బీ) వరుణ్ 15, రచిన్ రవీంద్ర (బి) కుల్దీప్ 37, కేన్ విలియమ్సన్ (సి,బి) కుల్దీప్ 11, డార్లీ మిచెల్ (సి) రోహిత్ (బి) షమి 63, టామ్ లేథమ్ (ఎల్బీ) జడేజా 14, గ్లెన్ ఫిలిప్స్ (బి) వరుణ్ 34, మైకల్ బ్రేస్‌వెల్ నాటౌట్ 53, మిచెల్ శాంట్నర్ (రనౌట్) 8, నాథన్ స్మిత్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 18, **మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 251.**

వికెట్ల పతనం : 1-57, 2-69, 3-75, 4-108, 5-165, 6-211, 7-239.

బౌలింగ్ : మహ్మద్ షమి 9-0-74-1, హార్దిక్ పాండ్య 3-0-30-0, వరుణ్ చక్రవర్తి 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 10-0-40-2, అక్షర్ పటేల్ 8-0-29-0, రవీంద్ర జడేజా 10-0-30-1.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (స్టంప్డ్) లేథమ్ (బి) రచిన్ 76, శుభ్‌మన్ గిల్ (సి) ఫిలిప్స్ (బి) శాంట్నర్ 31, విరాట్ కోహ్లి (ఎల్బీ) బ్రేస్‌వెల్ 1, శ్రేయస్ అయ్యర్ (సి) రచిన్ (బి) శాంట్నర్ 48, అక్షర్ పటేల్ (సి) ఓరౌర్క్ (బి) బ్రేస్‌వెల్ 29, కెఎల్ రాహుల్ 34 నాటౌట్, హార్దిక్ పాండ్య (సి,బి) జెమీసన్ 19, రవీంద్ర జడేజా నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 8, **మొత్తం : (49 ఓవర్లలో 6 వికెట్లకు) 254.**

వికెట్ల పతనం : 1-105, 2-106, 3-122, 4-183, 5-203, 6-241.

బౌలింగ్ : కైల్ జెమీసన్ 5-0-24-1, విలియం ఓరౌర్క్ 7-0-56-0, నాథన్ స్మిత్ 2-0-22-0, మిచెల్ శాంట్నర్ 10-46-2, రచిన్ రవీంద్ర 10-1-47-1, మైకల్ బ్రేస్‌వెల్ 10-1-28-2, గ్లెన్ ఫిలిప్స్ 5-0-31-0.

ప్రత్యేక శ్వేతవర్ణ జాకెట్స్



దుబాయ్ : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ విజేతలు ప్రత్యేకంగా రూపొందించిన శ్వేత వర్ణ జాకెట్స్ ధరించటం చూస్తున్నాం. ఇతర ఐసీసీ ఈవెంట్లలో లేని ప్రత్యేక డ్రెస్ కోడ్ చాంపియన్స్ ట్రోఫీకి మాత్రమే అనుసరిస్తున్నారు. ప్రత్యేకంగా ఇటలీ నుంచి దిగుమతి చేసుకున్న నూలును ఉపయోగించి ఈ జాకెట్‌ను తయారు చేశారు. వైట్ జాకెట్‌పై పసిడి వర్ణంలో చాంపియన్స్ ట్రోఫీ లోగో సైతం ఉంటుంది. 2009లో ముంబయికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ బబిత ఎం ఈ జాకెట్‌ను డిజైన్ చేశారు. అప్పట్నుంచి చాంపియన్స్ ట్రోఫీ విజేతలకు ఇది పోడియం జాకెట్‌గా కొనసాగుతుంది.

టైటాన్స్ కోచ్‌గా వేడ్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18



అహ్మదాబాద్ : ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మాథ్యూ వేడ్ ఐపీఎల్ 18లో కొత్త అవతారం ఎత్తాడు. ఈ సీజన్‌కు గుజరాత్ టైటాన్స్‌కు ఆసీస్ మాజీ వికెట్ కీపర్ సహాయక కోచ్‌గా సేవలు అందించనున్నాడు. గుజరాత్ టైటాన్స్‌కు 2022-24 సీజన్లలో ప్రాతినిథ్యం వహించిన వేడ్.. ఈ ఏడాది ఆటగాళ్ల వేలానికి దూరంగా ఉన్నాడు. ఐపీఎల్‌లో వేడ్ 15 మ్యాచులు ఆడగా.. అందులో 12 మ్యాచులు టైటాన్స్ తరఫునే కావటం విశేషం. టైటాన్స్ చీఫ్ కోచ్‌గా ఆశీష్ నెహ్రా, బ్యాటింగ్ కోచ్‌గా పార్థీవ్ పటేల్, సహాయక కోచ్‌లుగా ఆశీష్ కపూర్, నరేందర్ నేగిలు కొనసాగనున్నారు. ఈ మేరకు గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

ఆర్చర్ చికితకు కాంస్యం

హైదరాబాద్ : ఎన్టీపీసీ జాతీయ ర్యాంకింగ్ టోర్నీలో తెలంగాణ ఆర్చర్ చికిత కాంస్య పతకం సాధించింది. జూనియర్ కాంపౌండ్ విభాగం కాంస్య పతక పోరులో 145-142తో మాయ బిష్ణోయ్ (రాజస్థాన్)పై చికిత పైచేయి సాధించింది. తేజల్ (మహారాష్ట్ర), కుముద్ (న్యూఢిల్లీ) పసిడి, రజతాలు దక్కించుకున్నారు. పతక విజేత చికితను హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అభినందించారు.



'ఛావా' సినిమా కాదు.. ఒక గొప్ప ఎమోషన్

విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం 'ఛావా'. దినేష్ విజన్ మాడ్డాక్ ఫిల్మ్స్ నిర్మాణంలో లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. హిందీ వెర్షన్ భారీ బ్లాక్ బస్టర్‌గా నిలిచిన తర్వాత ఈ పవర్ ఫుల్ కథను గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఈనెల 7న తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేసింది. తెలుగులోనూ ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌తో హౌస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ,'ఈ సినిమాని తెలుగులో గర్వంగా రిలీజ్ చేయగలిగాను అంటే దానికి కారణం దినేష్. ఒక చరిత్రని సినిమాగా తీయడం అంత ఈజీ కాదు. అలాంటి ఒక కొత్త చరిత్రని ఇంత గొప్ప సినిమాగా ప్రేక్షకులకు ముందుకు తీసుకొచ్చిన డైరెక్టర్ లక్ష్మణ్‌కి ధన్యవాదాలు. ఈరోజు మనం ఇంత స్వేచ్ఛని, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామంటే కారణం ఆ రోజు శంభాజీ మహారాజ్ లాంటి మహావీరుల త్యాగమే. పిల్లలకు చూపించాల్సిన సినిమా ఇది. ఈ జనరేషన్‌లో ఫ్రీడమ్ వాల్యూ తెలియాలంటే తల్లిదండ్రులు ఇలాంటి సినిమాలను పిల్లలు చూపించాలని కోరుకుంటున్నాను. 'ఛావా' కేవలం సినిమా మాత్రమే కాదు. గ్రేట్ ఎమోషన్' అని అన్నారు.

'తెలుగు ప్రేక్షకులకు సినిమాపై ఉన్న ప్రేమ చాలా ప్రత్యేకం. ఇక్కడ ప్రేక్షకులు సినిమాల్ని, స్టార్స్‌ని సపోర్ట్ చేస్తున్న విధానం అద్భుతం. ఈ సినిమాని తెలుగులో రిలీజ్ చేసిన గీతా ఆర్ట్స్‌కి, బన్నీవాస్‌కి థ్యాంక్స్. ఈ సినిమాలో నా పాత్రకు వస్తున్న ఆదరణ చాలా ఆనందాన్ని ఇస్తోంది. తెలుగులో నాకు వాయిస్ ఇచ్చిన ఫణి వంశీకి థ్యాంక్స్. ఆ వాయిస్‌కి కూడా చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది' అని వినీత్ కుమార్ సింగ్ చెప్పారు.

మాడ్డాక్ ఫిల్మ్స్ దివ్యాంశ్ గోయల్ మాట్లాడుతూ,'సినిమాని ఇంత గొప్పగా ఆదరిస్తున్న తెలుగు ఆడియన్స్‌కి థ్యాంక్స్. ఈ సినిమాపై ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ మర్చిపోలేం' అని తెలిపారు.

నవచిత్రం

నిజ జీవిత ఘటనలతో..



ఆరాధ్యదేవి

దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ లేటెస్ట్ మూవీ 'శారీ'. 'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ట్యాగ్ లైన్. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్జీవి-ఆర్వి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై రవిశంకర్‌వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రాన్ని ఈనెల 21న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు.

సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో, హీరోయిన్లుగా రూపొందిన ఈ చిత్రాన్ని పలు యదార్థ ఘటనల ఆధారంగా నిర్మించారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంపై ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు రామ్‌గోపాల్ వర్మ. మేడ్చల్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్స్ కాలేజీలో రామ్‌గోపాల్‌వర్మ, నటులు సత్య, ఆరాధ్య దేవి, నిర్మాత రవిశంకర్‌వర్మ, రాంగోపాల్‌వర్మ సోదరి విజయ పాల్గొన్నారు. ప్రస్తుతం సమాజంలోని సంబంధాలపై సోషల్ మీడియా ప్రభావం ఎంత వరకు ఉంది అనే విషయంపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 2,000 మంది విద్యార్థినీవిద్యార్థులు, కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌వర్మ మాట్లాడుతూ, 'నిజజీవిత సంఘటనల ఆధారంగా సైకలాజికల్ థ్రిల్లర్‌గా వస్తున్న 'శారీ' మూవీ కోసం సోషల్ మీడియా ప్రభావం, దాని ద్వారా ప్రమాద భరితంగా జరుగుతున్న కొన్ని అంశాలను ముఖ్య కథాంశంగా తీసుకుని తెరకెక్కించం. సోషల్ మీడియాలో ఎవరెవరో ముక్కు మొహం తెలియని వాళ్ళతో పరిచయాలు పెంచుకుని, వాళ్ళ బ్యాక్‌గ్రౌండ్‌గాని, ఫోర్‌గ్రౌండ్‌గానీ తెలుసుకోకుండా గుడ్డిగా నమ్మెయడం వల్ల జరిగిన ఎన్నో ప్రమాదాల గురించి, భయంకర సంఘటనల గురించి మనం చాలా చాలా విన్నాం, చూసాం. అలాంటి నిజ జీవిత ఘటన ఆధారంగా తీసిన సినిమానే ఇది' అని అన్నారు.

ఘనంగా 'ఉక్కు సత్యాగ్రహం' శతదినోత్సవ వేడుక



విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధనౌక గద్దర్ ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'ఉక్కు సత్యాగ్రహం'. సత్యారెడ్డి స్వీయ దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. తాజాగా ఈ చిత్ర శతదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

దర్శక, నిర్మాత కారెం వినయ్ ప్రకాష్ ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, నటుడు, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ప్రసన్న కుమార్, నిర్మాత కారం మమత, గేయ రచయిత, గాయకులు మజ్జి దేవిశ్రీ, దర్శకులు రాకేష్ రెడ్డి, యాది కుమార్, శుభశ్రీ , అన్నె ఇవాంజెలిన్‌తో పాటు పలువురు దర్శక, నిర్మాతలు, నటీనటులు తదితరులు వైజాగ్ పౌర గ్రంథాలయంలో జరిగిన ఈ వేడుకలో పాల్గొని దర్శక, నిర్మాత సత్యారెడ్డిని వెండి కిరీటం, శాలువా, గజమాలలతో ఘనంగా సన్మానించారు.

దర్శక, నిర్మాత, హీరో సత్యారెడ్డి మాట్లాడుతూ,'ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా 150 థియేటర్లో విడుదల చేశాం. కొన్నిచోట్ల శత దినోత్సవాలు కూడా జరుపుకోవటం ఆనందంగా ఉంది. తెలుగు జాతి కోసం ఉక్కు సత్యాగ్రహం సినిమాను నిర్మించా. ఇండియా గొప్పతనం ప్రపంచానికి తెలియజేయడం కోసం త్వరలో 'ఇండియా ద గ్రేట్' అనే బాలీవుడ్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా' అని చెప్పారు.





అద్దెభవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు..!

970 కేంద్రాల్లో.. సొంత భవనాలు 23 మాత్రమే

202 కమ్యూనిటీ హాల్స్‌ల్లో నిర్వహణ. 682 కిరాయికే..!

ప్రతినెలా రూ.16-18 లక్షలు చెల్లిస్తున్న వైనం

అరకొర వసతులతోనే కాలం వెళ్లదీత..

భవిష్యత్‌లో ప్రీ స్కూల్ నిర్వహణకు ఇబ్బందులే..!

నవతెలంగాణ-సిటీబ్యూరో

పసి పిల్లలు అక్షరాలు నేర్చుకునే కేంద్రాలైన అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె ఇండ్లు, కమ్యూనిటీ హాల్‌లో నడిపిస్తున్న దుస్థితి రాజధానిలో నెలకొంది. దీంతో ఈ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత పాలకుల వైఫ్యలమో? అధికారుల నిర్లక్ష్యమో? అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడంలో ఏండ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది. ఫలితంగా కిరాయి ఇండ్లలోనే వీటి నిర్వహణ కొనసాగుతోంది. దీంతో చాలా మంది తమ పిల్లలను అంగన్‌వాడీలకు పంపించేందుకు అనాసక్తి చూపిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా మార్చాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీటి నిర్వహణ అంశం చర్చకు దారితీసింది.

హైదరాబాద్ జిల్లా పరిధిలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) కింద ఐదు ప్రాజెక్టులున్నాయి. జిల్లాలోని చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి, సికింద్రాబాద్‌లోని ఆయా ప్రాజెక్టుల పరిధిలో 970 అంగన్‌వాడీ కేంద్రాలుండగా.. వీటిల్లో 801 మంది టీచర్లు, 614 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, 1 నుంచి ఆరేండ్లలోపు వయసు ఉన్న చిన్నారులతో కలిపి మొత్తం జిల్లావ్యాప్తంగా 1.27లక్షల మంది లబ్దిదారులున్నారు. వీరిలో ఏడాదిలోపు పిల్లలు 4,832 మంది ఉండగా, మూడేండ్లలోపు పిల్లలు 55,695 మంది, ఆరేండ్లలోపు పిల్లలు 55,764మంది ఉండగా.. గర్భిణులు, బాలింతలు కలిపి 11,347 ఉన్నారు. అయితే హైదరాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కేవలం 23 మాత్రమే ఉండగా.. మరో 202 వివిధ శాఖలకు చెందిన (కమ్యూనిటీ హాల్స్) భవనాల్లో కొనసాగుతుండగా.. 682 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాస్తవానికి గర్భిణులు, బాలింతలు, ఆరేండ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. గత ప్రభుత్వం రెండేండ్ల క్రితం లబ్దిదారుల సంఖ్యకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా పరిమితికి మించిన జనాభా ఉన్నచోట, ఇప్పటివరకు కవర్ చేయని స్లమ్ ఏరియాల్లో ఈ కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. సంబంధిత అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినప్పటికీ.. వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఖర్చుతో కూడుకున్న పనికావడంతో అధికారులు సైతం ఆసక్తి చూపించడం లేదు. దాతలు ఎవరైనా ముందుకొస్తే తప్ప, కొత్త భవనాలు నిర్మించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

స్థలాలున్నా.. నిధులకు కటకట..!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేండ్లుగా అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలకు సముచిత బడ్జెట్ కేటాయించకపోవడంతో సొంత భవనాలు లేక ఏండ్లుగా అద్దె ఇండ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. 970 కేంద్రాల్లో కమ్యూనిటీ హాళ్లు పక్కనపెడితే.. 682 భవనాలకు కిరాయిల రూపంలో ప్రతినెలా సుమారు రూ.16-18లక్షల వరకు చెల్లిస్తుండటంతో నిర్వహణ భారం పెరుగుతోంది. మరోవైపు మహిళా శిశుసంక్షేమ శాఖకు జిల్లాలోని వివిధ మండలాల్లో దాదాపు 30 స్థిర ఆస్తులున్నాయి. ఈ స్థలాలు కబ్జాలకు గురికాకుండా ఉండేందుకు.. ఆ స్థలాల్లో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. బోరబండలో నాట్కో సంస్థ సహకారంతో దాదాపు రూ.40లక్షలకు పైగా నిధులు వెచ్చించి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. నిధుల లేమితో మిగతా వాటిల్లో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో భవిష్యత్ తరాల కోసం ఉపయోగపడే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని విన్నపాలు వెలువడుతున్నాయి. సొంత భవనాలు లేక, అద్దె భవనాల్లో వీటి నిర్వహణ వల్ల నగరంలోని పలు బస్తీల్లోని పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడానికి తల్లిదండ్రులు ఆలోచిస్తున్న పరిస్థితులున్నాయి. ఇలాంటి వాటిల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన మేరకు భవిష్యత్‌లో ప్రీ స్కూల్ నిర్వహణకు ఇబ్బందులు కలిగే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం ఐసీడీఎస్‌కు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 30 స్థలాల్లో భవనాలు నిర్మించేందుకు సరిపడా బడ్జెట్ లేక.. మరోవైపు సొంత భవనాలు లేక.. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమే కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అవసరమైన చోట అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు లబ్దిదారులు కోరుతున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan, 1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.